నవభారతి



సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

మూల్యం : రూపాయి

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

నవంబరు 1958

మూల్యం · రూపాయి

నవభారతి కార్యాలయం
గాంధీనగరం ★ విజయవాడ-2

నవ భారతి ★ నవంబరు 1958

విషయ సూచిక

చిత్రములు



పార్వతీ పరమేశ్వరులు

★

చిత్రశిల్పి·
శ్రీ ఎ పి మూాబె

★



దుర్గపూజ ★ చిత్రశిల్పి : శ్రీ అంకాల వేంకటసుబ్బారావు

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 1 | విజయవాడ ★ నవంబరు 1958 | సంచిక 6

నెహ్రూ జన్మదినోత్సవము

భారతీయులందరూ నవంబరు 14 తేదీన పండిట్ నెహ్రూ జన్మదినోత్సవం జరుపుకుంటున్నారు. ఇప్పటికి ఎన్నో జన్మదినోత్సవాలు జరిగిపోయాయి. జరిగినచరిత్రలోని అనుభవాలను, జరుగనున్న చరిత్రకు మార్గాలను మనం పరిశీలించుకోవాలి.

స్వపరిపాలన వచ్చింది. స్వరాష్ట్రాభిమానం స్వజాతీయాభిమానం, స్వభాషాభిమానం, పెంపొంది బహుముఖంగా వ్యాపిస్తుందని ఆశించాం ఇది ఇలా ఎందుకు ఆశించామన్న ప్రశ్న రావచ్చు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పుకోవాలి.

మనది భారతదేశం. మన జాతీయత, మన సంస్కారం, మన సంస్కృతి, మన విద్య. మన విజ్ఞానం, మన వేదాంతం, మన కళలు, మన సాహిత్యం– ఒకటేమిటి; మనిషి ప్రకృతి, ప్రవృత్తి ప్రవర్తనలకు సంబంధించిన అన్నివిద్యలూ మనం హస్తగతం చేసుకోవచ్చునని ఆశించాం. మనమన ఆశలే, మనం జీవితంలో కృతనిశ్చయులమై, మనం మనలను పరిపాలించుకోవడానికి తగిన యోగ్యతార్హతలను సంపాదించుకునేలా చేసినవి. అయితే ఈనాడు మనం ఆశించిన ఆశలు తీరలేదని మనలోమనమే ఎందుకు అసంతృప్తి చెందుతున్నాం? మనం అసంతృప్తి చెందడంలో తప్పు ఉన్నదా; లేదా? అని సందేహం కలుగవచ్చు. ఇందుకు సమాధానం చెప్పుకోవాలి

పరులదాస్యంలో మనవన్నీ మనకు కాకుండా పోయినవని విచారించాం. మన సాంప్రదాయం, మనసంస్కృతి, మనజాతీయత, మనవిజ్ఞానం, విశ్వజనీనమైనవని విపరీతప్రచారం చేశాం. ఆ ఈప్రచారంలోని అసందర్భఅనుచిత ప్రచారాల ఫలితమే మన ఈనాటి అసంతృప్తికి కారణమని స్పష్టపడుతున్నది.

ఇంగ్లీషు మనజాతీయజీవనంలో ఇంకిపోయి అది మనమనస్సంతటా వ్యాపించి, అది లేనిదే మనము జీవించలేమని అనిపించేలా చేస్తున్నది. ఇదీ వాస్తవమైన కథ.

ఏదైనా ఒక విన్నపం ఎవరికైనా పంపుకోవాలంటే, ఇంగ్లీషులో పంపితేనే గౌరవముంది. ఎవరికైనా ఒక వార్త పంపించాలంటే, అది తంతిరూపంగా పంపుతూ ఇంగ్లీషులోనే ఉంటే హుందాగా ఉంటుందని భావిస్తున్నాం. ఒక్కటేమిటి? ఏక్రొత్త సంఘనిర్మాణం జరిగినా, ఏక్రొత్త రాజకీయపార్టీ ఏర్పడినా, ఏక్రొత్త వ్యాపారసంస్థ నిర్మింపబడినా, ఏక్రొత్త విద్యాలయం స్థాపించబడినా ఇంగ్లీషే ప్రధానరాజ్యం చేస్తుంది. ప్రభుత్వమూ, ప్రజాహిత సంస్థలూ, విద్యాలయాలూ, విజ్ఞానకేంద్రాలూ– అన్నీ దానినే ఆశ్రయించి జీవిస్తున్నాయి. ఇది

ఇంత బలంగా మనజీవితంలో ఎందుకు ప్రవేశించిందో ఒక్కరూ యోచించడం లేదనిపిస్తుంది. శతాబ్దాల తరబడి ఉత్తమసంస్కృతీ సంస్కార ప్రభావవిలసితమైన భారతజాతీయ జీవనంలో ఇంగ్లీషు ఇంత కొద్దికాలంలోనే ఇంత గొప్పస్థానాన్ని ఎలా ఏర్పరుచుకోగలిగిందీ ఒక్కరూ యోచించడం లేదనిపిస్తుంది. ఇందుకుతగిన యోచన చేయకుండా, ఈ సమస్య పరిష్కరించబడదు ఈ సమస్యా పరిష్కారానికి జాతీయ నాయకులందరూ ఆలోచనచేస్తున్నారు కాని యోచనచేయడం లేదు. ఇది యోచన చేయబడనంత వరకూ పరిష్కరించబడే సమస్యమాత్రం కాదు. ఈసమస్య పరిష్కరించబడ నంతవరకూ భారతజాతీయతా లేదు, భారత జాతీయ వికాసమూ లేదు, భారతజాతీయ సంస్కృతి అసలే ఉండదు.

మనకూ రసాయనిక శాస్త్రం ఉంది. మనకూ పదార్థ విజ్ఞానశాస్త్రం ఉంది. మనకూ భూగర్భ శాస్త్రం ఉంది. మనకూ గృహనిర్మాణ శాస్త్రం ఉంది. మనకూ వైద్యశాస్త్రం ఉంది మనకూ గణితశాస్త్రంఉంది మనకూ ఖగోళశాస్త్రం ఉంది. ఒకటేమిటి?-సర్వకళలకూ శాస్త్రాలకూ మనదేశమే పుట్టినిల్లు అనడంలో అతిశయోక్తి అణుమాత్రం లేదు. అయినప్పటికీ ఈనాడు భారతీయులలో ఈజిజ్ఞాస, ఆత్మవిశ్వాసం కలిగించేదిగా మాత్రం లేకుండా చేసింది. ఇది ఇంగ్లీషువారి యుక్తి. వారు నయాన, భయాన భారతీయులను యుక్తియుక్తంగా వంచించారు. ఆశపెట్టారు. లాలించారు ముద్దు ముద్దు మాటలు నేర్పి మనపై మనకు విశ్వాసం లేకుండా చేశారు. మనకు మనం ఈనాడు నిస్సహాయులంగా ఉన్నాం. ఒక్క ఉండడం మాత్రమే కాదు. మనం వాచ్యా, కర్మణా, ఇంగ్లీషు వారి మానసపుత్రులంగా బ్రతుకుతున్నాం. ఇంతగా ఎందుకు అయిపోయామో ఆలోచించండి. ఇంగ్లీషులో తోళ్ళశాస్త్రం చదివితే అధికంగా ఆర్జించవచ్చు ఇంగ్లీషులో గొప్ప విద్యావంతులమైతే గొప్ప గొప్ప పదవులు అలంకరించవచ్చు. గొప్ప గొప్ప ఉద్యోగాలు సంపాదించవచ్చు లక్షలకు లక్షలు గడించనూవచ్చు జీవితంలో ఎలాగైనా గడించడం ఒక్కటే పరమార్థంగా ఎంచేస్థితిలో మనం ఈనాడున్నాం. ఇది చాలా విచిత్రమైన స్థితి. ఇది సామాన్యమైన స్థితిమాత్రం కాదు. ఇందులోనుంచి బయట బడడం అంత తేలికగా జరుగుతుందని అనుకోవడంతప్పు. ఈతప్పు గ్రహించకనే భారత రాజ్యాంగంలో జాతీయభాష హిందీ కావాలని చట్టంగా రూపొందించారు. చట్టం చట్టంగానే ఉంది. నాయకుల వాగ్దానాలు వాగ్దానాలుగానే ఉన్నాయి. ఆచరణకూ, వాగ్దానాలకూ సంబంధం మాత్రం పూజ్యంగా ఉంది. ఎందుకు ఇలా జరుగుతోందో ఇప్పటికైనా యోచన చేస్తే బాగుండును. కాని ఇలా యోచన చేయడంలోని సాధ్యాసాధ్యాలను గమనిస్తే ఇంతలో ఇది జరిగేదని కాదని తేలిపోతుంది.

ఈ దేశంలో మార్పు రావాలని కోరేవారందరూ ఈ మార్పును గురించి ప్రబోధిస్తూ, చేసే రచనలు మాత్రం ఇంగ్లీషులోనే సాగిస్తున్నారు. ఈ దేశ

హితం కోరే నాయకులందరూ, ఇంగ్లీషును విడిచి మరోవిధంగా ప్రవర్తించడం సాధ్యంకాదని తెలిసికూడా, ఇలాంటివి ఎందుకు చేస్తారో అనూహ్యంగా ఉంది. ఇంతేకాదు అన్ని కళారంగాలలోను, అన్ని విద్యారంగాలలోను, కృషి చేస్తున్న వారందరికీ ఇదే మానసిక వ్యాధి ఏర్పడి ఉంది తమతమ రచనలు ఇంగ్లీషులోకి అనువదించబడి అవి అచ్చు అయితే అప్పుడు తమ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయని వారంతా విశ్వసిస్తున్నారు ఇది సామాన్యమైన మానసిక వ్యాధిగా కనుపించడంలేదు అందరూ 'జాతీయత జాతీయత' అని అంటూనే జాతికి తీరని అపచారం చేస్తున్నారు. ఇది భారత జాతీయతకు గొప్ప ఆపత్తుగా పరిణమించిందని చెప్పక తప్పదు ఈ ఆపత్తునుండి జాతీయౌన్నత్యాన్ని కాపాడుకో గలగడం సామాన్యంకాదు అయినా ప్రయత్నం చేయక తప్పదు ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నం చెయ్యడమే పురుషధర్మం.

"తమ కార్యంబుఁ బరిత్యజించియుఁ బరార్థప్రాపకుల్ సజ్జనుల్
దమ కార్యంబు ఘటించుచున్ పరహితార్థ వ్యాపృతుల్ మధ్యముల్
దమకై యన్యహితార్థ ఘాతుకజనుల్ దైత్యుల్ వృథాన్యార్థభం
గము గావించెడు వార లెవ్వరొ యెఱుంగన్ శక్యమే యేరికిన్"

అన్న ఆర్యోక్తిని ఆదర్శంగా పెట్టుకున్నప్పుడే ఉత్తమ కార్యసాధన చేయడం సాధ్యమవుతుంది

ప్రపంచంలో అనేకజాతులు తమతమ ధర్మాన్ని, తమతమ ప్రాంతీయ భాషా సంస్కార సంస్కృతులనే అనుసరించి పెంపొందించుకోవడం జరుగుతుంది. ఒక్క మనకు మాత్రమే ఈ సూత్రం ఎందుకు వర్తించదో యోచన చెయ్యమని కోరుతున్నాం జపాను, జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ, రష్యా, చైనా మొదలయిన దేశాలవారు తమతమ జాతీయ భాషలలోనే విద్యా విజ్ఞానాలను సముపార్జించి, ఉన్నత విశ్వవిద్యాలయములను ఏర్పరుచుకుని, ఉత్తమజాతీయ ప్రబోధం చేస్తూనే ఉన్నారు. వారికి ఇంగ్లీషు రానంతమాత్రాన, వారు ఉన్నత ఉత్తమ విజ్ఞాన సంపన్నులుకారని ఎవరూ త్రోసివేయడం లేదు ప్రపంచజనాభాలో బహు తక్కువసంఖ్య కలవారు మాత్రమే ఇంగ్లీషు చదువనూ వ్రాయనూ నేర్చినవారున్నారు. అంతేకాదు. శాస్త్రీయ పదజాలం ఇంగ్లీషుభాష వల్లనే సుకరమవుతుందన్న వాదన ఒకటిఉంది ఇదికూడా ఉచితమైన వాదనకాదు. ఇంగ్లీషువల్ల ఏ శాస్త్రీయ పదనిర్వచనా క్రొత్తది ప్రత్యేకంగా ఏర్పడిలేదు. ప్రపంచంలోని భాషా సాంప్రదాయాలనూ, సంస్కార సంస్కృతులనూ పరిశీలనచేస్తే ఇది బోధపడుతుంది. ఒక్క ఇంగ్లీషుమాత్రమే చదివి మరి ఏ ఇతరభాషా సంస్కృతులను పరిశీలించనివారుఏది చెప్పినా చెప్పవచ్చు. అయితే అదిఅయథార్థం అవకుండాపోదు.

ప్రపంచంలోని జాతులన్నీ సన్నిహితం కావాలనుకుంటున్న కాలంలో ఏదో ఒకభాష ప్రపంచమంతటికీ పరివ్యాప్తమయితే బాగుంటుందని అనుకో

వచ్చు. మనం అనుకోవడంలో ఎవరి అభ్యంతరమూ ఉండదు. అది తీరా కార్య రూపం ధరించవలసి వస్తే చిక్కులు ఏర్పడక తప్పవు మనకు మన అనుభవమే ఉంది జాతీయభాష హిందీఅయితే పరిపాలన సుగమమౌతుందని కలలుకన్నాం. మనం కన్నకలలే ఈనాడు మనకు అప్రత్యక్షాలని రుజువుచేస్తున్నాయి. ఇంత కన్నా స్వానుభవం వేరవసరం లేదు.

హిందీపేరు ఎత్తితే, కొందరు హిందూస్థానీ జాతీయభాషగా రూపొందితే బాగుండునంటున్నారు. మరికొందరు హిందీ, హిందూస్థానీలు ఏవి జాతీయ భాషలయినా, మానెత్తిపై సవారీ చేయడానికి చేస్తున్న ఉత్తర హిందూస్థానం వారికుట్ర అంటున్నారు. ఇవి వాదోపవాదాలయితే దేశం ఛిన్నాభిన్నమయి పోతుందనుకునేవారు కొందరు, కొంతకాలం ఈ జాతీయ భాషావాదం వాయిదా వేస్తే సరిపోతుందంటున్నారు. ఇది మనజాతీయ పురోభివృద్ధికి తోడ్పడేయోచన అవునో, కాదో ప్రతిఒక్కరూ ప్రశ్నించుకుని సమాధానం చెప్పుకోవాలి. స్వరాజ్య పదనిర్వచన చేయడంలో ఎన్నిచిక్కులు మన ఉద్యమనిర్మాతలు ఎదుర్కొన్నారో- అన్నిచిక్కులూ ఈనాడు ఈ సమస్యాపరిష్కారంలో మన ముందున్నాయి. వీటిని మనం పరిష్కరించుకోవాలి

పండిట్ నెహ్రూ ఒక్కొక్కజాతి ఒక్కొక్క పద్ధతిలో సోషలిజం అమలు చేసుకుంటుందని చెప్పుస్తున్నాడు. తను చెప్పేది జాతీయపద్ధతి అంటున్నాడు. ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క జాతీయత ఉంటుందని అంగీకరిస్తున్నాడు. సోష లిజం భారతదేశంలో భారతీయుల సాంప్రదాయాలకు అనుగుణంగా ఆచరించ బడి అమలు చేయబడుతుందని ప్రపంచంలో సోషలిస్టు కాముకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాడు. సోషలిజాన్ని భారతీయులందరూ జాతీయపద్ధతిలో ఆచరణలో పెట్టాలని వక్కాణిస్తున్నాడు. సోషలిజాన్ని ఏర్పరచడానికి ఏ విజ్ఞప్తులయితే జాతీయత పేరుతో చేయబడుతున్నాయో అవే విజ్ఞప్తులు, జాతీయభాషా సంస్కార సంస్కృతీ విజ్ఞానాల విషయంలో కూడా రూపొందించబడితే భారత జాతీయ ఆత్మవికాసానికి అవి దోహదం చేస్తాయని ఆశించవచ్చు పండిట్ నెహ్రూ భారత ప్రధానిగా, ఈ కార్యభారాన్ని నిర్వహించి, సక్రమ పరిష్కార మార్గాన్ని సూచిస్తూ, తన జన్మదినోత్సవ సందర్భంలో ఒక ప్రకటన చేస్తే, అత్యుత్తమంగా ఉంటుందని మేము భావిస్తున్నాం నెహ్రూ జన్మదినోత్సవం జరుపుకున్నందువల్ల భారతీయులు తమ ఆత్మోన్నత్యానికి మార్గం ఏర్పడుతుందని విశ్వసిస్తే అదే నెహ్రూ జన్మదినోత్సవానికి సార్థక్యత సమకూరుస్తుంది. జన్మ దినోత్సవం జరుపుకోవడంలోని సంస్కృతి,సంస్కారం ఇదేనని మా అభిప్రాయం. స్వరాజ్యాన్ని ఏర్పరచుకోవడంలోని, స్వతంత్ర వీరుల జన్మదినోత్సవం జరుపు కోడంలోని ఔచిత్యం ఇదేనని మాభావం.జన్మదినోత్సవాలకుజాతీయపురోభివృద్ధే ప్రాతిపదిక అయితే జగత్కల్యాణం తప్పక సంప్రాప్త మవుతుందని మావిశ్వాసం.

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౨

బింబమున కనురూప మగు బింబము ప్రతిబింబము. ధ్వని కనురూప మగు ధ్వని ప్రతిధ్వని. అభిజ్ఞానమున కనురూపమగు నభిజ్ఞానము ప్రత్యభిజ్ఞానము. ఇటులే సంవేదనమునకు అనురూపమగు సంవేదనము ప్రతిసంవేదనము

బింబమునకును ధ్వనికిని అనుకూలము లగు ప్రతిఫలకములు ఉండవలయును జలము బింబమునకును గుహ ధ్వనికిని అనుకూలము లగు ప్రతిఫలకములు. ఇటులే స్వరూపద్రష్ట యీ ప్రతిసంవేదనమునకు అనుకూల ప్రతిఫలకుఁడు.

మన మొక ఘటమును చూచునపుడు 'ఇది ఘటము' అను సంవేదనము లేక జ్ఞానము కలుగును ఈ జ్ఞానమునందు గ్రహీతృ గ్రహణ గ్రాహ్యము లిమిడి యున్నవి అనగా 'నేను ఘటము చూచుచున్నాను' అని. నేను=గ్రహీత. చూచుట=గ్రహణము. ఘటము=గ్రాహ్యము

'ఇది ఘటము' అను జ్ఞానమున 'నేను ఘటము చూచుచున్నాను లేక ఎఱుఁగుచున్నాను' అను జ్ఞానముగాక 'ఘటము' అను జ్ఞానమే ఉండుటవలన ద్రష్టకు వృత్తి సారూప్యము (1) కలుగుచున్నది. చిత్త మటు ఘటముతోడను ఇటు ద్రష్టతోడను ఉపరక్త మయినపుడు (2) 'ఘటము' అను జ్ఞానమే కలుగును గాని 'నేను ఘటమును చూచుచున్నాను లేక ఎఱుఁగుచున్నాను లేక ఎఱుఁగుదును' అను జ్ఞానము కలుగదు. ఈ జ్ఞానము సమనంతరమున గాని కాలాంతరమున గాని ప్రతిఫలింపవచ్చును ఇది అనుభూతమగు విషయము నున్నదాని నున్నటు లెఱుఁగుట తార్కికులు దీని నను వ్యవసాయమని చెప్పుదురు. ఇది

---

(1) వృత్తి సారూప్య మితరత్ర ౧-౪ 'ఘటైకాకారధీస్థా చిద్ఘటమే వావ భాసయేత్'- పంచదశి, కూట ౪. పోల్చి చూచునది.

(2) వాచస్పతి ౧-౪- సూత్రమున - 'పురుషుఁడు లోక ప్రత్యక్ష గోచరుఁడు కాఁడుగాని ఆగమానుమాన గోచరుఁడు' అని చెప్పి 'ద్రష్టృదృశ్యోపరక్తం చిత్తం సర్వార్థమ్-౪-౨౩.' అను సూత్రమున. - 'నీలాద్యనురక్త మగు చిత్తము నీలాది వస్తువును ప్రత్యక్షగ నెలముకొలిపి నటుల ద్రష్టృచ్ఛాయను బడసి దను రక్తమగు చిత్తము ద్రష్టను సైతము ప్రత్యక్షముగనే నెలకొలుపుచున్నది. నీలమును నేఁ జూచుచున్నాను అని యిరుమొగముల యెఱుక ఉన్నదికదః కాన జ్ఞేయమువలె జ్ఞాతయు ప్రత్యక్షసిద్ధుఁడు' అని స్వోక్తి విరోధముగా జెప్పెనని కొందఱందురు కాని ఇదికాదు ఇచటి ద్రష్టృపదమునకు వాచ్యము విరూపద్రష్ట, లక్ష్యము స్వరూప ద్రష్ట ఈ రెండును కలిసివచ్చుట కేక ద్రష్టృపదప్రయోగము వాచ్యార్థమగు విరూప ద్రష్ట (గ్రహీత) ప్రత్యక్షప్రమితుఁడే. ఈ ద్రష్టవెనుకనే ఉన్న స్వరూప ద్రష్ట అనుమాన ప్రమితుఁడు. సాక్షాత్తు చిత్తమునకు విషయుఁడు కాఁడు. మఱి దానికి నిమిత్త కారణము. ఈ సంగతి పై వాక్యములందు కలదు. అయినను నీటిలో చంద్రబింబమువలె విడిగా నెలకొలుపఁబడదు. ఇంత మాత్రమున నది అప్రత్యక్ష మనరాదు బింబము జలములో నున్నదనుట అప్రమాణము కాన చంద్రరూపమందు అది (ప్రతిబింబము) అప్రమాణమా?

స్మృతిరూపము. ఇది ఒకవృత్తి. (3) ఇది ప్రత్యక్షప్రమాణ రూప మగు వృత్తి కాదు. సుఖాదులవలె మానస ప్రత్యక్షమును కాదు. ఇది స్వరూప పురుషునిచే భాసింపఁజేయఁబడి (4) 'నేను ఘటము నెఱుఁగుదును' అని బుద్ధిచే ప్రతిసంవిదిత మగును. (అనువ్యవసితమగును) ఈ ప్రతి సంవేదనమునకు హేతువు స్వరూప ద్రష్ట

ఈ స్వరూపద్రష్ట అట్టి యపుడు అనుభూతుఁడగునా? ఊఁహూఁ కాఁడు. ఈబుద్ధి ప్రతిసంవేదనమును (అను వ్యవసాయమును) బట్టి యీ ప్రతిసంవేదనమున కొక హేతు వుండవలయునని అనుమానముచే బుద్ధిప్రతిసంవేత్త దీనికి హేతువని గ్రహింతుము. ఇచట బుద్ధి యనఁగా 'నేను ఘటము నెఱుఁగుదు' నను అను వ్యవసాయిక బుద్ధి యని గుర్తింపవలెను. ఈబుద్ధియే అనువ్యవసాయిక గ్రహీత

అను వ్యవసాయమును విడఁబఱచిన యెడల ఘటము వేఱు, ద్రష్ట వేఱు అనియును ఘటప్రత్యక్షరూపమగు వ్యవసాయ ప్రధాన వృత్తిలో (ఇది ఘటము) ఘట ద్రష్టల వేఱిమి తెలియదనియును ఏర్పడుచున్నది. ఘట జ్ఞానముతోఁగూడిన ఈ 'నేను'ను భాసింపఁజేయుటకు ప్రతిఫలకుఁ డొకఁ డుండవలయును. ఇటులు ప్రతిఫలింపఁజేయు నతఁడే ప్రతిసంవేది, మూలద్రష్ట.

ద్రష్ట బుద్ధి ప్రతిసంవేది యనఁగా బుద్ధిని చూచువాఁడు అని మాత్రమే చెప్పి కొందరు ఇటులు సమన్వయింతురు: చిత్ ప్రతిబింబము పడుటచే బుద్ధి చైతన్య మయమయి ఇటు ఘటాదులను ప్రకాశ పఱుపను అటు చిత్సత్త ననుభవింపను సమర్థ మగును. బుద్ధి చిత్ ప్రతిబింబ స్వరూపము. ఐనను భాషలో ప్రకటించు పట్టున బుద్ధిలో చైతన్యము ప్రతిబింబించు'నని అందుము. బుద్ధియను అద్దమున పురుషుఁడు ప్రతిబింబించుటఁ జేసియే పురుషుఁడు బుద్ధిప్రతిసంవేదియని ఎన్నఁబడును పురుషుఁడు తన సత్తా, ప్రకాశ, రూపమగు ప్రతిబింబముచే బుద్ధి మాత్రమును జూచును.

ఈ ఉపపాదనలో విశేషము లేదు. సంవేది యనిననే సరిపోవుచుండఁగా ప్రతిసంవేదియని యనుటలో నేదో ఉద్దేశము ఉండవలదా?

'నేను' అనుబోధ ఉత్తరక్షణమున 'నేను నన్నెఱుఁగుదున' ను ప్రతిబోధ మగును ఇది ప్రతిఫలితబోధ లేక దృశిబోధ ప్రతిబింబమున కద్దము కారణమైనటులు ఈ ప్రతిబోధమునకు కారణము స్వబోధ రూపుఁడగు పురుషుఁడు. ప్రతిసంవేది శబ్దముచే స్వరూపద్రష్ట లక్షితుఁ డగును. ప్రతిసంవేదయిత అను నర్థమున ప్రతిసంవేది అని ప్రయుక్తమని తెలివిడి.

---

(3) అనుభూత విషయాఽసంప్రమోషః స్మృతిః ౧-౧౧.

(4) 'ఘటస్య జ్ఞాతతా బ్రహ్మచైతన్యే నావభాస్యతే ౪.
'ధీ వృత్త్యా భాసకుంభానాం సమూహో భాస్యతే చితా' కూట - ౧౪.
అను పంచదశితో పోల్చి చూచునది.

'నేను నన్ను ఎఱుఁగుదును' అనునెడ కర్తయే కర్మ అగుచున్నది. ఇటు లగుట అసంభవము ఇది కర్తృ కర్మ విరోధము అయినను మనమిటు లను చున్నాము. దీనికి హేతువేమి?

అసలీ 'నేనే' మి, నేను నన్ను ఎఱుఁగు టేమి?

'నే నెఱుఁగువాఁడ న' ను అనుభవము మన కందఱకును గలదు. ఈ యెఱుక బాహ్యములగు ఘటాదికములయు ఆంతరంగికములగు రాగక్రోధాదు లదియు నగు నెఱుక. ఈ ఘటాదులను క్రోధాదులను ఎఱుఁగు 'నేను' వృత్తి సారూప్యము పొందిన యది. ఇది తన్నుఁదా నెఱుఁగు నెఱుక కాదు. ఇతరుల క్రోధాదులకు మనము సాక్షులముగా నుండవచ్చును అపుడు మనము క్రోధాదు లచే నుపరక్తులము కాము. (5)

'నా కపుడు క్రోధము కలిగి క్రుద్ధుఁడ నయితిని, ఈ తడవ క్రోధము కలుగకుండఁ జూచుకొనవలెను' అను ప్రవృత్తి మనలో కొందఱకు కనఁబడు చున్నది (6) కావున 'నేను వేఱు, చిత్తము వేఱు' అని ఏర్పడుచున్నది కాని వృత్తిసారూప్యము కలిగి సాక్షిగా ఉండనందువలన ఈ భేదము అనుభవమునకు రాఁజాలక యున్నది.

చిత్తమే తన్నును క్రోధాదికమును ఎఱుఁగునని ఏల అనరాదు? అందము. అపుడు జ్ఞాతయగు నేను+జ్ఞేయ మగు క్రోధాదికము=వెరసి, చిత్తమగుచున్నది. అపుడు జ్ఞేయాంశము అనఁగా జడాంశమగు క్రోధము, జ్ఞానము అనఁగా అజడ మగు నేను, కలిసిన ఈ జడాజడమగు చిత్తమును అనఁగా గ్రహీతను ఎఱుఁగువాఁ డెవఁడను ప్రశ్న ఉదయించును. కావున మనలో తానే తన్నెఱుఁగు నొకానొక తత్త్వము ఉండి యుండవలయును అని తేలుచున్నది ఆ తత్త్వము పురుషుఁడు లేక ద్రష్ట ద్రష్ట స్వాభాసుఁడు అతఁ డొకఁడు మాత్రమే తన్నుఁ దా నెఱుఁగగలవాఁడు అతనియెడ కర్తృ కర్మ విరోధము లేదు. వికారియగు గ్రహీత 'నేను నన్నెఱుఁగుదు'నని అనుకొనుటకు కారణము దృశిరూపుఁ డని అనుమానముచే కనుఁగొనఁగలము స్వరూప పురుషుని ఎఱుకను గ్రహీతదిగాఁ జేకొని వాడుచున్నాము గావున నిది లక్షణామూలకము.

---

(5) వార్తికకారు లిటుల చెప్పుచున్నారు -
'దుఃఖీ యది భవేత్ సాక్షీ కస్సాక్షీ దుఃఖితో భవేత్
దుఃఖిన స్సాక్షితా నాస్తి సాక్షిణో దుఃఖితా కుతః?

(6) స్వబుద్ధి ప్రచార ప్రతిసంవేదనాత్ సత్త్వానాం ప్రవృత్తి
ర్దృశ్యతే - 'క్రుద్ధోహం భీతోహ మముత్ర మే రాగోఽముత్ర మే క్రోధ' ఇతి. ఏతత్
స్వబుద్ధే రగ్రహణే న యుక్తమ్' వ్యాసభాష్య ౪-౨౦

అహంవృత్తౌ చిదాభాసః కామక్రోధాదికాసు చ సంవ్యాప్య వర్తతే తప్తే లోహే వహ్ని ర్యథాతథా 'స్వంమాత్రం భాసయేత్తప్తం లోహం నాన్యత్కదాచన ఏవ మాభాససహితా వృత్తయః స్వస్వభాసికాః' కూట-౧౮-౨౯ అను. పంచదశితో పోల్చి చూచునది

ఘనము నిదురలో నుండఁగా నడికిరేయి ఇంటి వెలుపల పిలుపు వినఁబడి బయటికి వచ్చితి మనుకొందము ముంగిలి యెల్ల చిమ్మచీకటి. ఎట్టయెదుట లోఁగడ నెఱిఁగిన ముకర మున్నది. అది కనఁబడదు కాని గుఱుతు వచ్చును దానిని కన్నులారఁ జూచిన చందముగా తప్పుకొని పోవుదుము. ఈ స్మృతి అపుడు మనకు భాసింపఁజేసిన దెవరు? మూలద్రష్టకాక మఱి యెవరు? కొంద ఱదృష్టమందురు. అదృష్టమే ఆ ద్రష్ట!

ఉదానాది ప్రాణకార్య బోధములకు ప్రతిఫలకములు స్నాయుకేంద్రములు వైషయికబోధ ప్రతిఫలకత్వమునకు లేక ప్రతి సంవేదనమునకు కేంద్రము, బుద్ధియు కరణములయు శక్తి బుద్ధిరూపమగు ఆత్మభావమునకు (నేనను భావమునకు) ప్రతిసంవేది స్వరూపపురుషుఁడు లేక చిద్రూపుఁడగు ఆత్మ. ఈ ప్రతిసంవేదనమును పట్టుకొని పురుషతత్త్వము నెఱుఁగవచ్చును. బుద్ధితత్త్వము నెఱిఁగి సంప్రజ్ఞాత సమాధిచే (7) ప్రతిసంవేదనభావమును పట్టుకొనినచో వివేకఖ్యాతి ఉదయించును అనఁగా బుద్ధి పురుషు నెఱుఁగుటకు ఏకాగ్ర మగుచో బుద్ధి వెనుక నున్న పురుషుఁడు బుద్ధికేసి తిరిగినటు లగును. పురుష విషయకమగు బుద్ధియనినను బుద్ధినెఱుఁగు పురుషుఁడనినను భేదములేదు (8) బుద్ధి పురుషాకారమగుచో పురుషుఁడు బుద్ధ్యాకారా పన్నుఁడగును 'అహం బ్రహ్మాస్మి' = నేను బ్రహ్మమును అనఁగా 'నేను ద్రష్టనగు పురుషుఁడను' అను సంప్రజ్ఞాత సమాధిలో బుద్ధి ఏకాగ్రత చెందినపుడు ప్రతిసంవేదనము అనుభూతమగును అసలిది వివేకఖ్యాతి. ప్రతి సంవేదనమునకు కారణము ప్రతిసంవేది లేక ప్రతిసంవేత్త (9)

పురుష బహుత్వము

ప్రతివానికిని 'నేను, నేను' అను ఎఱుక కలదు. పురుషుఁడొకఁడే యగుచో ప్రతి కేంద్రమునందును 'నే న'ను ఎఱుక కలుగదు ఈ సృష్టిలో ఎవరి అనుభవము వారిది ఎవరి ఎఱుక వారిది ఎవరికర్మ వారిది ఎవరి సుఖము వారిది. ఎవరి దుఃఖము వారిది. 'ఎవరికి వారే; యమునా తీరే.' ఇది ప్రత్యక్షసిద్ధము.

(7) తత్ర శబ్దార్థ జ్ఞాన వికల్పైః సంకీర్ణా సవితర్కా సమాపత్తిః - ౧-౪౨.

(8) పురుషః విషయః యస్యాః = పురుష విషయా
అథవా - పురుషం విషిత్య ఉత్పన్నా = పురుష విషయా.

(9) సాంఖ్యయోగుల మతమునందు పురుషుఁడు సాక్షిః జ్ఞాతయు భోక్తయు అధిష్ఠాతయు. కాని సాక్షాత్తు కర్తయు ధర్తయు కాఁడు. ఏలనఁగా పురుషుఁడు జ్ఞస్వరూపుఁడు అతనిచే ఎల్లయు జ్ఞాతము లేక దృష్టము. మఱి కార్యధార్యము లతనికి దృశ్యములు. కావున సాక్షాత్తు అతనికి కార్యధార్యములు లేవు. కాఁగా అతఁడు జ్ఞానమును ప్రకాశింపఁ జేయువాఁడు లేక ప్రతిసంవేదియగు జ్ఞాత. అతఁడు ప్రవృత్తిని ప్రకాశింపఁ జేయువాఁడు లేక భోక్త. అతఁడు స్థితిని ప్రకాశింపఁ జేయువాఁడు లేక అధిష్ఠాత. ఇటులగుటఁ జేసి ద్రష్ట యనిన ఆత్మబుద్ధి ప్రతిసంవేది, విజ్ఞాత యనిన శబ్దాదిబుద్ధి ప్రతిసంవేది, భోక్త యనిన ఇష్టానిష్టబుద్ధి ప్రతిసంవేది, అధిష్ఠాతయనిన ధార్యవిషయ ప్రతి సంవేది యని తెలివిది.

పురుషుఁడొకఁడే యగుచో ఒకఁడు ముక్తుఁడగునెడల ననాయాసముగ నందఱును ముక్తులగుదురు. ఒకఁడు బద్ధుఁడగునెడల నందఱును బద్ధులగుదురు. అట్టియపుడు ముక్తియు బంధమును లేకపోవలసివచ్చును

వృత్తులన్నియు గ్రహీతకు గోచరమగుటఁజేసి మనము ద్రష్ట ఉనికిని అనుభవ మొనరించుకొనుచున్నాము మనకు ప్రతి క్షణమునను ఏకమాత్ర జ్ఞానమే కాని బహుజ్ఞానములు కలుగవు. కనుక ఒక క్షణమునందే ఒక జ్ఞాతయే బహు జ్ఞానములకు ద్రష్టయని యను టనుభవవిరుద్ధము. ఒక క్షణముననే మనకు సుఖమును దుఃఖమును కలుగుచున్నదా? ఒక క్షణముననే నలుపును ఎఱుపును చూడఁగలమా! ఇది అనుభవ విరోధము ప్రాణులందఱియు ద్రష్ట ఒకఁడే అని చెప్పుచో అనుభవ విరుద్ధుఁడును అకల్పనీయుఁడును అగు ద్రష్టను కల్పింపవలసి యుండును.

యుక్తి సిద్ధమైన యెడల అకల్పనీయమగు వస్తువునయినను అనుమాన ప్రమాణముచే ఒప్పుకొనవలెను. శక్తి స్వరూపావస్థను అనుమానముచే సాధించుచున్నాము ఇది అకల్పనీయమయినను యుక్తి సిద్ధమని స్వీకరించుచున్నాము. అటులే ద్రష్టయు నొకఁడే యని యేల స్వీకరింపఁగూడదు?

ద్రష్ట ఒకఁడే యని చెప్పువారు ఒక సూర్యుఁడే పెక్కు కుండలలో ప్రతిబింబించినటులు ఒక పురుషుఁడే పెక్కు బుద్ధులలో ప్రతిబింబించునని యందురు. ఈ యుదాహరణమును బట్టి ద్రష్ట ఒకఁ డని అనుచో అతఁడు అవయవి కావలసి వచ్చును.

సరియు. ద్రష్ట లసంఖ్యాకు లగుచు ప్రత్యేకద్రష్ట ససీముఁ డేల కాఁడు? సమానములగు పదివస్తువులచే ఒకపెట్టె నిండెనని అనుకొందము. అందలి ప్రతి వస్తువును ఆ పెట్టెలో పదవపాలు ఐపోవదా? ద్రష్ట దేశాశ్రితుఁ డయినయెడల నట్లే యగును. జ్ఞానవస్తువు దేశము నాశ్రయింపదు. ఒకని తరువాత నొకరుగా పదుగురు నిలిచి సూర్యుని చూచుచుందు రని అనుకొందము. అపు డా పదుగురిలో నొకరొకరికి సూర్యునిలో పదవవంతే కనఁబడునా? కావున ద్రష్ట లనేకు లయ్యు దేశాశ్రయములగు పదార్థములవలె ససీములు కారు దేశాశ్రయములగు పదార్థములు ఒకదాని ప్రక్క మఱొకటి యుండునటులు కాలాశ్రయములగు పదార్థములు ఒకక్షణము తరువాత ఒకక్షణము ఉండును. కాలము నాశ్రయించిన జ్ఞానపదార్థము లెగిరిపోయి లయమయిన యెడలనే లేక వికారము చెందిన యెడలనే ససీమము లగును. ద్రష్టయం దది సంభవింపదు ద్రష్ట నిర్వికారి కాన కాలమువల్లఁ గూడ అతనికి ఎల్ల లేదు దానఁజేసియే యతఁ డద్వైతబోధ రూపుఁడు, చిద్రూపుఁడు, అనంతుఁడు, అనేకుఁడును. ఇట్టి పురుషు లందఱు ఏక రాశి. ఎవరిలోను హెచ్చుదగ్గులు లేవు.

శ్రీమద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి
కొన్ని విశేషములు

౧

సీ. చికిలి చుక్కలుగ నారికెడంబె పూచెనా?
చిన్నారి మావి పూచినది తాను,
సాలంకలుగఁ జారి జాతమే పూచెనా?
చిరుమల్లె తీవ పూచినది తాను,
నింతలింతలు నింబవృక్షమే పూచెనా?
సిరి సన్నజాజి పూచినది తాను,
పైడిగంటలు మెట్ట ప్రబ్బళే పూచెనా?
చిన్నిగన్నేరు పూచినది తాను,

గీ. నల్లవిసె మొక్కయే పూచెనా? మనోజ్ఞ
ముగ్ధ మధురోచిఁ గల్హారములను బూచెఁ
దాను మాధవుఁ డరుదెంచు దారియెల్ల
నవ వికాసంబు జంట జంటలుగఁ బొలిచె.

మాధవుఁ డరుదెంచు దారివెంట క్రొత్త వికాసము జంట జంటలుగ నుండెనని యీ పద్యములోని యర్థము. రామలక్ష్మణులు జంటగా భరత శత్రుఘ్నులు జంటగా పెరిగిరని సూచించుటకు నవతార ఖండమునందీ పద్యము వ్రాయఁబడినది.

౨

సీ. అడుగో రాముఁడు వచ్చునన్నంతలో దూసి
కోలువెట్టును చువ్వవోలె సీత,
యా రామచంద్రుఁడే యరుగుదెంచిన లేచి
నిలుచుండుఁ బుత్రికవలెను సీత,
యెదురైన నతఁడు తా నెచటేఁ ద్రపాహత
యగు వార్షుక సరస్సునట్టు సీత,
ఉల్ల పోయెడు రాము ముల్లంపుఁ జూపులఁ
గాంచు జాబిలివెల్గు కరణి సీత,

గీ. కడు సమీపంబుగా సాగి కడచు రాము
నింత దగ్గరతనము సహించు సీత.
యిట్టులే పోనుపోను తా నెదురుచూచు
వంచితల సీత పతి పల్కరించు నంచు.

శివ ధనుర్భంగము నాటికి రామునకు పండ్రెండేండ్లు. రామునియొక్క యిరువదినాల్గవయేట దశరథుఁడు పట్టాభిషేక ప్రయత్నము చేసెను. ఈనడుమ పండ్రెండేండ్లు కలవు. రామునకు పదునెన్మిదవయేట సీతారాములు సంసారము చేయుటకు సంకల్పింపబడినట్లు కవి చెప్పెను. కాని పెండ్లియైనంతనే సీత నత్తింటికి తెచ్చిరి. ఆరేండ్లు సీతారాము లొక్కచోటనే యుండిరి. ఇద్దరును చిన్నవాండ్రే ఈ ఆరేండ్లు వారి ఏకగృహవాసములోనున్న స్థితి యీ పద్యమునందు చెప్పఁబడినది. ఇది సీసపద్యము. నాల్గు పెద్ద చరణములలో మొదటి నాల్గేండ్ల స్థితి, గీతములో రెండేండ్ల స్థితి. ఈ సందర్భము లోకములోనుండి గ్రహింపఁబడినది. మొదటిలో "అదుగో రాముఁడు వచ్చుచున్నాఁ" డనఁగా సీత చువ్వవలె పరుగెత్తి పోవును. రెండవయేడు ఆయన వచ్చుచుండఁగా సీత బొమ్మవలె లేచి నిలుచుండును. అటనుండి పారిపోవును. మూడవయే డతఁ డెచ్చటనైన నెదురుపడఁగా మిక్కిలి సిగ్గుపడును. నాల్గవయేడు కొంచెము దూరములో పోవుచున్న రాముని సీతయే చూచుచుండును. ఐదవయేట తనకు రాముఁడు దగ్గరగా నడచి వెళ్లుచున్నచో ఆ దగ్గరి తనమును సహించును. చివరి యేడాది అతఁడు పల్కరించునేమోయని యెదురు చూచును. ఈ రీతిగా సీ పద్యము వారి ఏకత్ర స్థితిలోని మాధుర్యమంతయు లోక సహజముగాఁ జూపుటయేకాక, ఆరేండ్లు గడచినదన్న సంగతి నారు విషయములచేత సూచించుచున్నది.

౩

సగరుల కథలో సాగరులు భూమిని త్రవ్విరి. నాల్గు దిక్కులయందుఁ ద్రవ్విరి. నాల్గువైపులనున్న నాలుగు దిగ్గజములను జూచిరి. వారికి విసువెత్తిపోయెను వారికిఁ గోపమువచ్చెను. నిజముగా నిది విసువువచ్చు పనిగదా? వారికా విసుగు వచ్చునట్లు కనిపింపఁ జేయుటకు నొక శిల్ప మారంభింపఁ బడినది. నాల్గు దిక్కులకు నాల్గు మేదినీ వృత్తములతో త్రవ్వుటయు, నాల్గు దిగ్గజములు కన్పించుటయు, వారుచేసిన పనియే చేసిరనుటకు నాల్గు కందపద్యములతో జోడించి యీ రచన చేయఁబడినది.

మేదిని.

గుములుగఁ దూర్పు దిక్కుఁబడి గ్రొచ్చుచున్ విరూపా
క్షము తొలి దిగ్గజంబు శిరసాధరన్ వహింపన్
శ్రమమున మస్తకంబు గదురన్ గదల్ప భూకం
పము గలిగెన్ సభూధ్రవనపాళి బిట్టుతూలన్.

కం. సగర సుతుల్ గజరాజున
కగలి చని ప్రదక్షిణించి యంజలియిడి వె
న్కగఁ ద్రవ్వఁగొంచుఁ బోయిరి
పెగులని బండలును దండవ్రేటులఁ గూలన్.

మేదిని.

గుములుగ దక్షిణంపు దిశ గ్రొచ్చుచున్ మహా ప
ద్మము యముదిక్కు నేన్గుగని మానవేంద్రు పుత్రుల్
సుమహిత శైలమూర్తి క్షితి సొక్కిమోయుదానిన్
తమకము విస్మయంబు నరు దారఁగాంచి యంతన్.

కం. సగరసుతుల్ గజరాజున
కగలిచని ప్రదక్షిణించి యంజలియిడి ప్ర
క్కగఁ ద్రవ్వుకొంచుఁ బోయిరి
నొగులని బండలను గోళ్ళనొక్కి విద్రుచుచున్.

మేదిని.

గుములుగఁ బశ్చిమమ్ము దెసఁ ద్రొవ్వుచున్ జనన్ గొ
మ్ము మెదపుకొంచు సౌమనసమున్ గనంబడెన్ బ
శ్చిమ దిశ యేన్గు దాని పెనుచేవఁగాంచి యాశ్చ
ర్యముగని దంతపుంగొనసె రాచిపట్టి ధాత్రిన్.

కం. సగరసుతుల్ గజరాజున
కగలిచని ప్రదక్షిణించి యంజలియిడి వీ
లుగఁ ద్రవ్వుకొంచుఁ బోయిరి
తగిలిన బండలను కాలఁ దాచుచు వీకన్.

మేదిని.

గుములుగ నుత్తరంబు దిశ గ్రొచ్చికొంచు భద్ర
మ్మమరఁగఁ దద్దిశాగజము నందుఁ గాంచి దానిన్
హిమమ్మదు పాండురంబు ఱితి నెత్తి కుంభసీమన్
గమల సుమంబువోలె సుఖకాంతిఁ బూనుదానిన్.

కం. సగరసుతులు గజరాజున
కగలిచని ప్రదక్షిణించి యంజలియిడి ముం
దుగఁ ద్రవ్వుకొంచుఁ బోయిరి
రగిలిన బండలను నార్పరాచి కరములన్.

కం. విసువును దాపము కోపం
బెసఁగఁగ నీశాన్యదిక్కు నెగువంగఁ గసా
కసిఁ జారలెత్తి పోయఁగఁ
గసవుగ మహిగర్భ మృత్తికలు పెళ్లలుగా.

౪

మేనకా విశ్వామిత్ర కథలో నొక పౌరాణికమైన యిబ్బంది కలదు. ఈ మేనకా విశ్వామిత్రకథ యెప్పుడో కృతయుగమునందు జరిగినది. ఆ మేనక గర్భవతి యైనది. ఆమెకు కలిగిన సంతానము శకుంతల. ఈ శకుంతల దుష్యంతునకు భార్య. దుష్యంతుఁడు త్రేతాయుగములోనివాఁడు కావచ్చును. అప్పుడెప్పుడో కణ్వుఁడు చూచి ఆ పిల్లను పెంచెను. కాలము సరిపోదు. దీనిని పొసగించుట యెట్లు? దీనికి కావ్యము నందొక యనుసంధానము చేయఁబడినది. విశ్వామిత్రుఁడు మేనకతో తాను విరాగియై వెడలిపోవుచు ననిన మాటలలో నిట్లనెను.

శా. ఓసీ! యచ్చర! నీవు భీతువడెదేలో తవ్వి! నీయందు నా
దోసంబున్నది గర్భరూపముగ; నీదోసంబు త్రేతాంతమా
యాసంబై నను రక్షసేయఁగదె మేనా! కణ్వుఁడన్ మౌని వ
న్యాసీ మన్విడుమీ! శపించుదునె బేలా! నాదు దోసానకున్.

మేనక ధరించిన యీ గర్భమును త్రేతాంతమును ఆమె రక్షించి అప్పుడు కణ్వాశ్రమమున నా శిశువును ప్రసవించి వదలిపెట్ట వలయునని.

వ. అని విశ్వామిత్రుండెట కేనియుఁ బోయిన నచ్చరయు నంతలోన నపరిస్ఫుట గర్భ చిహ్నయై దేవలోకంబున కేగె.

ఈ రీతిగా మేనకా గర్భమున శకుంతల కొన్నివేల యేండ్లున్నట్లు. ఆమెకు గర్భ చిహ్నము లన్నాళ్లు తోచనట్లు పొసగింపఁబడినది.

పథికవనిత

శ్రీ శనగన నరసింహస్వామి, ఎం. ఎ.

★

ఇంత అసూయావేగమున ఈ జలదర్తువు దగ్గతించె దే
శాంతర మేగి మత్పతి పథాంతర మందున జిక్కెనంచు భా
వింతువు గాని, రేబవలు వెచ్చని నిప్పుల వేటలాట ప్రా
ణాంతము జేయు గ్రీష్మము భయంకర కాలము లోకమోర్చునే!

గగనము కాలమేఘ భుజగర్వ బలమ్మున జిక్కి మెల్లగా
పొగలను జిమ్ము చున్న దెటు వోయిన, భర్తృ వియోగ మూఢ దృ
గ్యుగ నిరతాశ్రు వారి జల దోదరమున్ బలియించి వేదనా
నిగళము వానకారు ద్విగుణింతు వదేమి! అమాయి కాంగనా!

దినము యుగమ్మటంచు నిగదింతువు నెచ్చెలికత్తె తోడ, యా
మిని తెలవార దంచెపుడు మేల్కొని యుందు, వహస్త్రియా సమ
ప్రణయిని వార్షికమ్మొక శుభంకరణమ్మె యగున్; వియోగినీ
జనఘన భూతసోదర నిశాగురు కష్ట హిమోపమమ్మునన్.

నీ వలెనే మనోజ్ఞబిసినీ సతి పాపము! పశ్చిమాద్రి యా
త్రావధియైన నాథుగన నాననమెత్తును గాని, వారి భృద్
ప్రావృతుడైన అభ్రపథపాంథుడు సూర్యుడు కానరాడు; శో
భావతి! శ్రావణాగమన భారము మా కొరకే యటందువా!

భ్రమయకు మెంతకాల మిక భాద్రము, ప్రత్యయనమ్ము మదృతు
క్రమ పరిపాలనమ్మున సుఖింపదు కాశ్యపి; నూత్నచంద్రికా
విమల శరద్వతీ హసిత వీచులు దిక్కులవీచె, నింక నీ
కమరును గాత పాంథవనితా! పతి వల్లభతా ప్రసాదముల్.

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

★

ఆంధ్రభారతి

డాక్టర్ శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి
ఎం. ఏ., ఎం. లిట్., పిహెచ్. డి.

"సర్వభూతాను భావజ్ఞ లోకజీవనమారుత
ప్రగృహ్యతాం బలిర్దేవ మంత్రిపూతో మయోద్యతః. ౫౫

దేవవక్త్రి సురశ్రేష్ఠ ధూమకేతో హుతాశన
భక్త్యా సముద్యతో దేవ బలిః సంప్రతిగృహ్యతామ్. ౫౬

సర్వగ్రహాణాం ప్రవర తేజోరాశే దివాకర
భక్త్యా మయోద్యతో దేవ బలిః సంప్రతిగృహ్యతామ్. ౫౭

సర్వగ్రహపతే సోమ ద్విజరాజ జగత్ప్రియ
ప్రగృహ్యతా మేష బలి ర్మంత్ర పూతో మయోద్యతః. ౫౮

మహాగణేశ్వరాః సర్వే నందీశ్వర పురోగమాః
ప్రగృహ్యతాం బలి ర్భక్త్యా మయా సంప్రతిచోదితః. ౫౯

నమః పితృభ్యః సర్వేభ్యః ప్రతిగృహ్ణ్త్విమం బలిమ్
భూతేభ్యశ్చ నమోనిత్యం యే షా మేష బలిఃప్రియః. ౬౦

కామపాల నమోనిత్యం యస్యాయంతే విధిఃకృతః
నారద స్తుంబురుశ్చైవ విశ్వావసు పురోగమాః ౬౧

ప్రతిగృహ్ణంతు మే సర్వే గంధర్వా బలిముద్యతమ్.
యమో మిత్రశ్చ భగవాన్ ఈశ్వరౌ లోకపూజితౌ ౬౨

ఇమం మే ప్రతిగృహ్ణీతాం బలిం మంత్రిపురస్కృతమ్.
రసాతల గతేభ్యశ్చ పన్నగేభ్యో నమోనమః ౬౩
దిశంతు సిద్ధిం నాట్యస్య పూజితాః పాపనాశనాః.

"సకల ప్రాణులచే అనుభవింప బడునది, లోకమునకు జీవము పోయునది అగు మారుతమా! మంత్రపూతమగు ఈ బలిని గైకొనుము.

"దేవతా ముఖము, దేవతలలో శ్రేష్ఠుడు, ధూమకేతువు, హుతాశనుడవు నగు అగ్నిదేవుడా! భక్తితో అర్పింపబడు ఈబలిని పుచ్చుకొనుము.

"సకల గ్రహములలో శ్రేష్ఠుడవు, తేజోరాశివి, దివాకరుడవునగు సూర్య భగవానుడా! భక్తితో నర్పింపబడిన ఈబలిని గ్రహించుము.

"సకల గ్రహములకు నాయకుడవు, ద్విజరాజువు, జగత్ప్రియుడవు నగు చంద్రుడా! మంత్రపూతమై నాచే అర్పింపబడు ఈబలిని తీసికొనుము.

"నందీశ్వరుడు నాయకుడు గాగల మహాగణేశ్వరులారా! భక్తితో నాచే నివేదింపబడు బలిని స్వీకరింపుడు.

"సకల పితృదేవతలకు నమస్కారములు. వారీ బలిని స్వీకరింతురుగాక!

"ఈ బలి అన్న ప్రీతిగల భూతగణములకు సదా నమస్కారములు.

"ఎవనికొరకై ఈ బలివిధానము చేయబడినదో అట్టి కామపాలునకు సదా నమస్కారము.

"విశ్వావసువు నాయకుడుగాగల గంధర్వులారా! తుంబుర నారదులారా! నా బలిని స్వీకరింపుడు.

"ఈశ్వరులు, లోకపూజితులు నగు యమ మిత్ర దేవతలారా! మంత్ర పురస్కృతమైన ఈ నా బలిని గ్రహింపుడు.

"రసాతలమున వసించు పన్నగములకు నమస్కారములు. పాపమును నశింపజేయు ఈపన్నగములు నాచే పూజింపబడినవై నాట్యమునకు సిద్ధిని చేకూర్చెదరుగాక.

"సర్వాం భసాం పతి ర్దేవో వరుణో హంసవాహనః ౬౪
పూజితః ప్రీతిమానస్తు స సముద్ర నదీ నదః.

వైనతేయ మహాసత్త్వ సర్వపక్షిపతే విభో ౬౫
ప్రగృహ్యతాం బలిర్దేవ మంత్రపూతో మయోద్యతః.

ధనాధ్యక్షో యక్షపతి ర్లోకపాలో ధనేశ్వరః ౬౬
స గుహ్యక స్సయక్షశ్చ ప్రతిగృహ్ణాతు మే బలిమ్

నమోఽస్తు నాట్యమాతృభ్యో బ్రాహ్మ్యాద్యాభ్యో నమోనమః ౬౭
సుముఖీభిః ప్రసన్నాభి ర్బలి స్సంప్రతిగృహ్యతామ్.

రుద్రప్రహరణం సర్వం ప్రతి గృహ్ణాతు మే బలిమ్ ౬౮
విష్ణుప్రహరణంచైవ విష్ణుభక్త్యా మయోద్యతమ్.

తథా కృతాంతః కాలశ్చ సర్వప్రాణి వధేశ్వరౌ ౬౯
మృత్యుశ్చ నియతిశ్చైవ ప్రతిగృహ్ణాతు మే బలిమ్.

యాశ్చాస్యాం మత్తవారణ్యాం సంశ్రితా వాస్తుదేవతాః ౭౦
మంత్రపూత మిమం సమ్యక్ ప్రతిగృహ్ణంతు మే బలిమ్.

అన్యే యే దేవ గంధర్వా దిశో దశ సమాశ్రితాః, ౭౧
దివ్యాం తరిక్ష భౌమాశ్చ తేభ్య శ్చాయం బలిః కృతః,"

"సమస్త ఉదకముల కధిదైవతము, హంస వాహనముగా కలవాడు నగు వరుణ దేవుడు పూజింపబడినవాడై నదీనద సముద్రములతో కలసి ప్రీతుడగుగాక!

"సకల పక్షిజాతికి ప్రభువు, మహా బలముగలవాడు, వైనతేయుడునగు గరుడుడా! మంత్రపూతమై నాచే అర్పింపబడిన బలిని గ్రహించుము

"యక్షుల ప్రభువు, లోకపాలుడు, ధనాధపతి, ధనేశ్వరుడు నగు కుబేరుడు యక్ష గుహ్యకులతో కలసి నా బలిని స్వీకరించుగాక!

"బ్రాహ్మీ మొదలగు నాట్యమాతలకు నమస్కారములు. సుముఖులై, ప్రసన్నులై వీరు బలులను గైకొందురుగాక!

"రుద్రుని ఆయుధము లన్నియు నా బలులను గ్రహించుగాక!

"విష్ణుభక్తితో అర్పించబడిన ఈ బలిని విష్ణుదేవుని ఆయుధము గైకొను గాక!

"కృతాంతుడు, కాలము, సకల జీవుల ప్రాణములను తీసికొనిపోవు మృత్యువు, నియతి నా బలిని గ్రహింతురుగాక!

"మదపు టేనుగుల నాశ్రయించుకొని యున్న వాస్తుదేవతలు మంత్ర పూతమగు నా బలిని స్వీకరింతురుగాక!

"పది దిక్కులలోను, ద్యులోక భూలోకాంతరిక్ష లోకముల లోను గల శేషించిన దేవతలు గంధర్వులు కూడ నాబలులను గ్రహించెదరుగాక!"

కుంభం సలిలసంపూర్ణం పుష్పమాల పురస్కృతమ్ ౭౨
స్థాపయే ద్రజ్గమధ్యేతు సువర్ణంచాత్ర దాపయేత్.
ఆతోద్యానితు సర్వాణి కృత్వా వస్త్రోత్తరాణితు ౭౩
గంధమాల్యైశ్చ ధూపైశ్చ భక్ష్యై ర్భోజ్యైశ్చ పూజయేత్.

ఆవాహనా పూర్వకముగా దేవతాస్తుతులైన తర్వాత ఉదకముతో నిండిన కుండలో బంగారమువేసి, కుండనుపూలమాలతో అలంకరించి రంగమధ్యమున స్థాపించవలెను. వాద్యముల కన్నిటికి వస్త్రములను కప్పిగంధమాల్య ధూపముల తోను, భక్ష్యభోజ్యములతోను పూజించవలెను.

పూజయిత్వాతు సర్వాణి దైవతాని యథాక్రమమ్ ౭౪
జర్జర స్త్వభిసంపూజ్యః స్యాత్తతో విఘ్నజర్జరః.
శ్వేతం శిరసి వస్త్రంస్యా న్నీలం రౌద్రేచ పర్వణి ౭౫
విష్ణుపర్వణివై పీతం రక్తం స్కందస్య పర్వణి.
మూలపర్వణి చిత్రంతు దేయం వస్త్రం హితార్థినా ౭౬
సదృశంచ ప్రదాతవ్యం ధూపమాల్యానులేపనమ్.
ఆతోద్యానిచ సర్వాణి వాసోభి రవగుంఠయేత్ ౭౭
గంధై ర్మాల్యైశ్చ ధూపైశ్చ భక్ష్య భోజ్యైశ్చ పూజయేత్.

ఒకరితర్వాత నొకరిని వరుసగా దేవతలనందరిని పూజించి, విఘ్నములు నశించుటకై జర్జరమనబడు ధ్వజమును తర్వాత పూజించవలెను. ఈ ధ్వజము

యొక్క అగ్రపర్వమున తెల్లని వస్త్రమును, రెండవపర్వమున నీలవస్త్రమును, మూడవపర్వమున పసుపువస్త్రమును, నాల్గవపర్వమున ఎర్రనివస్త్రమును, అన్నిటికన్న క్రిందగల పర్వమున చిత్రవస్త్రమును ఉంచవలెను. ఆయా పర్వములకు సదృశమగు ధూప, మాల్యాను లేపనముల నర్పించవలెను. తర్వాత ఆతోద్యాది వాద్యములపై కప్పబడిన వస్త్రములను తొలగించవలెను. ఆ పై గంధమాల్య ధూపములతోను, భక్ష్యభోజ్యములతోను పూజించవలెను.

సర్వమేవం విధిం కృత్వా గంధమాల్యానులేపనైః ౨౮
విఘ్నజర్జరణార్థంతు జర్జరం త్వభిమంత్రయేత్.

"అత్ర విఘ్నవినాశార్థం పితామహముఖై స్సురైః ౨౯
నిర్మిత స్త్వం మహావీర్యో వజ్రసారో మహాతనుః.

శిర స్తే రక్షతు బ్రహ్మ సర్వై ర్దేవగణైస్సహ ౩౦
ద్వితీయంతు హరః పాతు తృతీయంచ జనార్దనః

చతుర్థంచ కుమారశ్చ పఞ్చమం పన్నగోత్తమాః ౩౧
నిత్యం సర్వేఽపి పాంతు త్వాం పున స్త్వంచ శివోభవః.

నక్షత్రేఽభిజితి శ్రేష్ఠే జాత స్త్వ మరిషూదనః ౩౨
జయం చాభ్యుదయంచైవ పార్థివస్య సమావహ"

ఈ విధానము ననుసరించి గంధమాల్యాను లేపనములతో ధ్వజమును పూజించి, విఘ్నవినాశము కొరకై ధ్వజము నీ క్రింది రీతిగా నభిమంత్రించవలెను-

"విఘ్నములను నశింపజేయుటకు బ్రహ్మ ఆదేశానుసారము దేవతలచే నిర్మింపబడితివి మహాబలము కలిగి, వజ్రసారమైన, మహా శరీరము గలిగి యున్నావు నీశిరస్సును దేవతా గణములతోబాటు బ్రహ్మ, రెండవ పర్వమును శివుడు, మూడవ పర్వమును విష్ణువు, నాలుగవ పర్వమును కుమారస్వామి, ఐదవ పర్వమును పన్నగశ్రేష్ఠులు, ఎల్లప్పుడు నిన్ను అందరు దేవతలు రక్షించుదురు గాక! నీవు శుభప్రదుడవుకమ్ము శ్రేష్ఠమగు అభిజిన్నక్షత్రమున శత్రు సంహారకర్తవై జన్మించితివి రాజునకు జయమును, అభివృద్ధిని సంపాదించుము"

జర్జరం పూజయిత్వాచ బలిం సర్వం నివేద్యచ ౩౩
అగ్నౌహోమం తతః కుర్యా న్మంత్రాహుతి పురస్కృతమ్.

హుత్వా సపీవ దీప్తాభి రుల్కాభిః పరిమార్జనమ్ ౩౪
నృపతే ర్నర్తకీనాంచ కుర్యా ద్దీప్త్యభి వర్ధనమ్.

అభిద్యోత్య మహాతోద్యై ర్నృపతిం నర్తకీంతథా ౩౫
మంత్రపూతేన తోయేన పునరభ్యుక్ష్య తాన్ వదేత్.

"మహాకులే ప్రసూతాః స్థ గుణౌఘైశ్చా ప్యలంకృతాః ౩౬
యద్వో జన్మగుణోపేతం తద్వై భవతు నిత్యశః"

ఏవముక్త్వా తతోవాక్యం నృపతే ర్భూతయే బుధః ౭౬
నాట్యయోగప్రసిద్ధ్యర్థ మాశిష స్సంప్రయోజయేత్.

ధ్వజమును పూజించి, బలులను నివేదనలను సమర్పించి, మంత్రాహుతులతో అగ్నియందు హోమము చేయవలెను. అప్పుడు ప్రదీపించుచున్న అగ్నికణములతో ధ్వజమునకు పరిమార్జనముగావించి, రాజునకు నర్తకురాండ్రకు ప్రదీప్తమగు నభివృద్ధి కలుగునట్లు చేయించవలెను. రాజునకు నర్తకికి వాద్యములను చూపెట్టి, మంత్రిపూతములగు ఉదకములను వాటిపై మరలచల్లి ఇట్లనవలెను- "మహావంశమున జన్మించినవి, సద్గుణ సమూహములచే నలంకరింపబడినవియు నగు వాద్యములివి. మీరేసద్గుణ సంపన్నమైన వంశమున జన్మించినారో, అట్టి గుణములతో నెల్లప్పుడు ఉండెదరుగాక!" రాజునకు సంపద నభిలషించి ఈరీతిగా పలికి, నాట్యయోగము ప్రసిద్ధి చెందుటకు తర్వాత ఆశీర్వాద వాక్యముల నుచ్చరించవలెను.

"సరస్వతీ ధృతిర్మేధా హ్రీః శ్రీర్లక్ష్మీర్మతి స్తథాః ౭౭
పాంతువో మాతరః సౌమ్యాస్సిద్ధి దాశ్చభవంతువః"

"సరస్వతి, ధృతి, మేధా, హ్రీ, శ్రీ, లక్ష్మి, మతి అనబడు నేడుగురు సౌమ్యలు, కార్యసిద్ధిని చేకూర్చువారు నగు నాట్యమాతృకలు మిమ్ములను రక్షించెదరుగాక!"

హోమంకృత్వా యథాన్యాయం హవి ర్మంత్రపురస్కృతమ్ ౭౮
భింద్యా త్కుంభం తతశ్చైవ నాట్యాచార్యః ప్రయత్నతః

అభిన్నేతు భవేత్కుంభే స్వామినః శత్రుతో భయమ్ ౮౦
భిన్నే చైవతు విజ్ఞేయః స్వామినః శత్రుసంక్షయః.

భిన్నే కుంభే తతశ్చైవ నాట్యాచార్యః ప్రయత్నతః ౮౧
ప్రగృహ్య దీపికాం దీప్తాం సర్వం రఙ్గం ప్రదీపయేత్.

క్ష్వేడితైః స్ఫోటితైశ్చైవ వల్గితైశ్చ ప్రధావితైః ౮౨
రఙ్గమధ్యేతు తాం దీప్తాం సశబ్దాం సంప్రయోజయేత్.

మంత్రములతోను, ఆహుతులతోను శాస్త్ర ప్రకారము హోమముచేసి మధ్యనుంచిన కుంభమును నాట్యాచార్యుడు ప్రయత్నముతో పగులగొట్టవలెను. కుంభము పగలనిచో ప్రభువునకు శత్రువులనుండి భయము, పగిలినచో శత్రునాశనము, జరుగగలవు. ప్రయత్నముతో కుంభమును పగులగొట్టినతర్వాత ప్రజ్వరిల్లుచున్న దీపికను తీసికొని నాట్యరంగమునంతట దీపములను వెలిగించవలెను త్వరత్వరగా నొకదిక్కునుండి మరొకదిక్కువద్దకు పోవుచు వివిధ ధ్వనులను చేయుచు చివరకు రంగమధ్యమున దీపిక నుంచవలెను.

శఙ్ఖ దుందుభి నిర్ఘోషై ర్మృదఙ్గ పణవై స్తథా ౯౩
సర్వాతోద్యైః ప్రణదితై రఙ్గే యుద్ధాని కారయేత్.

తత్ర ఛిన్నంచ భిన్నంచ దారితంచ సశోణితమ్ ౯౪
క్షతం ప్రదీప్త మాయస్తం నిమిత్తం సిద్ధిలక్షణమ్.

సమ్య గిష్టస్తు రఙ్గోవై స్వామినః శుభ మావహేత్ ౯౫
పున స్సబాలవృద్ధస్య తథా జనపదస్యచ.

దురిష్టస్తు తథా రఙ్గో దేవతై ర్దురధిష్ఠితః ౯౬
నాట్యవిధ్వంసనం కుర్యా న్నృపస్యచ తథాశుభమ్.

య ఏవం విధిముత్సృజ్య యథేష్టం సంప్రయోజయేత్ ౯౭
ప్రాప్నో త్యపచయం శీఘ్రం తిర్యగ్యోనించ గచ్ఛతి.

శంఖదుందుభులు మృదంగ పణవములు మొదలుగాగల వాద్యవిశేషములు శబ్దములు చేయుచుండగా, నాట్యరంగమున సంతోషప్రదమగు యుద్ధముల నాడవలెను. శివమెత్తినట్లు అచటివారలు వర్తించవలెను రక్తముకారుట, గీకబడుట గాయములు తగులుట, ఛిన్నమగుట,భిన్నమగుట మొదలగునవి నాట్యరంగమున బయలుదేరి రంగమంతయు ప్రదీప్తమైనచో అది నాట్యగృహము కార్యసిద్ధిని తేగలదని సూచించును అచటచేరిన ప్రజలకందరకు ఈకర్మము ఇష్టమై సంతోషము కల్గించిన నాట్యాచార్యునకు, ప్రభువునకు, శుభప్రదమగు నాట్యగృహము కాగలదు. బాలురకు, వృద్ధులకు, జానపదులకు ఇది సంతోషము కల్పించకపోయి, దేవతలచే సక్రమముగా అధిష్ఠింపబడినది కానిచో నాట్యవిధ్వంసనము జరుగును, రాజునకు అశుభముకూడ కలుగగలదు. ఈపై చెప్పిన విధానమును వదలి యథేష్టముగా నాట్యగృహమును నిర్మించినచో నాట్యాచార్యుడు క్షీణదశలోనికి పోయి, పశువై జన్మించగలడు.

యజ్ఞేన సంమితం హ్యేత ద్రఙ్గదైవత పూజనమ్ ౯౮
అపూజయిత్వా రఙ్గంతు నైవప్రేక్షాం ప్రయోజయేత్.

పూజితాః పూజయ న్త్యేతే మానితా మానయంతిచ ౯౯
తస్మా త్సర్వప్రయత్నేన కర్తవ్యం రఙ్గ పూజనమ్.

న తథాశు దహత్యగ్నిః ప్రభఞ్జన సమీరితః ౧౦౦
యథాహ్యప ప్రయోగస్తు ప్రయుక్తో దహతి క్షణాత్.

శాస్త్రజ్ఞేన వినీతేన శుచినా దీక్షితేనచ ౧౦౧
నాట్యాచార్యేణ శాంతేన కర్తవ్యం రఙ్గపూజనమ్.

ఈ రంగదైవతపూజనము యజ్ఞముతో తుల్యమైనది. అందుచే రంగపూజ లేకుండా నాట్య ప్రయోగమును చేయరాదు. రంగదైవతములను పూజించి గౌరవించినచో వారుకూడ నాట్యమునకు పూజాగౌరవములు వచ్చునట్లు

చేయుదురు. అందుచే సర్వప్రయత్నములనుచేసి రంగపూజనమును తప్పక సలుపవలెను నాట్యప్రయోగము అపప్రయోగమైనచో నొక్క త్రుటికాలములో నది దహించగలదు. వాయువుచే ప్రేరేపింపబడిన అగ్నికూడా అంతత్వరగా దహించలేదు. అందుచే శాస్త్రజ్ఞుడు, వినీతుడు, శుచి, దీక్షితుడు, శాంతుడునగు నాట్యాచార్యుడు రంగపూజన చేసి తీరవలయును

స్థానభ్రష్టంతు యో దదా ద్బల్యి ముద్విగ్నమానసః ౧౦౨
మంత్రహీనో యథా హోతా ప్రాయశ్చిత్తీ భవేత్తు సః.

ఇత్యయం యో విధిర్దృష్టో రఙ్గదైవత పూజనే ౧౦౩

నవే నాట్యగృహే కార్యః ప్రేక్షయాంచ ప్రయోక్తృభిః ౧౦౪

ఇతి శ్రీభారతీయే నాట్యశాస్త్రే రంగదైవత
పూజనం నామ తృతీయోఽధ్యాయః

అవహిత మనస్కుడుగాని నాట్యాచార్యుడు బలులను సక్రమమగు స్థానములలో నొసగనిచో మంత్రహీనుడైన హోతవలె యగును అందుచే ప్రాయశ్చిత్తము చేసికొనవలెను.

రంగదైవత పూజనయందేరీతిగా నేయే విధులు చెప్పబడినవో అవన్నియు క్రొత్త నాట్యగృహమున ప్రప్రథమ నాట్యప్రయోగమునకు ముందుగా చేయవలసి యున్నవి.

శ్రీ భరతముని ప్రణీతమగు భారతీయ నాట్యశాస్త్రమున ఆంధ్రభారతి యందు రంగదైవత పూజన మనబడు మూడవ అధ్యాయము.

చతుర్థోఽధ్యాయః — తాండవలక్షణమ్

ఏవంతు పూజనం కృత్వామయాప్రోక్తః పితామహః
ఆజ్ఞాపయ విభోక్షిప్రం కః ప్రయోగః ప్రయుజ్యతామ్ ౧

ఆ ం ధ్ర భా ర తి

నృత్యతి స్మకరణై ర్యథాహార స్సాంగహార గతిభిస్సహోమయా
తద్విధించ వినియోగ పూర్వకం సంగ్రహేణ వివృణోమి తాండవమ్.

రంగదైవత పూజ ఐనతర్వాత 'ఏ నాట్యప్రయోగమును ప్రయోగించవలెనో వెంటనే ఆజ్ఞాపింపుడు' అని భరతుడు బ్రహ్మ నడిగెను.

తతోఽస్మ్యుక్తో భగవతా యోజయామృత మంథనమ్
ఏత దుత్సాహ జననం సురప్రీతి కరంతథా. ౨

యోఽయం సమవకారస్తు ధర్మకామార్థ సాధకః
మయా ప్రగ్రథితో విద్వన్ సప్రయోగః ప్రయుజ్యతామ్. ౩

'అమృత మంథనమనే సమవకారమును ప్రయోగించుము. ఇది దేవతలకు ప్రీతి నిచ్చునది, ఉత్సాహకరము, ధర్మార్థ కామములకు సాధకము. నేనే దీనిని కూర్చితిని. ఈ సమవకారమును నాట్యముతో ప్రయోగించుము' అని బ్రహ్మ ఆదేశించెను

నాల్గు విధముల నాయకులకు స్థాయిభావమగు ఉత్సాహమును సంపాదింపజేయు వీరరసముతో నుండునది సమవకారము. ఇచట ఒక అంకమునకు మరొక అంకమునకు సంబంధము సరిగా ఉండదు.

తస్మిన్ సమవకారేతు ప్రయుక్తే దేవదానవాః
హృష్టాః సమభవన్ సర్వేకర్మ భావాను దర్శనాత్. ౪

ఈ సమవకారమును చూచి, ఇచటగల కర్మభావములను గమనించి, దేవతలు, దానవులు సంతోషించిరి.

కస్యచి త్త్వథ కాలస్య మామాహాంబుజ సంభవః
'నాట్యం సందర్శయామోఽద్య త్రినేత్రాయ మహాత్మనే' ౫

తతః సార్ధం సురైర్గత్వా వృషభాంక నివేశనమ్
సమభ్యర్చ్య శివం పశ్చా దువాచేదం పితామహః. ౬

మయా సమవకారస్తు యోఽయం స్పష్టః సురోత్తమ
శ్రవణే దర్శనే చాస్య ప్రసాదం కర్తు మర్హసి'. ౭

'పశ్యామ' ఇతి దేవేశో ద్రుహిణం వాక్య మబ్రవీత్
తతో మామాహ భగవాన్ 'సజ్జో భవ మహామతే'. ౮

కొంతకాలము గడచిన తర్వాత 'మహాత్ముడగు శివునకీ నాట్యమును చూపించెదము' అని బ్రహ్మ భరతునితో పల్కెను. అప్పుడు శివుని నివాస గృహమునకు దేవత లందరితో పోయి శివుని పూజించి బ్రహ్మ ఇట్లనెను— 'నాచే సృష్టింపబడిన సమవకారమును చూచుటకు, వినుటకు మీరనుగ్రహింపవలెను' 'అట్లే చూచెదము' అని శివుడు బ్రహ్మతో పల్కగా, 'నీవు సిద్ధముగావలసినది' అని భరతుని బ్రహ్మ ఆదేశించెను

నాట్య ప్రయోగమును మొట్టమొదట నాట్యము తెలిసిన వారికే చూపవలెను గనుక నటరాజగు శివుని సభాపతిగా చేసినారు. కాని ఒకసారి ప్రయోగించిన విషయమును సభాపతి ముందు ప్రయోగించరాదు గనుకసమవకారముతో పాటు డిమమును గూడ ప్రయోగి చినారని తర్వాత కలదు. నాట్యమును పరీక్షించుటకు వచ్చువానికి కవియే మొదట కావ్యమును వినుపింప వలెను గనుక, బ్రహ్మయే స్వయముగా వచ్చినాడు

తతో హిమవతః పృష్ఠే నానా నగ సమాకులే
బహు చూతద్రుమాకీర్ణే రమ్యకందర నిర్ఝరే.

పూర్వరంగే కృతే పూర్వం తత్రాయం ద్విజసత్తమాః
తథా త్రిపురదాహశ్చ డిమసంజ్ఞః ప్రయోజితః. ౧౦

వివిధ పర్వతములతో సమాకీర్ణమై అనేక మామిడి చెట్లతో నిండి, అందమగు నదులు ప్రవహించు లోయవద్ద, హిమవత్పర్వతముపై పూర్వ రంగమును గావించి, అమృత మంథన సమవకారమును, త్రిపురదాహమను డిమమును భరతుడు ప్రయోగింప జేసెను.

తతో భూతగణాహృష్టాః కర్మభావానుకీర్తనాత్
మహాదేవశ్చ సుప్రీతః పితామహ మథాబ్రవీత్. ౧౧

"అహో నాట్యమిదం సమ్యక్ త్వయా సృష్టం మహామతే
యశస్యంచ శుభార్థంచ పుణ్యం బుద్ధివివర్ధనమ్. ౧౨

మయాపీదం స్మృతం నృత్యం సంధ్యాకాలేషు నృత్యతా
నానాకరణ సంయుక్తై రంగహారై ర్విభూషితమ్. ౧౩

పూర్వరంగవిధా వస్మిం స్త్వయా సమ్యక్ ప్రయోజ్యతామ్
మహాగీతేషు చైవార్థాన్ సమ్యగే వాభినేష్యసి. ౧౪

యశ్చాయం పూర్వరంగస్తు త్వయా శుద్ధః ప్రయోజితః
ఏత ద్విమిశ్రిత శ్చాయం చిత్రోనామ భవిష్యతి". ౧౫

ఈ ప్రయోగములందలి కర్మభావముల అనుకీర్తనచే ప్రమథాదిభూతగణములు సంతోషింపగా, శివుడుకూడ ప్రీతుడై బ్రహ్మతో నిట్లనెను—

"మహామతివైన నీచే నాట్యప్రయోగము చక్కగా సృష్టించబడినది. ఇది కీర్తిప్రదము, శుభార్థములతోకూడినది, పుణ్యమైనది, బుద్ధిని వృద్ధిచేయునది. సంధ్యాకాలములయందు నృత్యముచేయుచున్న నాచేగూడ ఈ నృత్యమే స్మరించబడినది. నూటఎనిమిది కరణములతోను, ముప్పది రెండు అంగహారములతోను అలంకరింపబడిన పూర్వరంగవిధిని ప్రయోగించవలెను. అప్పుడే మహాగీతముల లోని అర్థమును చక్కగా అభినయింపగలవు. ఇప్పుడునీచే శుద్ధపూర్వరంగమే ప్రయోగింపబడినది. దీనిని కరణాంగహారములతో కలిపిచేసిన, చిత్ర పూర్వరంగము కాగలదు."

ఈ నృత్యమును శివుడు సంధ్యాకాలమున స్మరించినాడు. నృత్యమనాది కాలమునుండి వచ్చుచున్నదని భావము. నృత్యము శివుని ఆదరాభిమానముల నందినదని తెల్పుటకే సంధ్యాకాలముల యందని చెప్పబడినది.

అంగహారములద్వారా నృత్తఫలము సిద్ధించును. వీటి అంగములను కరణములందురు. ప్రత్యాహారము మొదలు గాగల తొమ్మిది అంతర్యవనికాంగములతోను, గీతకమహాగీతక రచనాంతకమైన పది అంగములతోను నృత్తము లేకుండా భరతునిచే ప్రయోగింపబడిన పూర్వరంగము శుద్ధమని పిలువబడును.

ఉద్ధతమైన చిత్రపూర్వరంగమున శివుని తాండవవిధిలో చెప్పబడు కరణాంగహారములుండగలవు సుకుమారమైన చిత్రపూర్వరంగమున దేవీకృతములగు అనుద్ధతములైన అంగహారములే ఉండగలవు.

గీతకవర్ధమానాది రూపమున మహాగీతముండును.

శ్రుత్వా మహేశ్వరవచః ప్రత్యుక్తస్తు స్వయంభువా
"ప్రయోగ మంగహారాణా మాచక్ష్వ సురసత్తమ" ౧౬

తత స్తణ్డుం సమాహూయ ప్రోక్తవాన్ భువనేశ్వరః
"ప్రయోగ మంగహారాణా మాచక్ష్వ భరతాయ వై". ౧౭

తతో యే తణ్డునా ప్రోక్తా స్త్వంగహారా మహాత్మనా
నానాకరణసంయుక్తాన్ వ్యాఖ్యాస్యామి సరేచకాన్. ౧౮

మహేశ్వరుని వాక్యముల నాలకించి "అంగహారముల ప్రయోగమును చెప్పవలసినది" అని బ్రహ్మ ప్రార్థించెను. శివుడు నందీశ్వరుడగు తండును పిలచి "అంగహారముల ప్రయోగమును భరతునకు నేర్పుము" అని ఆజ్ఞాపించెను. వివిధ కరణములతో కూడిన అంగహారములను, రేచకములను, మహాత్ముడగు నందీశ్వరుడు చెప్పిన రీతిగా భరతుడు వివరించును.

నందీశ్వరుడగు తండునిచే చెప్పబడుటచే నిది తాండవ మనబడుచున్నది.

స్థిరహస్తో ఽంగహారస్తు తథా పర్యస్తకః స్మృతః
సూచీవిద్ధ స్తథాచైవ హ్యపవిద్ధ స్తథైవచ. ౧౯

ఆక్షిప్తకస్తు విజ్ఞేయ స్తథా చోద్ఘట్టితః స్మృతః
విష్కంభశ్చైవ సంప్రోక్త స్తథా చై వాపరాజితః. ౨౦

విష్కంభాపసృతశ్చైవ మత్తాక్రీడ స్తథైవచ
స్వస్తికో రేచితశ్చైవ పార్శ్వస్వస్తిక ఏవచ. ౨౧

వృశ్చికశ్చైవ సంప్రోక్తో భ్రమరశ్చ తథాపరః
మత్తస్ఖలితకశ్చైవ మదాద్విలసిత స్తథా. ౨౨

గతిమండలో ఽథ విజ్ఞేయః పరిచ్ఛిన్న స్తథైవచ
పరివృత్తరేచితః స్యాత్తథా వైశాఖరేచితః. ౨౩

పరావృత్తో ఽథ విజ్ఞేయ స్తథా చైవా ప్యలాతకః
పార్శ్వచ్ఛేద ఽథ సంప్రోక్తో విద్యుద్భ్రాంత స్తథైవచ. ౨౪

ఊరూద్వృత్త స్తథాచైవ స్యాదాలీఢ స్తథైవచ
రేచితశ్చాపి విజ్ఞేయ స్తథైవా చ్ఛురితః స్మృతః. ౨౫

ఆక్షిప్తరేచిత శ్చైవ సంభ్రాంతశ్చ తథా పరః
అపసర్పస్తు విజ్ఞేయ స్తథార్ధ నికుట్టకః. ౨౬

ద్వాత్రింశదేతే సంప్రోక్తా అంగహారాస్తునామతః
ఏతేషాంతు ప్రవక్ష్యామి ప్రయోగం కరణాశ్రయమ్. ౨౭

స్థిరహస్త, పర్యస్తక, సూచీవిద్ధ, అపవిద్ధ, ఆక్షిప్తక, ఉద్ఘట్టిత, విష్కంభ, అపరాజిత, విష్కంభాపసృత, మత్తక్రీడ, స్వస్తిక రేచిత, పార్శ్వస్వస్తిక, వృశ్చికాపసృత, భ్రమర, మదస్ఖలిత, మదవిలసిత, గతిమండల, పరిచ్ఛిన్న, పరివృత్తరేచిత, వైశాఖరేచిత, పరావృత్త, అలాతక, పార్శ్వచ్ఛేద, విద్యుద్భ్రాంత, ఉద్వృత్తక, ఆలీఢ, రేచిత, ఆచ్ఛురిత, ఆక్షిప్తరేచిత, సంభ్రాంత, అపసర్పిత, అర్ధనికుట్టకములని ముప్పది రెండు అంగహారములు. ఈ అంగహారముల ప్రయోగము కరణముల నాశ్రయించుకొని ఉండును. కరణములు 108 కలవు. అంగములగు కరణముల కలయిక వలన వచ్చు రూపములను అంగహారము లందురు. అంగములచే నిర్వర్తింప బడునది కూడ అంగహారమే కాగలదు.

హస్తపాద ప్రచారశ్చ యథాయోజ్యః ప్రయోక్తృభిః
అంగహారేషు వక్ష్యామి కరణేషుచ వై ద్విజాః ౨౮

సర్వేషా మంగహారాణాం నిష్పత్తిః కరణైర్యతః
తాన్యతః సంప్రవక్ష్యామి నామతః కర్మత స్తథా. ౨౯

కరణములలోను, అంగహారములలోను కలుగు హస్త పాదముల విన్యాసముల నిక చెప్పగలడు. అంగహారములు కరణముల సంయోగముచే వచ్చునవి కనుక మొదట కరణముల పేర్లను చెప్పి, ఆపై వాటి లక్షణ ప్రయోజనములను చెప్పును.

హస్తపాద సమాయోగో నృత్యస్య కరణంభవేత్.

నృత్యమున గల కరణమునకు హస్త పాదముల కలయిక అని అర్థము.

ద్వేనృత్తకరణే చైవ భవతో నృత్తమాతృకా. ౩౦

ద్వాభ్యాం త్రిభి శ్చతుర్భిర్వా ప్యంగహారస్తు మాతృభిః
త్రిభిః కలాపకంచైవ చతుర్భిః షండకం భవేత్. ౩౧

పంచైవ కరణాని స్యుః సంఘాతక ఇతి స్మృతః
షడ్భిర్వా సప్తభిర్వాపి అష్టభి ర్నవభి స్తథా. ౩౨

కరణైరిహ సంయుక్తా అంగహారాః ప్రకీర్తితాః
ఏతేషామేవ వక్ష్యామి హస్త పాద వికల్పనమ్. ౩౩

కరణమునకు సామాన్య లక్షణమును చెప్పి అంగహారమునకు విశేషలక్షణమును చెప్పదలచి మొదట పీఠబంధమును చెప్పుచున్నాడు. అంగహారాత్మకమగు నృత్తము నుత్పత్తిచేయునవి రెండు కరణములు. కరణము నృత్తమునకు

మాత్రుక. రెండుకరణములతోనే అభినయము ఆరంభ మగును. ఒక కరణముతో అంగహారము సిద్ధించదు. కనీసము రెండు కరణములు కావలెను. అప్పుడే అంగహారాత్మమగు పిండీబంధమనే ఆకృతివిశేషము రాగలదు.

నాలుగు, ఆరు, ఎనిమిది కరణములతోగూడ అంగహారములు రాగలవు. ఆరు కరణములున్న కలాపకమని, ఎనిమిది కరణములున్న షండకమని, ఐదు కరణములున్న సంఘాతకమని పిండీబంధములనందురు. ఆరు మొదలు తొమ్మిదివరకుగూడ కరణము లంగహారమున నుండగలవు. ఈ కరణములకు హస్తపాద వికల్పనము చెప్పబోవుచు ముందు కరణముల పేర్లను చెప్పుచున్నాడు. ఈ కరణాంగహారములు ముఖ్యముగా నాట్యమున ఆంగికాభినయ మందే ఉపకరించునవి.

తలపుష్పపుటం పూర్వం వర్తితం వలితోరుచ
అపవిద్ధం సమనఖం లీనం స్వస్తికరేచితమ్. ౩౪

మండల స్వస్తికం చైవ నికుట్టక మథాపిచ
తథై వార్ధనికుట్టంచ కటిచ్ఛిన్నం తథైవచ. ౩౫

అర్ధరేచితకం చైవ వక్షఃస్వస్తిక మేవచ
ఉన్మత్తం స్వస్తికం చైవ పృష్ఠస్వస్తిక మేవచ. ౩౬

దిక్స్వస్తిక మలాతంచ తథైవచ కటీసమమ్
ఆక్షిప్తరేచితం చైవ విక్షిప్తాక్షిప్తకం తథా. ౩౭

అర్ధస్వస్తిక ముద్దిష్ట మఞ్చితంచ తథాపరమ్
భుజఙ్గత్రాసితం ప్రోక్త మూర్ధ్వజాను తథైవచ. ౩౮

నికుఞ్చితంచ మత్తల్లి త్వర్ధమత్తల్లి చైవహి
స్యాద్రేచక నికుట్టంచ తథా పాదాపవిద్ధకమ్. ౩౯

వలితం ఘూర్ణితంచైవ లలితంచ తథాపరమ్
దండపక్షం తథాచైవ భుజఙ్గత్రస్తరేచితమ్. ౪౦

నూపురం చైవ సంప్రోక్తం తథా వైశాఖరేచితమ్
భ్రమరం చతురంచైవ భుజఙ్గాఞ్చితమేవచ. ౪౧

దండరేచితకం చైవ తథా వృశ్చికకుట్టనమ్
కటిభ్రాంతం తథాచైవ లతావృశ్చికమేవచ. ౪౨

ఛిన్నంచ కరణం ప్రోక్తం తథా వృశ్చిక రేచితమ్
వృశ్చికం వ్యంసితం చైవ తథా పార్శ్వనికుట్టకమ్. ౪౩

లలాటతిలకం క్రాంతం కుఞ్చితం చక్రమండలమ్
ఉరోమండల మాక్షిప్తం తథా తలవిలాసితమ్. ౪౪

అర్గలంచాథ విక్షిప్త మావృత్తం డోలపాదకమ్
వివృత్తం వినివృత్తంచ పార్శ్వక్రాంతం నిశుంభితమ్. ౪౫

విద్యుద్భ్రాంత మతిక్రాంతం వివర్తిక మేవచ
గజ క్రీడితకం చైవ తలసంస్ఫోటితం తథా. ౪౬

గరుడప్లుతకం చైవ గండసూచి తథాపరమ్
పరివృత్తం సముద్దిష్టం పార్శ్వ జాను తథైవచ. ౪౭

గృధ్రావలీనకం చైవ సన్నతం సూచ్యథాపిచ
అర్ధసూచీతికరణం సూచీవిద్ధం తథైవచ. ౪౮

అపక్రాంతంచ సంప్రోక్తం మయూరలలితం తథా
సర్పితం దండ పాదంచ హరిణప్లుత మేవచ ౪౯

ప్రేంఖోలితం నితంబంచ స్ఖలితం కరిహస్తకమ్
ప్రసర్పితక ముద్దిష్టం సింహవిక్రీడితం తథా ౫౦

సింహాకర్షిత ముద్వృత్తం తథోపసృత మేవచ
తలఘట్టితకం చైవ జనితం చావహిత్థకమ్ ౫౧

నివేశ మేలకాక్రీడ మూరూద్వృత్తం తథైవచ
మదస్ఖలితకం చైవ విష్ణుక్రాంత మథాపిచ. ౫౨

సంభ్రాంత మథ విష్కంభ ముద్ఘట్టిత మథాపిచ
వృషభక్రీడితం చైవ లోలితంచ తథాపరమ్. ౫౩

నాగాప సర్పింతచైవ శకటాస్యం తథైవచ
గజావతరణం చైవే త్యుక్త మష్టాధికం శతమ్ ౫౪

అష్టోత్తరశతం హ్యేతత్ కరణానాం మయోదితమ్.

తలపుష్పపుట, వర్తిత, వలితోరుక, అపవిద్ధ, సమనఖ, లీన, స్వస్తికరేచిత, మండలస్వస్తిక, నికుట్టన, అర్ధనికుట్టన, కటిచ్ఛిన్న, అర్ధరేచిత, వక్షఃస్వస్తిక, ఉన్మత్త, స్వస్తిక, పృష్ఠస్వస్తిక, దిక్స్వస్తిక, అలాత, కటీసమ, ఆక్షిప్తరేచిత, విక్షిప్తాక్షిప్తక, అర్ధస్వస్తిక, అంచిత, భుజంగత్రాసిత, ఊర్ధ్వజాను, నికుంచిత, మత్తల్లి, అర్ధమత్తల్లి, రేచిత నికుట్టిత, పాదపవిద్ధక, వలిత, ఘూర్ణిత, లలిత, దండపక్ష, భుజంగత్రస్తరేచిత నూపుర, వైశాఖరేచిత, భ్రమరక, చతుర, భుజంగాంచితక దండకరేచిత, వృశ్చికకుట్టిత, కటిభ్రాంత, లతావృశ్చిక, ఛిన్న, వృశ్చికరేచిత, వృశ్చిక, వ్యంసిత, పార్శ్వనికుట్టిత, లలాట తిలక, క్రాంతక, కుంచిత, చక్రమండల, ఉరోమండల, ఆక్షిప్త, తల విలసిత, అర్గల, విక్షిప్త, ఆవర్త, డోలాపాద, వివృత్త, వినివృత్త, పార్శ్వక్రాంత, నిస్తంభిత, విద్యుద్భ్రాంత, అతిక్రాంత, వివర్తితక, గజక్రీడితక, తలసంస్ఫోటిత, గరుడప్లుత, గండసూచి, పరివృత్త, పార్శ్వజాను, గృధ్రావలీనక, సన్నత, సూచి, అర్ధసూచి, సూచీవిద్ధ, అపక్రాంత మయూరలలిత, సర్పిత, దండపాద, హరిణప్లుత, ప్రేంఖోలిత, నితంబ, స్ఖలిత, కరిహస్త, ప్రసర్పితక, సింహవిక్రీడిత, సింహాకర్షిత. ఉద్వృత్త, ఉపసృత, తలసంఘట్టిత, జనిత, అవహిత్థక, నివేశ, ఏలకాక్రీడిత, ఊరూద్వృత్త

మదస్ఖలిత, విష్ణుక్రాంత సంభ్రాంత, విష్కంభ, ఉద్ఘట్టిత, వృషభక్రీడిత, లోలిత, నాగాపసర్పిత, శకటాస్య గంగావతరణము లని వీటిపేర్లు.

నృత్తే యుద్ధే నియుద్ధేచ తథాగతి పరిక్రమే
గతిచారే ప్రవక్ష్యామి యుద్ధచారే వికల్పనమ్. ౩౫

యత్ర తత్రాపి సంయోజ్య మాచార్యై ర్నాట్యకర్తృభిః ౩౬
హస్తపాద ప్రచారంతు కటి పార్శ్వోరు సంయుతమ్

ఉరః పృష్ఠోదరోపేతం వక్ష్యమాణం నిబోధత ౩౭

అభినయములో కాలయాపనకు, శస్త్రాది యుద్ధమున, బాహు యుద్ధమున, గతి పరిక్రమమున కరణాంగ హారములను ప్రయోగసౌష్ఠవమునకై ప్రయోగించవలెను. యుద్ధచారీ వికల్పనమును చారీవిధిని చెప్పునప్పుడు వివరించును. నడుము, రొమ్ము, వీపు, కడుపు అనువాటితో కలసిన హస్తపాద ప్రచారమును కరణముల లక్షణములో వివరించును.

యాని స్థానాని యాశ్చార్యో నృత్తహస్తా స్తథైవచ
సామాతృకేతి విజ్ఞేయాత ద్యోగాత్కరణం భవేత్. ౩౮

స్థానకములు, చారీలు, నృత్తహస్తములు అనునవి మాతృకగా గలిగి, వీటి కలయిక వలన వచ్చునది కరణము.

కటీకర్ణ సమాయత్ర కోర్పరాం సశిర స్తథా
సమున్నత మురశ్చైవ సౌష్ఠవం నామతద్భవేత్ ౩౯

నడుము, చెవి అను రెండు ఒకే ఒక సమరేఖలోఉండి, శిరస్సు వంపు లేకుండా నిలచినపుడు, వక్షఃస్థలము సమున్నతముగా కన్పించినచో ఈరూపము సౌష్ఠవ మనిపించు కొనును

★

రాగమాలిక

శ్రీ "అమరేంద్ర"

"ఈ సంగతి నిజమేనా?" అని కోపంతో ఎఱ్ఱబడిన కళ్ళతో అడిగాడు రెడ్డి

అవునని తలవూపింది నిర్మల. బదులు చెప్పే ధైర్యం లేకపోయింది

"అయితే ఇన్నాళ్ళ నుంచి ఎందుకు దాచావు?"

"ఇదివరకు నాకూ తెలియదు నిన్న నే నాన్న చెప్పాడు" అంది తొణుకుతున్న కన్నీళ్ళతో. ఏదో అనుకోని ఉపద్రవం రానున్నదని ఆమె హృదయం చెదిరిపోతోంది తను కట్టుకున్న ఆశాసౌధాలని పునాదులతో పెకలించే భూకంపం విరుచుకు పడుతుందని నిర్మల గజ గజ వణికిపోతోంది

"నన్ను మోసం చేద్దామనుకున్నావా?" అని కఠోరంగా అడిగాడు రెడ్డి.

"లేదు. నాకేమీ తెలియదు. నిన్న నాన్న చెప్పేదాకా నాకీ సంగతి తెలియదు. ఒట్టువేసి చెబుతున్నాను. నామాట నమ్మండి. తెలిసిచెప్పకుండా మిమ్మల్ని మోసగించాననే అనుమానానికి మనస్సులో తావివ్వకండి" అని బతిమాలుకుంది నిర్మల.

"నేను నమ్మను. నన్ను సర్వనాశనం చెయ్యాలని నువ్వూ మీనాన్నా పన్నాగంచేశారు. లక్షరూపాయల ఆస్తిని గడ్డిపరకలాగా తోసివేసి, కన్నతండ్రికి ప్రబలశత్రువు నయాను బీదయింటి పిల్లవైనా నిన్నే చేసుకుంటానికి సిద్ధపడ్డాను తీరాచూస్తే ఇంత మోసమా? ఇక నీకూ నాకూ ఏమీ సంబంధం లేదు" అని దురుసుగా దూసుకుపోబోయాడు రెడ్డి

"ఆగండి నిదానించండి నాన్న వచ్చే వేళయింది. అన్నీ అయన్నడిగి తెలుసుకుందురుగాని" అని దారికి అడ్డంవచ్చి ఎంతో బతిమాలుకుంది నిర్మల

"మీనాన్న మేకతోలు కప్పుకున్నపులి ఇక అయనతో మాట్లాడాల్సిన అవసరంనాకులేదు." అంటూ ప్రేమపాశంలాగా నిరోధిస్తున్న ఆ కోమల హస్తాన్ని కఠినంగా అవతలికినెట్టి బైటికి వెళ్ళిపోయాడు.

అమాంతంగా నేలలోకి అణగారిపోతున్నట్లనిపించి నిర్మల ఆపాదమస్తకమూ కంపించిపోయింది. వికసించిన పూలతోటలో ఒక్కసారిగా పెనుతుపాను విలయతాండవం చేసినట్లనిపించింది ఈ మాటాడిన మనిషి తన కోసం సర్వస్వమూత్యాగంచేసి, తననివివాహం చేసుకునేటందుకు వాగ్దానాలుచేసి, సర్వసన్నాహాలూచేసి చివరిక్షణంలో ఈ విధంగా అంతు లేని అంధకారంలోకి నెట్టివేస్తున్న వ్యక్తి మోహన్‌రెడ్డియేనా? అంత అనురాగం ఒక్కసారిగా ఇంత ఆగ్రహంగా పరిణమించటానికి తనుచేసినమహాపరాధమేమిటి? నిర్మలకి భూమి గిర్రున తిరుగుతున్నట్లు తోచింది మహోన్నత శిఖరం మీదినించి అమాంతంగా పాతాళ కుహరంలోకి ఎవరో నెట్టివేసినట్లనిపిస్తోంది.

గడపలో కొయ్యబారిపోయి అల్లాగే ఎంతోసేపు నిలబడింది. రోడ్డుమీద పోతున్న రౌడీ రాముా, మీసాలు దువ్వుకుంటూ నిర్మలకేసీ వెళ్లిపోతున్న రెడ్డికేసీ చూసి ఈలవేస్తూ "నా ప్రతాపం ఇప్పటికైనా తెలిసిందా?" అన్నట్లు ఓరచూపులు విసురుతూ వెళ్ళాడు

ఆ స్థితిలో రాముా కంటపడినందుకు నొచ్చుకుంటూ తలుపు దగ్గిరికివేసి లోపలికి వెళ్ళింది నిర్మల.

* * *

"పాత కాగితాలుకొంటా పేపర్లుకొంటా." అని కేకలు వేస్తూ కాళ్ళు అరిగిపోయేట్లు ఊరంతా తిరిగి ఒక సంచినిండా చిత్తుకాగితాలూ, రెండోచేతులో తక్కెడా రాళ్లూ పట్టుకుని గుడిసెకి తిరిగివచ్చాడు రామస్వామి. రోజూ నిర్మల చిరునవ్వుతో ఎదురువచ్చి సంచీ సాయంపట్టి కిందికిదింపి తండ్రికి కాళ్ళు కడుక్కునేందుకు నీళ్లు అందించేది. ఇవాళ దిగాలుపడి మూలకూచుని తలకింద చెయ్యి పెట్టుకుని ఏదో ఆలోచనతో సుడి తిరిగిపోతూ తండ్రి వచ్చినట్లే గమనించలేదు. జుట్టు అంతా చెదిరి ముఖాన్ని కప్పివేసింది. చెక్కిళ్లమీద కన్నీటిచారలు తడి ఆరలేదు. ఆ రోజే రిజి

స్ట్రారు ఆఫీసుకి వెళ్లి వివాహం చేసుకోవాలని ఏర్పాటుజరిగింది. కాని ఇంటికి వచ్చేసరికీ పెళ్లికూతురు అలంకారాలు లేకుండా మూర్తీభ వించిన శోకదేవతలాగా మూలకూచొని వుండ టం చూసేసరికీ ముసలి రామస్వామి అయో మయంలో పడిపోయాడు. వడ్డించి సిద్ధంగా వున్న విస్తరిలో ఎవరో దుమ్ముజల్లివుంటారనే అనుమానం శూలంలాగా పొడిచింది

"ఏమమ్మా అల్లావున్నావు? వొంట్లో బాగో లేదా? ఏం జరిగిందమ్మా? నువ్వీపాటికి పెళ్లి చేసుకుని ఇంటికితిరిగివచ్చి వుంటావన్న ఆశతో వచ్చాను. ఇదేమిటి?" అని నేలమీద చతికిల పడి పై పంచతో విసురుకుంటూ అడిగాడు

అతని కంఠంవిని ఉలిక్కిపడి ఈ లోకం లోకి తిరిగివచ్చి "నాన్నా" అని ఒక్కశోకం పెట్టింది కట్టతెగిన వాగులాగా కన్నీరుపొంగి వచ్చింది.

అంతా తారుమారయిందని చెప్పకుండానే రామస్వామి గ్రహించాడు. గొప్పఇంట్లోపుట్టిన మోహనరెడ్డి తన నీడకొంపలో పెరుగుతున్న నిర్మలని పెళ్లి చేసుకుంటాడని విన్నప్పుడే అతను అనుమానపడ్డాడు. ఇది జరిగే విషయమే నా అనిసందేహించాడు. కాని మోహన్‌వద్దన్న తలితండ్రుల మాట పెడచెవిని పెట్టి వాళ్ళకి దూరంకావడానికి సిద్ధపడి పిత్రార్జితపు ఆస్తిని కాలదన్ని, నిర్మలని వివాహం చేసుకుంటానికి సిద్ధపడ్డ తరవాత తను నమ్మక తప్పలేదు. లోకంలో జరిగే వింతల్లో ఇదొకటి అనుకు న్నాడు. నిన్నకూడా వచ్చి మోహన్ ఆ మర్నాడే వివాహం రిజిస్ట్రార్ ఆఫీసులో జరుగుతుందని చెప్పి వెళ్ళాడు. కాని ఇంతలో అంతా తారు మారవుతుందని కలలోకూడా అనుకోలేదు

నిన్నరాత్రి నిర్మలకి తనకథ అంతా దాచకుండా చెప్పాడు రేపటినుంచీ ఆమె పరపురుషుడి అధీనం అయిపోతుందనీ, ఇన్నాళ్ళనుంచీ తను పడ్డ శ్రమ ఫలిస్తుందనీ ఆశపడ్డాడు సుఖపడు తుందని ఆశించిన నిర్మల ఆషాఢమేఘంలాగా కన్నీరు వర్షిస్తుంటే అతని మనస్సు నీరయి పోయింది.

"ఇప్పుడే వస్తానమ్మా!" అని ఉత్తరీయం భుజాన వేసుకుని బయలుదేరాడు

"ఎక్కడికి నాన్నా? మంచినీళ్ళయినా ఇచ్చా నుకాను పాపిష్టిదాన్ని" అంటూ నిర్మల గ్లాసు తీసుకుని కుండలో నీళ్ళుముంచి అందిం చబోయింది

"అక్కర్లేదమ్మా! ఇప్పుడే వస్తాను. తలుపు వేసుకో"అంటూ బైటికి నడిచాడు రామస్వామి.

* * *

సిగ్నల్ వాలింది. రైలు కదలబోతోంది. పెట్టె పెట్టె దగ్గిరాఆగి లోపలికి తొంగిచూసి కళ్ళతో మూలమూలలా గాలించి వేసారిపో యాడు రామస్వామి

ఫస్టుక్లాసు పెట్టెలో బర్తుమీద పడుకున్నాడు మోహన్ రామస్వామిని చూసి ముఖంమీదికి శాలువా లాక్కున్నాడు

లోపలికి వెళ్ళి కాళ్ళమీద చెయ్యివేసి "దిగి రాబాబూ! నీతో అవసరంగా మాట్లాడాలి. తర వాత రైల్లో వెళ్దువుగాని. నామాటవిను నువ్వు దిగిరాకపోతే నేను ఈ రైలుచక్రాలక్రిందే పడి ప్రాణం తీసుకుంటాను" అని వణుకుతున్న కంఠంతో రామస్వామి ప్రాధేయ పడ్డాడు

గార్డు ఈలకూడా వేశాడు. మోహన్ గబ గబా దిగి తన సామానంతా కిందికి దింపుకు న్నాడు. అంతా సర్దేసి స్నేహితులక్కూడా కనబడకుండా ఆదరాబాదరా స్టేషనుకి వచ్చాడు ఎవరికీ తెలియని చోటికి పారిపోవాలని ఆవూరి నించి దూరంగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకు న్నాడు కాని రామస్వామి అన్నంత పనీచేసి ప్రాణం తీసుకుంటాడనే భయంతో ప్రయాణం వాయిదావేసి కిందికి దిగివచ్చాడు

రైలు వెళ్ళిపోయింది ప్లాట్‌ఫారం అంతా క్షణంలో సభ ముగిసిన తరవాత వేదికలాగా మాటుమణిగి పోయింది దీపాలు గుడ్డిగా వెలు గుతున్నయ్! ఒక సిమెంటు బల్ల ఖాళీగా కని పించింది "రా మోహన్! కూచో నేచెప్పేది విను. ఆ తరవాత నీయిష్టం వచ్చినట్లు చెయ్యి. నేను అడ్డురాను బాబూ!" అంటూ రెక్కపుచ్చు కుని రామస్వామి బల్లమీద కూచోపెట్టాడు. ముళ్ళమీద వున్నట్లుగా బాధ పడుతున్నాడు

మోహన్. ఈ ముసలాడితో మాట్లాడటానికి సుతరామూ మనసొప్పటంలేదు. కాని వదిలి పెట్టేట్లు లేదు. "నువ్వేం చెప్పక్కర్లేదు. నాకు అంతా తెలుసు." అని మోహన్ ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

"ఇవి చేతులుకావు; కాళ్ళనుకో బాబూ!" అంటూ రామస్వామి ప్రాధేయపడ్డాడు, "నా మాట వినుబాబూ! నీకు నిజం తెలియదు. ఎవరో చెప్పిన మాటలు విని నువ్వింత దురంతానికి పూనుకున్నావు...."

"నువ్వు మోసగాడివి. నీ మాటలునమ్మను. నువ్వు నాకేమీ చెప్పక్కర్లేదు. ఇంతటితో నన్ను వదిలిపెట్టు" అని పెళుసుగా అన్నాడు.

"నేను నీతో అబద్ధం చెబుతానా నాయనా! నిర్మల నాకు పంచప్రాణాలు. దానిమీద వొట్టు వేసుకుంటున్నాను. నా మాటలు ఇప్పటికీ నమ్మవా?" అంటుంటే రామస్వామి కళ్లలో నీళ్లు చింది దీప కాంతిలో మెరిసినై. అతని కంఠం ఆవేదనతో వణికిపోయింది.

మోహన్ కోపం కొంచెం చల్లారి "సరే! చెప్పు. నిజంచెప్పు." అని రామస్వామికేసి చూశాడు. రామస్వామి హోల్డాలుమీద చతికిల పడ్డాడు. ప్లాట్‌ఫారంమీద దోమలు సంగీతం పాడుతూ వాళ్ళిద్దరిచుట్టూ ముసురుతున్నయ్.

"అయితే చెప్తానువిను బాబూ! ఇది చాలా ఏళ్ళకిందటి మాట. నేను ఆరోజే జైలులోంచి ఆరేళ్ళ తరవాత బైటపడ్డాను. వచ్చేటప్పుడు నా పక్కగదిలోని ఖైదీ తన ఇంటికి వెళ్ళి పెళ్ళాం బిడ్డల సంగతి కనుక్కొని క్షేమం తెలియచెయ్యమని నన్ను కోరాడు. సరే అని సరాసరి వాడు చెప్పిన గుర్తులనిబట్టి ముందు అక్కడికే వెళ్ళాను. చాలా అద్దె బాకీ పడటంచేత ఇంట్లోంచి గెంటివేశారు. వాడి భార్య ఒకచెట్టు కింద ముష్టి ఎత్తుకుంటూ తల దాచుకుంటోంది. నేను వెళ్ళేసరికి కలరా తగిలి ఇప్పుడో ఇంకా స్సేపో అనే స్థితిలో వుంది. పక్కన ఒక రెండేళ్ళ పసిపిల్ల పాపం తన తల్లి అవస్థ తెలియని అమాయక స్థితిలో బొమ్మరిల్లు కడుతోంది మట్టితో. నా కళ్ళఎదుటే తల్లి కళ్లు మూసింది. దిక్కులేని ఆ పసిదాన్ని ఎత్తుకుని బయలుదేరాను. ఆపిల్ల తండ్రి హంతకుడు. నేరం ఋజువైంది. ఉరి తీశారు. ఆ దిక్కులేనిపిల్ల నా పాలపడింది. అంతవరకూ దొంగతనాలుచేసి జబర్దస్తీగా బతికాను. ఖైదుకి వెళ్ళాలంటే అత్తవారింటికి అల్లుడు వెళ్ళినంత ధీమాగా వెళ్ళేవాణ్ని. కాని ఆ అమాయికపు చూపుల పసిపాపని చూసేసరికీ నా మనసు తిరిగిపోయింది. గతంమీద రోత పుట్టింది. ఆ పాపని కంటికి రెప్పగా కాపాకి పెంచి పెద్దదాన్ని చెయ్యాలి. దానికోసం అష్టకష్టాలూపడి అయినాసరే ఆ పాపకి గౌరవంగా మర్యాదగా లోకంలో అందరి పిల్లలలాగే చదువు సంగీతాలు చెప్పించాలి. ఈ కోరిక నా మనస్సులో తళుక్కున మెరిసింది. ఆ క్షణంలోనే నేను కొత్తమనిషి నయాను. ఈ లోకంలో నాలాటి పనికిమాలిన వాడిక్కూడా బతకాల్సిన అవసరం కనిపించింది. ఆ పాపకోసమే నేను చెడుదారులలోంచి కాలు వెళ్ళగించుకున్నాను. పాతస్నేహితు లందరికీ దూరమయాను. వింటున్నావా బాబూ?"

"వింటున్నాను. కాని ఇదేదో కట్టుకథలాగావుంది."అని పెదవి విరిచాడు మోహన్.

"ఇంకా నమ్మకం కుదరలేదా? నా నోటితో నిర్మలమీద వొట్టువేసుకున్నా ఇంకా సందేహమేనా? ఆ వూరు విడిచి వెళ్ళాను. పొరుగూరిలో సుందరమ్మఅనే స్నేహితురాలు వుండేది. అక్కడికి వెళ్ళాను. జైలుకి వెళ్ళక ముందు దానికీ నాకూ చాలాకాలం సంబంధం వుండేది. దొంగచాటుగా కాపుసారా కాచి వ్యాపారం చేసేది. నేనంటే ప్రాణం వదిలేది. నేను దొంగతనంచేసి తెచ్చిన సొమ్ములు కరిగించి ఇద్దరం చెరుసగం పంచుకొనేవాళ్ళం. నేను పిల్లని తీసికెళ్ళి దానికి అప్పగించాను. తల్లి లేనిలోటు లేకుండా కన్నబిడ్డకన్నా ఎక్కువ మమకారంతో పెంచింది. నేను వొళ్లు వంచి కూలీనాలీచేసి పొట్టపోసుకోటంనేర్చుకున్నాను. నిజాయితీగా బతకాలని ఎంతో ఆరాటపడ్డాను. అడుగడుగునా అంతా నన్ను అనుమానించేవాళ్లు. ఒకప్పటి గజదొంగననే సంగతి ఎవరూ మరిచిపోలేదు. నేను మంచిదారిలో నడుస్తున్నా

అనుమానించటం మానలేదు ఊళ్ళోగాని, చుట్టుపక్కలగాని ఏ దొంగతనం జరిగినా ముందు నన్నుపట్టుకుని చావుదెబ్బలు కొట్టే వాళ్ళు. మొత్తుకున్నా ఎవరూ వినిపించుకునే వాళ్లుకారు. అక్కడవుంటే మర్యాదగా బతికే అస్కారంలేదని చివరికి ఊరు వదిలేశాను. పిల్లకి ఆరేళ్లువచ్చినయ్. సుందరమ్మ పిల్లని తనదగ్గరే వుంచి పెంచుతానని బతిమాలింది. అటువంటి మనిషిదగ్గిర పెరగటం మంచిది కాదని పిల్లని అర్ధరాత్రివేళ చంకనవేసుకుని "అక్కడినించి పారిపోయి వచ్చాను."

"ఊఁ తరవాత?"

"బెజవాడ చేరుకుని లైసెన్సుకూలీగా బరువులు మోశాను. కాని పాతకేడీ ముద్ర మొఖాన చెరిగిపోలేదు. ఎవరిజేబులో డబ్బు పోయినా నేనే కత్తిరించానని అనుమానంతో కట్టేసి కొట్టి పీడించేవాళ్లు. కొన్నాళ్లు హోటల్లో సర్వరుగా పనిచేశాను. కొంతకాలం రిక్షా తోలుకుని బతికాను. పోలీసులబాధ తప్పలేదు. బస్తాలు మోసే కూలీగా పనిచేశాను. లాగుడుబళ్ళలో కొండంతబరువు వేసినా అలాగ్గా ఈడ్చేసి కొన్నాళ్లు కాలం వెళ్ళదీశాను. ఈ కష్టమంతా అపాపకోసమే. దాన్ని బళ్లోకిపంపాను. అందరిలాటి మంచిగుడ్డలు కుట్టించాను పంతులమ్మగారే దానికి నిర్మల అని పేరుపెట్టారు. పిల్లమీది మనసు తిప్పుకోలేక సుందరమ్మకూడా బెజవాడ వచ్చేసింది ఇద్దరం వొళ్లువొంచి చెమటవోడ్చి ఈ పసిదాన్ని సాకుతూవచ్చాం. కాని సుందరమ్మ మళ్ళీ దొంగసారాకాయటం సాగించింది. నన్నుకూడా దొంగతనం చెయ్యమనీ. కష్టపడితే దొక్కనిండదనీ అదృష్టం సరిగావుంటే ఒక్కరాత్రి వేలు సంపాయించవచ్చనీ చెవిలో ఇల్లుకట్టుకుని పోరటం మొదలెట్టింది. కోపంవచ్చి దానితో తెగతెంపులుచేసుకుని బెజవాడ వదిలేసి ఈవూరు వచ్చిపడ్డాను. సుందరమ్మ నామీద కత్తికట్టింది. నిర్మలకోసం నేను పడినపాట్లన్నీ నిరర్ధకమైపోయేట్లు, మేమిద్దరం నాశనమైపోయేట్లు చేస్తానని పంతం పట్టింది. మామీద పగతీర్చుకోటానికి తనూ ఈవూరు వచ్చింది. అంతప్రేమతో పెంచిన నిర్మల మీద ఇంతఅక్కసు ఎల్లా పుట్టుకువచ్చిందో చెప్పలేను. వింతమనిషి అది. ఈ వూళ్ళో దొంగసారా కాయటం, వ్యభిచారులని పోషించటం వృత్తిగా పెట్టుకుని డబ్బు కొల్లలుగా సంపాదిస్తోంది. ఒక రౌడీ వాడిని అమ్మాయిమీదికి ఉసికొలిపింది. అమ్మాయి బళ్లోంచి వస్తుంటే వెంటపడితే ధైర్యంతో వెనక్కితిరిగి చెంపపెటేట్లు కొట్టిందిట. అప్పటినుంచీ వాడికూడా మామీదకక్ష. వాళ్లే నీ మనస్సు విరిచారు. నాకుతెలుసు" అని ఆగాడు.

"అయితే నిర్మల నీ కూతురూ, వేశ్య కూతురూ కాదన్నమాట."

"కాదు, దిక్కులేనిపిల్ల. నాజీవిత మంతా దాని సుఖంకోసం ధారపోస్తున్నాను. నీతిగా నిజాయితీతో పొట్టపోసుకుంటూ అష్టకష్టాలు పడి చదివిస్తున్నాను. అది నన్ను కొత్తమనిషిని చేసింది. నా కళ్ళముందొక గొప్పవెలుగుగా నిలబడి నన్ను ముందుకు నడిపించింది. నా కష్టాలు గట్టెక్కినయ్యాని. నీ చేతులోపెట్టి నిశ్చింతగా కళ్లుమూసుకోవచ్చునని ఆశపడ్డాను. నువ్వు అడిగినప్పుడు దాని అదృష్టం పండిందని మురిసిపోయి మారుమాట చెప్పకుండా పెళ్లికి అంగీకరించాను. కాని ఇప్పుడు నామీద నాకు అంతులేని కోపంగావుంది ఆదిక్కులేని పిల్ల నావంటి దుర్మార్గుడికి ఎందుకు దొరకాలి? జైలులోంచి విడుదలకాగానే ఆ రావిచెట్టు దగ్గరికి నేను పోకుండావుంటే ఎంత బాగుండేది! ఏ పుణ్యాత్ముల్లో ఆపిల్లని చేరదీసి పెంచి పెద్దదాన్ని చేస్తే ఎంత సుఖపడేదో! నామూలాన ఇన్ని బాధలు పడి ది. నాదగ్గరికిచేరిన ఏవ్యక్తీ సుఖపడ లేదు నేను చాలా దుర్మార్గుణ్ని. నీచుణ్ని. ద్రోహిని. దొంగని. నాకు దొరకటం వల్లనే ఏపాపమూ ఎరుగని అమాయకురాలు ఇన్ని అగచాట్లకి గురిఅయింది. అవునుబాబూ! మా అంతస్థుకి మించిన ఆశలు పెట్టుకుని ఏంలాభం? నువ్వెక్కడా మేమెక్కడా? ఇక వెళ్తాను. నీఇష్టం. నిజమంతా చెప్పేశాను. ఏమీ దాచలేదు." అని ముగించి లేచాడు. మోహన్ కదలకుండా మెదలకుండా కూచున్నాడు. మిలమిలమెరిసే నక్షత్రలోకం కేసి

చూస్తున్నాడు ఎవరో తనమీద జల్లుతున్న శుభాక్షతల్లాగా కనిపిస్తున్నయ్ ఆ లక్షల నక్షత్రాలు నిశీధ నిశ్శబ్దంలో

* * *

"ఎక్కడికి? ఆగు"

"కాలేజికి."

"ఇవాళకూడానా?"

"ఏం? విన్నటికీ ఇవాళకీ తేడా ఏమిటీ?"

"పద రిజిస్ట్రారు ఆఫీసుకి. పదకొండుకావస్తోంది"

"నగందారిలో మనస్సుమార్చుకోరుగదా?"

"ఇది తిరుగులేని నిశ్చయం. నిర్మలా! నా మాట నమ్ము"

తలుపుమీద వాలిన పిచ్చుకలు కిచకిచమంటూ తుర్రుమన్నయ్ వాళ్ళమధ్య నుంచి.

పక్కవీధిలోంచి "చిత్తుకాగితాలు కొంటా. పాతపేపర్లు కొంటా" అనే ముసలి కంఠం దూరంగా వినిపిస్తోంది.

"పదమరి?"

"బాగుంది మీతో ఏదివచ్చినా కష్టమే! లేడికి లేచిందే ప్రయాణమా?" అంటుంటే ముఖం చంద్రబింబం తాకిన మేఘపు అంచులాగా మెరిసిపోయింది. నిర్మల కలలోకూడా ఆశించలేదు మోహన్ తిరిగివస్తాడని నిన్న అంత నిరాశా, నేడు ఇంత ఆనందం! అవును ఆశనిరాశల దాగుడుమూతలే అడుగడుగునా జీవితంలో కనిపిస్తున్నాయ్. ఆశ్రుదరహాసాల అద్భుతరాగమాలికే జీవితమేమో!

"నిన్న నేను దనవుణ్ని" అని తల వంచుకున్నాడు మోహన్.

"అయితే ఇవాళదేవతలా?" అంది నిర్మల పెదవులమీద చిందుతున్న మందహాసంతో.

"కాదు ఇవాళ నేను మానవుణ్ణి!" అంటూ ముందుకి సాగాడు మోహన్.

గగనమండలంలో ప్రభాకర దివ్యమూర్తిని వెన్నంటివెడుతున్న ఛాయాదేవిలాగా అనుసరిస్తూ నడిచివెళ్ళింది నిర్మల.

★

ఆంధ్ర తర్క సంగ్రహము

శ్రీ కుప్పా బైరాగి శాస్త్రి

౨

మూ॥ శీతస్పర్శవత్య ఆపః తాః ద్వివిధాః నిత్యా నిత్యాశ్చేతి, నిత్యాః పరమాణు రూపాః అనిత్యాః కార్యరూపాః।

ఆపః అనగా జలము, జలమునకు శీత స్పర్శ కలిగియుండుట లక్షణము. అనగా ఇదివరకు పృథివిలక్షణమువలె శీతస్పర్శ నిష్ఠ శీతస్పర్శత్వావచ్ఛిన్న సమవాయ సంబంధావచ్ఛిన్న ఆధేయతా నిరూపిత అధికరణతావద్వృత్తి జాతిమత్వం జలమునకు లక్షణము అని చెప్పవలయును.

ఆ జలము, నిత్యత్వ అనిత్యత్వ రూప విభాజక ధర్మద్వయములో అన్యతరము గలది. పరమాణురూపమైన జలము నిత్యమైనది. కార్యరూపము ´ అనగా మన ప్రత్యక్షమగుచున్న జలమంతయు అనిత్యమైనది, నిత్యమనగా ధ్వంస అప్రతియోగి. అనిత్యమనగా ధ్వంసప్రతియోగి. ధ్వంస అనగా నాశము. కలశనాశమునకు కలశము ప్రతియోగి కలశము ప్రతియోగిగాగల నాశము కలశప్రతియోగిక నాశము ధ్వంస అనగా నాశమే. నిత్యములయిన పరమాణువులకు ధ్వంసము లేదు. గాన ధ్వంసమునకు పరమాణువులు ప్రతియోగులు కావు అనగా అప్రతి యోగులు అని అర్థము-ఘటము మొదలగు కార్యద్రవ్యములకు ధ్వంస గలదు గాన ఆ ధ్వంసకు ప్రతియోగులు ఘటాదులు అనిత్యము

మూ॥ పునస్త్రివిధాః శరీరేంద్రియ విషయ భేదాత్ । శరీరం వరుణలోకే। ఇంద్రియం రసగ్రాహకం రసనం విషయ స్సరిత్స ముద్రాదిః॥

ఆ నిత్యానిత్య రూపమైన జలము మరల శరీరత్వ, ఇంద్రియత్వ, విషయత్వ రూపవిభాజక ధర్మత్రయములో ఏదియో ఒక ధర్మము గలది. వరుణలోకములోని శరీరము జాతీయ శరీరము రసగ్రాహక మైన యింద్రియము రసనేంద్రియము. రస విషయక ప్రత్యక్షమును కలుగజేయుచూ ఇంద్రియ మగుట రసనేంద్రియ లక్షణము. రసవిషయకమైన ప్రత్యక్షము ఏదియన ఇది తియ్యని రసము, ఇదిపుల్లని రసము అను ప్రత్యక్షము దానిని కలుగజేయునదియు. ఇంద్రియ మైనదియును రసనేంద్రియము అగుటచేత లక్షణ సమన్వయమైనది. ఇచ్చట ఇతర ఘ్రాణాది ఇంద్రియములందు అతి వ్యాప్తివారణకు విశేషణరూపమైనరస విషయకప్రత్యక్షను కలుగజేయుట అనునదియు, ఇతర రస మందు అతివ్యాప్తివారణకొరకుఇంద్రియ మగుటఅను విశేష్యమున్నూ ఆవశ్యకములు నదులు సముద్రములు మొదలగునవి విషయ జలములు

మూ॥ ఉష్ణస్పర్శ వత్తేజః, తద్ద్వివిధం నిత్యమనిత్యంచేతి. నిత్యం పరమాణు రూపం అనిత్యం కార్యరూపం.

ఉష్ణస్పర్శ కలది తేజస్సు ఉష్ణస్పర్శయందలి ఉష్ణస్పర్శత్వా వచ్ఛిన్నమై సమవాయ సంబంధావచ్ఛిన్నమై యే ఆధేయత గలదో తన్నిరూపిత అధికరణతావద్వృత్తి యయిన జాతి కలిగియుండుట తేజస్సుకు లక్షణమని ఆయా దోషముల వారణకొరకు నిష్కర్షగా చెప్ప

వలయును. ఆ తేజస్సు నిత్యత్వ అనిత్యత్వరూప విభాజక ధర్మద్వయములో ఏదో ఒక ధర్మము కలది పరమాణు రూపమైన తేజస్సు నిత్యము, ధ్వంసకు అప్రతియోగి కార్యరూపమైన తేజస్సు అనిత్యము ధ్వంసకు ప్రతియోగి

మూ॥ పునస్త్రివిధం శరీరేంద్రియ విషయభేదాత్ శరీర మాదిత్యలోకే. ఇంద్రియం రూపగ్రాహకం చక్షుః. విషయశ్చతుర్విధః భౌమ దివ్య ఔదర్య ఆకరజ భేదాత్. తత్రభౌమం వహ్న్యాది. దివ్యం అబింధనం విద్యుదాది భుక్తస్య పరిణామ హేతు రౌదర్యం, ఆకరజం సువర్ణాది

ఆ తేజస్సు శరీరత్వ, ఇంద్రియత్వ, విషయత్వ రూపవిభాజక ధర్మత్రయములో ఏదియో ఒక ధర్మము కలది. ఆదిత్యలోకములోని శరీరము తైజస శరీరము

రూపమును గ్రహించు ఇంద్రియము చక్షురింద్రియము. రూపవిషయక ప్రత్యక్షమును కలుగజేయుచు ఇంద్రియమగుట చక్షురింద్రియలక్షణము రూపవిషయకమైన ప్రత్యక్షము ఏదియన ఇది తెలుపు రంగు, ఇది పసుపురంగు అను ప్రత్యక్షము. ఆ ప్రత్యక్షమును కలుగజేయుచు ఇంద్రియమగుట అనునది చక్షురింద్రియమందు కలదు గాన లక్షణసమన్వయమైనది రూపమందు అతి వ్యాప్తివారణ కొరకు ఇంద్రియమగుట అను విశేష్యమున్నూ, ఘ్రాణాది ఇంద్రియములయందు అతి వ్యాప్తివారణ కొరకు విశేషణమున్ను ఆవశ్యకములు. విషయ తేజస్సు, భౌమత్వ, దివ్యత్వ, ఔదర్యత్వ, ఆకరజత్వరూప విభాజక ధర్మములలో ఏదియోఒక ధర్మముకలది భౌమ తేజస్సు అనగా నిప్పు మొదలయినవి. దివ్యతేజస్సు, ఉదకము, ఇంధనముగా గల మెరుపు మొదలగునవి ఔదర్యతేజస్సు మనము తినిన పదార్థములను జీర్ణముచేయునది. గనులలో పుట్టిన బంగారము మొదలగునవి ఆకరజ తేజస్సు

మూ॥ రూపరహిత స్పర్శవాన్ వాయుః సద్వివిధః నిత్యోనిత్యశ్చేతి. నిత్యః పరమాణు రూపః అనిత్యః కార్యరూపః.

రంగు లేకుండినదై స్పర్శ కలది వాయువు వాయువుకు రూపాభావము కలదై (రూపము లేకుండినదై) స్పర్శ కలిగి యుండుట లక్షణము రూపాభావము అనగా రూప ప్రతియోగిక అభావము రూపప్రతియోగిక అభావము కలదై, స్పర్శనిష్ట యందున్న స్పర్శత్వావచ్ఛిన్నమైన సమవాయ సంబంధావచ్ఛిన్నయే ఆధేయత గలదో ఆ ఆధేయతచే నిరూపితమైన అధికరణత కలిగియుండుట వాయువునకు (గాలికి) లక్షణము. రూపప్రతియోగికమైన అభావము యేదియన గాలియందు రూపములేదు అను ప్రతీతి సిద్ధమైన అభావము ఏది లేదందుమో అది ఆ భావమునకు ప్రతియోగి గాన రూప ప్రతియోగిక అభావమున్నూ స్పర్శయందలి సమవాయసంబంధావచ్ఛిన్నమై స్పర్శత్వావచ్ఛిన్నమైన ఆధేయతచే నిరూపితమైన అధికరణత కలిగియుండుటయు గాలియందు గలదుగాన లక్షణ సమన్వయము అయినది విశేషణమైన రూప ప్రతియోగిక అభావము కలిగి యుండుట మాత్రమే లక్షణమైన ఆకాశమందు రూపములేదు గాన యీ పై లక్షణము ఆకాశమందు గూడా ఉండుటచేత అతి వ్యాప్తి స్పర్శవత్వముగూడా లక్షణములో ఉన్న యెడల ఆకాశమందు స్పర్శలేదు గనుక అతివ్యాప్తి వారిం

చును కేవలము స్పర్శవత్వమే లక్షణము గా చెప్పిన పృథివియందు అతివ్యాప్తి అందుకు స్పర్శవత్వముతో బాటు రూప రహితత్వము గూడా జేర్చబడినది. పృథివి యందు రూపమేఉన్నది గాన రూపాభావము లేదు గాన అతివ్యాప్తి నివారణ యగుచున్నది పృథివి యందు రూపము ఉన్నప్పటికీ ఘటములేదుగాన రూపఘట ఉభయములేదు అనగా రూపఘట ఉభయిముయొక్క అభావము కలదు అని అర్థము. ఉభయాభావములో రూపాభావముగూడాఉన్నది గాన రూప ప్రతియోగిక అభావముకలిగియుండుట, స్పర్శకలిగి యుండుట మరల పృథివి యందు కలవు గనుక మరల అతివ్యాప్తి రాదా అనగా, రూపప్రతియోగిక అభావము అన్నచోట కొద్దిమార్పు చేయవలయును రూపప్రతియోగికమనగా రూపమందలి ప్రతి యోగితా నిరూపితము. రూపమందు ప్రతియోగిత్వము, రూపత్వము ఉన్నవి. ఒకచోట నున్న రెండు ధర్మములకు అవచ్ఛేద్య అవచ్ఛేదకభావముగాన రూపత్వావచ్ఛిన్నము ప్రతియోగిత్వము అగును ప్రస్తుతలక్షణము లో రూపత్వావచ్ఛిన్న ప్రతియోగి తానిరూపితమైన అభావము కలిగియుండుట, స్పర్శ కలిగియుండుట అని పరిష్కారము చేసిన పక్షమందు లోగా చెప్పిన ఉభయాభావము ఉభయత్వావచ్ఛిన్న ప్రతియోగితాకము గాని రూపత్వావచ్ఛిన్న ప్రతియోగి తాని రూపితము గాదుగాన, గూపఘట ఉభయాభావము తీసుకొనుటకే వీలులేదు గాన, అతివ్యాప్తి చెప్పుటకు వీలులేదు రూపత్వావచ్ఛిన్నమైన ప్రతియోగితచే నిరూపితమైన అభావముకలిగియుండుట, స్పర్శత్వావచ్ఛిన్నమై సమవాయ సంబంధావచ్ఛిన్నమైన స్పర్శయందలి యే ఆధేయత గలదో ఆ ఆధేయతా నిరూపితమైన అధికరణత కలిగియుండుట వాయువునకు లక్షణము. ఆ వాయువు (గాలి) నిత్యత్వ అనిత్యత్వ రూపములైన రెండు విభాజక ధర్మములలో ఏదయో ఒక ధర్మము గలది. పరమాణు రూపమైన వాయువు నిత్యము, అనగా ధ్వంసమునకు అప్రతియోగి అనిత్యము అనగా ధ్వంసకు ప్రతియోగియైనది. కార్యరూపమైన వాయువు

మూ॥ పునస్త్రివిధః శరీరేంద్రియ విషయభేదాత్, శరీరం వాయులోకే, ఇంద్రియం స్పర్శగ్రాహకం త్వక్ విషయోవృక్షాది కంపనహేతుః వాయుః ప్రాణశ్చ. సఏకోప్యుపాధి భేదాత్ ప్రాణాపానాది సంజ్ఞాం లభతే.

ఆ వాయువే శరీరత్వ ఇంద్రియత్వ విషయత్వ రూపమైన మూడు విభాజక ధర్మములలో యేదియో ఒక ధర్మము గలది వాయులోకములో ఉన్న శరీరము వాయవీయ శరీరము. అనగా పిశాచ శరీరము

స్పర్శ గ్రాహకమైన ఇంద్రియము త్వగింద్రియము ఇచ్చటగూడా స్పర్శవిషయక ప్రత్యక్షమును కలుగజేయునదై ఇంద్రియ మగుట త్వగింద్రియమునకు లక్షణము. స్పర్శయందు అతివ్యాప్తివారణకు విశేష్యమున్నూ రసనాదులయందు అతివ్యాప్తి, వారణ కొరకు విశేషణమున్నూ ఆవశ్యకములు.

వృక్షములను ఇతర వస్తువులను కదిలించుటకు హేతువైనది విషయ

వాయువు అటులనే ప్రాణవాయువు గూడా విషయ వాయువే ఆ ప్రాణవాయువు ఒక్కటి యైనప్పంటికీ ఆవాయువున్న స్థానభేదముచేత ప్రాణమని, అపానమని, వ్యానమని, ఉదానమని, సమానమని చెప్పబడుచున్నది.

మూ॥ శబ్దగుణక మాకాశం, సచైకం విభు నిత్యంచ

శబ్దము గుణముగా కలది ఆకాశము. ఇచ్చట గుణము అనుపదము ఆకాశమందు శబ్దము ఒక్కటియే విశేష గుణము అని తెలిపిడి చేయుటకు, రూపము, గంధము రసము, స్పర్శ, స్నేహము, సాంసిద్ధిక ద్రవత్వము శబ్దము. బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛా, ద్వేషము, ప్రయత్నము, ధర్మము, అధర్మము, భావనాఖ్యా, సంస్కారము, ఇవి విశేష గుణములు.

శబ్దము కలిగియుండుట ఆకాశమునకులక్షణము. కాలమందు అతివ్యాప్తివారణకు సమవాయ సంబంధా వచ్చిన్నమై శబ్దత్వా వచ్చిన్నమైన యే ఆధేయత గలదో ఆ ఆధేయతా నిరూపితమైన అధికరణత కలిగియుండుట అని నిష్కర్ష చేయవలయును. ఆకాశము నిత్యము దానికి పుట్టుటలేదు గనుక అవ్యాప్తి రూపదోషము రాదు అందువలన జాతి ఘటితముగా లక్షణము చెప్పనవసరము లేదు

ఆ ఆకాశము ఒక్కటియే తనకు సజాతీయమైన రెండవ వస్తువు లేనిది. విభు అనగా సర్వమూర్తద్రవ్యములతో కూడినది. మూర్తద్రవ్యములు అనగా నిర్దేశించుటకు వీలయిన పరిమాణము గలవి. పృథివీ, జలము, తేజస్సు, వాయువు, మనస్సులు, మూర్తద్రవ్యములు. ఆకాశము యీ అన్ని మూర్తద్రవ్యములతో ఎప్పుడూ సంయోగము కలిగియుండును. నిత్యమైనందున ధ్వంసలేదు గనుక ధ్వంసకు అప్రతియోగి.

మూ॥ అతీతాది వ్యవహారహేతుః కాలః సచైకో విభుర్నిత్యశ్చ-

అతీతము అనగా గడచినది, ఆడిఎద మువలనజరుగుచున్నది; రాబోవుచున్నది గూడా గ్రహించవలయును వ్యవహారమనగా శబ్దప్రయోగము.

ఈ అతీతాది శబ్దప్రయోగముకు కారణమైనది కాలము_ కారణము కాలమైన, కార్యము అతీతాది వ్యవహారము. కారణమందు కారణత అను ధర్మము కార్యమందు కార్యత అను ధర్మము ఉండును. కార్యతకు కారణతకు నిరూప్య నిరూపక భావసంబంధముండును కార్యతా నిరూపితము కారణత అగును.

కాలమునకు లక్షణమేమనగా అతీతాది వ్యవహారమందున్న కార్యతచే నిరూపితమైన కారణత కలిగియుండుట సమన్వయము ఎటులన అతీతాదివ్యవహారము ఏదియన కలశము గడిచినది. కలశము రాబోవుచున్నది, కలశము ఉన్నది, అను వ్యవహారము యీ వ్యవహారములలో కారణము, కాలమే వ్యవహారములో వ్యవహర్తవ్యము, అనగా వ్యవహరించబడుచున్నది కారణము అతీతము అను వ్యవహారములో అతీతము (కాలము) కారణముగాన అతీతాది వ్యవహారమందు కార్యతయు కాలమందు కారణతయు ఉన్నవి ఆ కార్యతానిరూపితము కాలమందున్న కారణతా, ఆ కారణ కలిగియుండుట కాలమందున్నది గనుక లక్ష్యమైన కాలమందు లక్షణము చూపబడినది.

అతీతాది అని తీసివైచి, వ్యవహారమందున్న కార్యతా నిరూపితమైన కారణత కలిగి యుండుటయే కాలలక్షణ మనిన కలశాదులయందు అతి వ్యాప్తి వ్యవహారములో వ్యవహరించబడు వస్తువులు కారణముగాన ఘటము కలశము అను వ్యవహారములో ఘటము కలశము కారణము, గాన-ఆ అతివ్యాప్తి వారణకు అతీతాది వ్యవహారము అని చెప్పవలయును. అతీతాది వ్యవహారములో అతీతాది కాలమే కారణముగాని అతి వ్యాప్తివారించును.

ఆ కాలము తనకు సమాన జాతీయమైన రెండవ వస్తువు లేనిది సర్వమూర్త ద్రవ్యములతో కూడినటువంటిది ధ్వంసకు అప్రతియోగి.

మూ॥ ప్రాగాది వ్యవహారహేతుర్దిక్ సాచైకా విభ్వీనిత్యాచ

ప్రాక్ అనగా తూర్పు, ఆదిపదము వలన దక్షిణము, పడమర, ఉత్తరము, విదిక్కులుగూడా గ్రహించవలయును.

తూర్పు మొదలగు వ్యవహారమునకు కారణము దిక్కు. ప్రాగాది వ్యవహార మందున్న కార్యతానిరూపిత కారణత కలిగియుండుట దిక్కునకు లక్షణము. కలశాదులయందు అతి వ్యాప్తివారణ కొరకు ప్రాగాది అను విశేషణము ఆవశ్యకము. ఆ దిక్కు తనకు సజాతీయమైన రెండవ వస్తువులేనిది సర్వమూర్త ద్రవ్యములను కలసి ఉన్నది. ధ్వంసకు ప్రతియోగికాని దిన్ని

మూ॥ జ్ఞానాధికరణ మాత్మా సద్వివిధః
జీవాత్మా, పరమాత్మా చేతి, పరమాత్మా ఏకఏవ జీవస్తు ప్రతిశరీరం భిన్నోవిభుర్నిత్యశ్చ.

జ్ఞానము ఆత్మయందు ఉండును, గాన జ్ఞానమునకు ఆత్మ అధికరణము. జ్ఞానము ఆధేయము జ్ఞానవాన్ ఆత్మాఅని చెప్పినచూ ఇట్టి అర్థమే వచ్చునుగాని అధికరణము అని చెప్పుటచేత ఆత్మయందు జ్ఞానము సమవాయ సంబంధముచే ఉండును అని సూచించబడుచున్నది

సమవాయ సంబంధా వచ్ఛిన్నమై జ్ఞానత్వావచ్ఛిన్నమైన జ్ఞానమందలి ఆధేయతచే నిరూపితమైన అధికరణత కలిగి యుండుట ఆత్మకు లక్షణము ఇతర సంబంధా వచ్ఛిన్న ఆధేయతను తీసుకుని కాలమందు అతివ్యాప్తి వారణకు సమవాయసంబంధా వచ్ఛిన్నమనియు, గుణత్వావచ్ఛిన్న ఆధేయతను తీసుకుని కాలాదులయందు అతి వ్యాప్తివారణకు జ్ఞానత్వావచ్ఛిన్నమనునదియు వాడబడినవి

ఆ ఆత్మ జీవాత్మత్వ పరమాత్మత్వ రూప విభాజక ధర్మద్వయములో ఏదియో ఒక ధర్మము కలది.

పరమాత్మ ఒక్కడే స్వసజాతీయమైన ద్వితీయవస్తువు లేనివాడు. నిత్యుడు. జీవాత్మ ప్రతిశరీరమందు ఒక్కొక్కడు ఉండుటచే అనేకముగా ఉన్నాడు. సర్వమూర్త ద్రవ్యములను కలసియుండును. ధ్వంసకు ప్రతియోగికాడు అనగా నిత్యము

మూ॥ సుఖాద్యుపలబ్ధి సాధనమింద్రియం మనః
తచ్చప్రత్యాత్మ నియతత్వా దనంతం పరమాణురూపం నిత్యంచ.

ఉపలబ్ధియనగా ప్రత్యక్షము. సుఖాది అనుటచే దుఃఖముగూడా గ్రహించవలయును. సుఖాది ప్రత్యక్షమునకు సాధనము అనగా కారణము మనస్సు- ఒక

ప్రత్యక్షము కలుగుటకుపూర్వము, ముందు ఆత్మమనస్సుతో కలియ వలయును ఆ మనస్సు కళ్లు మొదలగు ఇంద్రియము లతో, ఆ ఇంద్రియము వస్తువుతోను కల సిన తరువాత ప్రత్యక్షము కలుగును గాన ప్రత్యక్షమునకు మనస్సు గూడా రకాణముగాన సుఖాది ప్రత్యక్షమందలి కార్యతానిరూపిత కారణత కలిగియుం డుటయు, ఇంద్రియము గాన ఇంద్రియ మగుటయు మనస్సునకు కలదు గాన సుఖాది ప్రత్యక్షమందలి కార్యతా నిరూ పిత కారణత కలగియుండి ఇంద్రియమగు టన నస్సునకులక్షణముగాచెప్పబడినది.

సుఖాది ప్రత్యక్ష మనగా సుఖాదుల యొక్క ప్రత్యక్షము ప్రత్యక్షములో సుఖాదులు విషయములుకాన సుఖాది విషయక ప్రత్యక్ష నిష్ఠమైన యే కార్యత కలదో ఆ కార్యతా నిరూపిత కారణత కలిగి యుండుటయే మనస్సుకు లక్షణ మని చెప్పిన, ఆత్మగూడా ప్రత్యక్షములో కారణమేగాన ఆత్మయందు అతివ్యాప్తి వచ్చును కేవలము ఇంద్రియ మగుటయే మనస్సుకు లక్షణముగా చెప్పిన కండ్లు మొదలగు ఇంద్రియముల యందు అతి వ్యాప్తి గాన మొత్తము లక్షణము చెప్ప బడినది.

ప్రతి ఆత్మకు ఒక్కొక్క మనస్సు ఉండును గనుక జీవ ఆత్మలు అనంత ములుగాన మనస్సులుగూడా అనంత ములు కాని పరమాణు పరిమాణము కలవి నిత్యములు, అనగా ధ్వంసకు ప్రతి యోగులు కావు

[11]

జీటా

(ZETA: Zero Energy Thermonuclear Assembly)

శ్రీ వసంతరావు వేంకటరావు

౧

జీవజాతు లన్నిటిలో మానవజాతి ఒక్కటే ప్రపంచరూపాన్ని మార్చగల సామర్థ్యం సంపాదించింది. భూమిపై జీవం పుట్టి 100 కోట్ల సంవత్సరాలు గతించేయని శాస్త్రజ్ఞులంటారు. తొలి సారిగా అత్యంత సూక్ష్మ క్రిమి రూపంలో పుట్టిన జీవం క్రమంగా పరిణామం చెందుతూ, తుదకు, రమారమి 10 లక్షల సంవత్సరాల క్రితం, మనుష్య రూపాన్ని ధరించిందని విజ్ఞానుల అంచనా. అప్పటినుండి ఇతర జీవులకంటె భిన్నమైన పథాలలో యాత్ర సాగిస్తూ తన పరిసరాలను పరిశీలిస్తూ, అనేక విధాల ప్రకృతిని అవగాహన చేసికొంటూ, తనకంటె బలమైన సేవకుని విశ్వాసపాత్రమైన శక్తిరూపంలో సంపాదించాలని ప్రయత్నిస్తునే ఉన్నాడు. అయితే, ప్రకృతిని అర్థం చేసుకోడానికి ఎంతో కాలం పట్టింది. సుమారు 5000 ఏండ్లక్రిందట ప్రకృతితో సంఘర్షణకు పూనుకొని సుఖజీవనం చేయడానికి తీవ్రప్రయత్నాలు ప్రారంభించేడు. క్రూరమృగాలనుండి ఆత్మరక్షణం చేసికొంటూ ప్రకృతిలో సులభంగా లభించే వస్తువుల నుపయోగించుకొంటూ శక్తిని వశం చేసికోడానికి చేసిన ప్రయత్నాలలో కొన్ని సఫలమయేసరికి కొన్ని వేల యేండ్లు గడిచిపోయేయి.

మానవసంఘం దేశదేశాలలో వివిధ సమాజాలుగా వృద్ధిపొందుతూండగా, సామాజికులలో కొందరి అధికార తృష్ణ క్రౌర్యంగా రూపొంది యుద్ధాలకు దారితీసింది. బాహుబలం కొంతకాలంపాటు విజయంపొందింది. రానురాను బుద్ధిబలం సునిశితమై బాహుబలాన్ని అతిక్రమింపజొచ్చింది. మారణాస్త్రాలతో సాయుధభటులను నిర్మూలించగల శక్తి ఏదేశంలో పెంపొందితే అది తుది విజయాన్ని సాధించడం సులభమౌతూ వచ్చింది. అందుచేతను, సుఖాన్ని ఇనుమడింప చేసికోవాలన్న కాంక్షచేతను, శక్తి వశీకరణానికై మానవు డన్వేషణ ప్రారంభించేడు.

మరికొందరు కేవలం ప్రకృతి రహస్యాలను తెలిసికోవాలనీ, ప్రకృతి యొక్క క్రమాన్ని అర్థం చేసికోవాలనీ ప్రయత్నిస్తూ హేతువాదాన్ని ప్రాతిపదికగా వినియోగించేరు. ఏ సంఘటనలోనైనా కార్యకారణ సంబంధాన్ని నిరూపించడానికి చేసిన అవిచ్ఛిన్న కృషియే "విజ్ఞానం" (Science)గా పరిణమించింది. పట్టు తప్పిన వస్తువు క్రిందనెందుకు పడుతుంది అను స్వల్పవిషయం మహత్తరమైన సత్యాలకు దారితీసి, సార్వత్రికమైన గురుత్వాకర్షణ నియమ ప్రతిపాదనకాధారమైంది. గ్రహ సూర్య నక్షత్రాదు లాకాశంలో నియమబద్ధంగా చరిస్తున్నాయని విశదమైంది. ప్రకృతిలో చక్కటి క్రమం కలదన్న విశ్వాసమే విజ్ఞానానికి మూలకందమై అనేక ప్రకృతి సూత్రాల ఆవిష్కరణానికి అవ

కాశమిచ్చింది. ఏవస్తువైనా అది కనిపించినట్లే ఉండా, లేక, దానిని ముక్కలు ముక్కలు చేసినకొద్దీ భిన్నపదార్థాలు లభిస్తాయా అన్న అనుమానం 2500 ఏండ్ల క్రిందట మొదటిసారిగా తలయెత్తి ఎట్టకేలకు పరమాణుశక్తి వరకు మానవుని తీసికొని పోయింది

విజ్ఞానం వెలువరించిన సత్యాలు మానవ సంఘాన్నే సంస్కరించగల శక్తిమంతమైనవంటే ఆశ్చర్యం లేదు. నిప్పు చెయ్యడం ఒకప్పుడెంతో కష్టమైనపని. కాని, అగ్గిపెట్టె తయారైనప్పటినుండి క్షణకాలంలో మంటపెట్టడం అందరికి సులభమైంది. ఆవిరిశక్తిని గమనించి, కొంతనీరు ఆవిరైనప్పుడు పరిమాణంలో 1650 రెట్లు పెరుగుతుందని తెలిసికొన్న తరువాత దానిని వినియోగించు ఆవిరి ఇంజన్లు వాడుకలోనికి వచ్చాయి. ఈ ఆవిరి శక్తివలన నవీనమైన రవాణా సౌకర్యాలు సాధ్యమయేయి. దానిమూలంగా ప్రతీదేశంలో ఎగుమతులు దిగుమతులు పెరిగి, వివిధ దేశాలమధ్య సాన్నిహిత్యం పెంపొందింది. పారిశ్రామిక విప్లవానికి కూడా ఇది ఆధారమైంది అదేవిధంగా విద్యుచ్ఛక్తిని కనిపెట్టిన తరువాత జెనరేటర్లు తయారు కావడం, వందలకొద్దీ మైళ్ళ దూరం విద్యుత్తును సరఫరా చేయడం సులభసాధ్యమై సాంఘిక పరిణామానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. జీవన విధానాన్నే విద్యుత్తు మార్చ కలిగిందంటే అతిశయం కాదు. ఆ ప్రకారంగానే భూగర్భంనుండి లభ్యమౌతూన్న పెట్రోలువంటి పదార్థాలు విమానయానాన్ని సులభం చేసి దూరాన్నే ఉన్మూలించిందంటే ప్రకృతిలో లభించుశక్తులు మానవాధీనమైనప్పుడు జాతి నేవిధంగా సంస్కరించగలవో కొంతవరకు అర్థమౌతుంది

ఈ శతాబ్దాలో రెండు ప్రపంచ సంగ్రామాలు వచ్చి యుండకపోతే పరమాణుశక్తి ఇంత త్వరగా వాడుకలోనికి వచ్చేది కాదన్నది వాస్తవం. ఏమంటే, ఏవైజ్ఞానిక సత్యమైనా ఆవిష్కరింపబడిన చాలకాలానికిగాని వినియోగంలోనికి రాజాలదు. సూత్రరూపంలో నున్న భావానికీ దాని వినియోగానికీ మధ్య ఎంతో కాలాంతరముంటుంది అందులో ముఖ్యంగా పరమాణుశక్తి విషయం యోచించినట్లైతే దానికవసరమైన అపారధనాన్ని సామాన్యమైన పరిస్థితులలో ఏ ప్రభుత్వమూ వెచ్చించడాని కంగీకరించలేకపోయేది. పరమాణుశక్తిని నిర్మాణాత్మకంగా వినియోగించగల అవకాశం, మొదటిలో, కనిపించలేదు ఒక్క విధ్వంసానికేకాని పనికిరానిశక్తిని కోట్లకొలదిరూపాయలు వెచ్చించి విడిపించడం అర్థంలేని పని. అయినప్పటికీ, యుద్ధాన్ని త్వరగా ముగించడానికై రెండు మహాపట్టణాలను బలిచేయడమే మంచిదనిపించింది ఇప్పటికి కూడా పరమాణుశక్తి పూర్తిగా అదుపులోనికి వచ్చిందని చెప్పలేము. కానిఎప్పటికైనా ఆ మహాశక్తిని మానవాభ్యుదయానికేవినియోగించగలమన్న విశ్వాసం విజ్ఞానులకుంది. అంతేకాక, నేటి పరిస్థితులలో యుద్ధాన్ని అరికట్టగల సామర్థ్యం పరమాణుశక్తికున్నదా అను భావం కలుగకపోదు. ఏమంటే, ప్రపంచమందు అనేక రంగాలలో చిన్న

చిన్న యుద్ధాలు వరుసగా పొడ సూపుతున్నప్పటికీ నిజమైన యుద్ధమేవస్తే సర్వనాశనం తప్పదన్న భయంచేత ఎంత కోపోద్రిక్తులైనప్పటికీ జనులు యుద్ధాన్ని ప్రారంభించడానికి భయపడి ముందంజ వేయలేక పోతున్నారు. మానవదృక్పథంలోనే వాంఛనీయమైన మార్పులను పరమాణుశక్తి తెచ్చిందా అనిపిస్తూంది సూత్రప్రాయంగా నున్న సహజీవన భావాన్ని క్రియారూపంలో అమలుపరచవలసిన పరిస్థితి ఏర్పడింది. మేనేజరు కొరడాకు భయపడి సర్కసులో పులి, మేక ఒక పాత్రలో నీరు త్రాగునట్లు, ఏనుగుమీద సింహం కూర్చున్నట్లు, ఎట్టి సహజవైషమ్యాలున్న దేశాలైనప్పటికీ, వాటిలో కొన్ని ఎంత శక్తిమంతములై యున్నప్పటికీ, విధిలేక సహజీవనం చేయక తప్పదని గ్రహించేయి.

మానవ స్వభావంలో ఊహాతీతమైన ఇంతమార్పు తేకలిగినది పరమాణు గర్భంలో నిబిడీకృతమై యున్న శక్తి. పరమాణువు కంటికి కనిపించదు. 25 కోట్ల పరమాణువులను వరుసగా పేర్చినప్పుడు ఒక అంగుళం పొడవుని ఆక్రమిస్తాయి అంత సూక్ష్మతరమైన పరమాణువు గట్టి ముక్కకాదు. దానికి అద్భుతమైన రచనా, నిర్మాణమూ ఉన్నాయి తటస్థంగా నున్న పరమాణువులో రెండు రకాల విద్యుత్కణాలున్నాయి కాని వాటిమొత్తపు విద్యుదావేశం సున్న. ఆ రెండురకాల విద్యుత్కణాలను "ఎలక్ట్రాను" "ప్రోటాను" అంటారు. ఋణావేశం గల కణం ఎలక్ట్రాను; ధనావేశం గలది ప్రోటాను. ఆవేశంలో అవి సమానమైనప్పటికి బరువులో వాటికి చాలావ్యత్యాసముంది. ఎలక్ట్రానుకంటె ప్రోటాను రమారమి 1850 రెట్లు బరువుంటుంది. ప్రతి పరమాణువులోను వీటి సంఖ్య సమానమవడంచేత విద్యుదావేశంలేని తటస్థంగా పరమాణువు ప్రవర్తిస్తుంది

అంత చిన్న పరమాణువూ నిర్మాణంలో సూర్యమండలాన్ని పోలి ఉంటుంది సూర్యకుటుంబంలో మధ్యను సూర్యుడున్నట్లు పరమాణువులో మధ్యను "కేంద్రకం" ఉంది పరమాణువుయొక్క బరువంతా కేంద్రకంలోనే ఉన్నట్లు భావించవచ్చు అందులో ప్రోటానులతో చేరి ఆవేశమేలేని న్యూట్రాను అను కణాలుకూడా ఉన్నాయి అందుచేత కేంద్రకానికి ధనావేశముంది దానిచుట్టు ఎలక్ట్రానులు, గ్రహాలవలె, నిరంతరం తిరుగుతుంటాయి ప్రతి పరమాణువులో కేంద్రకమందు ఎన్ని ప్రోటానులుంటే అన్నే ఎలక్ట్రానులు దానిచుట్టు కక్ష్యలలో భ్రమిస్తుంటాయి. కేంద్రకావేశాన్ని బట్టి పరమాణువుయొక్క గుణాలు నిర్ణయమౌతాయి. పరమాణువులో తిరుగుతూన్న ఎలక్ట్రానులను ఊడగొట్టుట సులభం. కాని కేంద్రకాన్ని ముక్కలు చెయ్యడం చాల కష్టమైన పని. కేంద్రకంలోనున్న కణాలను బంధించే అపారమైన బలముంది. దానిని ఎదుర్కొని కేంద్రకాన్ని విచ్ఛిన్నం చేయడానికి అంతకంటె అపారమైన శక్తిని వినియోగించాలి ఆవిధంగా కేంద్రకాన్ని విచ్ఛిన్నంచేయ కలిగినప్పుడుసామాన్య ప్రక్రియలలో విడువడనంత గొప్ప శక్తి విడి

వడుతుంది. బరువైన యురేనియం పరమాణు కేంద్రకాన్ని విచ్ఛిన్నం చేసినప్పుడు "పరమాణుశక్తి" లేక "కేంద్రక శక్తి" ఆవిర్భవిస్తుంది. ఆ ప్రక్రియను "ఫిషన్" అంటారు పరమాణుబాంబులో లభించే శక్తి ఫిషన్ మూలంగా విడివడుతూంది దాన్ని అదుపులో పెట్టడం మిక్కిలి కష్టం. అంతేకాక జీవానికి ప్రమాదకరమైన కిరణాలు ఫిషన్‌లో జనిస్తాయి. అది ప్రశస్తమైన మార్గం కాదని విజ్ఞానులు గ్రహించేరు.

తేలికైన రెండు కేంద్రాకాలను ఐక్యం చేసినప్పుడు కూడా అమితమైన శక్తి విడివడుతుందని కనుగొన్నారు. ఆ ప్రక్రియను "ఫ్యూషన్" అంటారు. ఫ్యూషన్‌లో విడివడు శక్తి అంత ప్రమాదకరమైనది కాదు, దానిని సులభంగా అదుపులోనికి తెచ్చుకోగలము. ఉదజని బాంబులో అట్టి శక్తి లభిస్తుంది. దానిని సృజనాత్మకంగా వినియోగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి

ఫ్యూషన్ ప్రక్రియలో పాల్గొనే పరమాణువులు ఉదజనివి. అందులో మూడు రకాలున్నాయి. ఒకే ధనావేశం కలిగి వివిధ భారాలుకల పరమాణువు లవి అవన్నీ ఒకేవిధంగా ప్రవర్తిస్తాయి. ఉదజని పరమాణువులలో ఒకే ప్రోటాను, ఒక ప్రోటానుతో చేరి ఒక న్యూట్రాను, ఒక ప్రోటానుతో చేరి రెండు న్యూట్రానులు గల కేంద్రకాలున్నాయి. వాటిని క్రమంగా ఉదజని, డ్యూటీరియం, ట్రైషియం అంటారు. రెండు డ్యూటీరియం కేంద్రకాలు ఫ్యూషన్ చెందినప్పుడు హీలియంగాని ట్రైషియంగాని ఏర్పడవచ్చును. అప్పుడొక న్యూట్రానుకాని ప్రోటానుకాని విడివడి కొంతశక్తిగామారి కిరణరూపంలో బహిర్గమిస్తుంది. ఈ సత్యాన్ని సాంకేతికంగా నిరూపించవచ్చును ఉదజని, డ్యూటీరియం, ట్రైషియంలను క్రమంగా H, D, T లను వాడి, కేంద్రకభారాన్ని ఆ అక్షరానికి కుడిప్రక్కను కేంద్రకావేశాన్ని ఎడమప్రక్కను వ్రాయగా ఏర్పడు సంకేతాలు:

ఉదజని $_1H^1$
డ్యూటీరియం . $_1D^2$ లేక $_1H^2$
ట్రైషియం $_1T^3$ లేక $_1H^3$
అదేవిధంగా హీలియం కేంద్రకం
$_2He^3$ అవుతుంది.

కేంద్రకాలు సమ్మేళనం చెందడానికవసరమైన తాపక్రమం సిద్ధమైనప్పుడు క్రింది ప్రక్రియల రెండింటిలో ఏదైనా వాటిల్లవచ్చును .

$$_1D^2 + {}_1D^2 \rightarrow {}_2He^3 + \text{న్యూట్రాను} + \text{శక్తి} \quad \ldots (1)$$

$$_1D^2 + {}_1D^2 \rightarrow {}_1T^3 + \text{ప్రోటాను} + \text{శక్తి} \quad \ldots (2)$$

రెండవ ప్రక్రియలో ఏర్పడిన ట్రైటానుతో డ్యూటిరాను ఢీకొన్నప్పుడు

$$_1D^2 + {}_1T^3 \rightarrow {}_2He^4 + \text{న్యూట్రాను} + \text{శక్తి} \quad (3)$$

గా పరిణమిస్తుంది మూడవప్రక్రియలో విడివడు శక్తి మొదటి ప్రక్రియలో లభించే దానికి సుమారు 5 రెట్లుంటుంది.

ఈ ప్రక్రియలను ఎట్లు అదుపులో పెట్టుకొని శక్తిని సద్వినియోగం చేసికోగలమన్నదే ప్రశ్న, 1957 ఆగస్టు 30వ తేదీరాత్రి హార్వెల్ పరిశోధనా గారంలో ఆంగ్ల విజ్ఞానులీ ప్రక్రియను సాధించేరు 'జీటా' అను యంత్రంలో అది సాధ్యమైంది.

సేవ - సహకారము

శ్రీ కల్లూరి చంద్రమౌళి

(సేవాధర్మః పరమగహనో యోగినా
మప్యగమ్యః)

సేవాధర్మము గహనము (నిగూఢము). యోగులంతటి వారికిని అగమ్యము

సాధారణముగ సేవాపదము పరులకుపకరించుటను స్ఫురింపజేయును సేవకుడు, సేవిక యను పదములలోని సేవాపదము దాస్యభావమును వెల్లడించుటయు లోకమునజూడనగును. కాని వాస్తవమున తన వ్యక్తిత్వమును, తన స్వార్థమును, అహంకారమును బోనాడి పరార్థమును సాధించుచు పారమార్థికతకు దోడ్పడునది సేవ. ఆధ్యాత్మిక ప్రపంచమున సేవాపదమున కెంత ప్రాముఖ్యమువ్నను భౌతికార్థమున నది ప్రయోగింపబడక పోలేదు. భౌతికముగను నాధ్యాత్మికముగను జరుగు నీసేవ భగవదర్పణ చేయబడి భగవత్సాక్షాత్కారమునకు కారణ మగుచున్నది. సర్వమున సమదృష్టినుంచి కృషి యొనర్చు వ్యక్తుల సర్వభూతానుకంపయే ప్రతి సేవాకార్యమునకును పునాది.

"విద్యావినయ సంపన్నే బ్రాహ్మణేగవి
హస్తిని
శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః"

అను గీతాప్రబోధములు వైవిధ్యమునగల సమదృష్టి కాలంబనములు.

"యస్తుసర్వాణి భూతా న్యాత్మన్యే వాను
పశ్యతి
సర్వభూతేషుచాత్మానంతతో నవిజుగుప్సతి"

అని సర్వప్రాణుల నాత్మయందు గాచువానికిసర్వభూతానుకంప గలుగక జుగుప్సాభావమేల కలుగును. అందువలననే కేవల విజ్ఞానముకంటె హృదయ వికాసము - కరుణార్ద్రహృదయము మిన్నయందురు ప్రాజ్ఞులు. హృదయమునుండియే విజ్ఞానమంతయు ప్రకట మగునని వైదికుల నిర్ణయము.

"భిద్యతే హృదయ గ్రంధిః
భిద్యంతే సర్వసంశయాః"

అను ఉపనిషద్ వచనములే యిందులకు మూలము. చిత్త ప్రసాదానంతరమున హృదయము వికసించును. హృదయ వికాసమునకు సర్వభూతదయ లక్షణము. సర్వభూత హితమున రతులగువారే 'సర్వంఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తికించన' యను జ్ఞానమున కర్హులగుదురు వారికే యీ దివ్యదృష్టి గలుగును అట్టి వారే సేవా ధర్మమును సరిగ ననుష్ఠింపగలుగుదురు అట్టి వారి చిత్తప్రసాద జనిత సేవాజ్యోత్స్నయే తన చల్లని కాంతులను విశ్వమున నెల్ల యెడల వెదజల్లి విశ్వశాంతిని వ్యాప్త మొనర్చును,

కపోతమును రక్షించుటకై మేనికండలను కోసి యిచ్చుటకును, చివరకు తననే యర్పించుటకును శిబిచక్రవర్తిని ప్రేరేపించినదీ సేవా దర్మమేకదా! అంగవైకల్యముచే గమనబాధ ననుభవించు మేకపిల్లను తనచంక నిడికొని, దాని జీవితమును గాపాడ బుద్ధుని ప్రోత్సహించినదీ దివ్యమగు భూతహితరతియే కదా! ఆధ్యాత్మిక రంగమున సేవాధర్మ మిట్లెన్నో విధముల రూపొందియుండుట జూడనగును. ఇక సాధారణ భౌతిక జీవనమును గడుపు వ్యక్తులలోను స్వార్థమును విడనాడి పరార్థమును సాధించటకు సేవాభావము నాచరణలో పెట్టిన ధీరులెందరో యున్నారు భూతానుకంప, ప్రాణిసేవ - చేప్రేరితులయి మాంసాహారమును వర్జించిన వ్యక్తులు భారతమున నెందరు లేరు!

సామాన్య మానవసేవ నొనర్చువారుకూడ తెలిసికాని, తెలియకగాని యాధ్యాత్మికోన్నతిని బొందుచునే యుందురు. 'మానవసేవయే మాధవసేవ' యను సూక్తికి మూలము మానవునియందు మాధవుని గాంచుటయే ఆదివ్య దృష్టి లేనివారొనర్చు భ్రాతృభావ ప్రచారము, ప్రదర్శించు సామ్యభావము మున్నగునవన్నియు నిరర్థకములే యగును వారుచేయు ప్రబోధములు వాగ్విలాసములే యగును. భగవంతు దే

రూపమున నెప్పుడెట్లు సాక్షాత్కరించునో యెరుగము కావున నిరుపేదలనేమి, దీన జనుల నేమి యెవరినైనను భగవంతునిగ భావించి భజించుడనిబోధించు వేదాంతవిదులభావమేమి? భిన్న భిన్న రూపములలో నడయాడు ప్రాణి జాతమంతయు భగవన్మయమని చెప్పుటకాదా! నిరుపేదలని నిరసింపక వారు దరిద్రనారాయణులని వివేకానందుడును, హరిజనులని గాంధి మహాత్ముడును నిర్వచించుటలోగల తాత్పర్య మేమి? వారియందా మహాత్ములకుగల భగవద్ భావనకాదా!

'జీవుడే శివుడు' అను లోకోక్తి యీ సత్యమునే స్పష్టపఱచును గదా!

కొందరీ సర్వాత్మ భావనను గుర్తింపక తాము పరప్రాణుల యెడ దయతో వర్తించు చున్నట్లెంచుచున్నారు దయయు నొక మానసిక కర్మయగును. కాని సర్వాత్మ భావనతో జేయు సేవ యుత్తమ సత్ కర్మ. దయలో నంతటి యోగ్యతలేదు.

"కేవల కర్మలు ధర్మసాధకములు గావు. సత్కర్మలే స్వారాజ్య ప్రాప్తికి బాటలు. దయదలంచు చున్నామనుకొనుట యజ్ఞానము ఎవరి యెడ దయను దలంచుచున్నావు? భగవంతుని యెడ దయదలపగలవా? లోకమున భగవంతుడు కానిదేది? నీవు నైతికకర్మల నొనర్చి యభివృద్ధి నొందుట కీ విశ్వమును భగవంతుడు సృష్టించినాడు అందుల కాయనకు ప్రణతుడవై సేవింపుము అంతియేకాని, ప్రాణులకు దయతో సహాయ మొనర్తునని యెంచకుము" వివేకానందస్వామి.

"దయతో దీనుల కుపకార మొనర్చుట" యుత్తమము కాని, సర్వప్రాణులకు భగవదారాధన భావముతో సేవ యొనర్చుట యుత్తమోత్తమము దాతలో నమ్రభావము ఉట్టిపడునుగాక! "శ్రద్ధ యాదేయమ్" గ్రహీతకు తలవంచ వలసిన స్థితి యేర్పడకుండుగాక! దానమొనర్చు నపుడు ప్రతిప్రాణి యందును భగవంతుని గాంచుము" వివేకానందుడు.

దీనులసేవ భగవదారాధన. అయిన నా దీనులు సదా దీనావస్థలోనే యుండి తనయారాధనకు తోడ్పడవలయునని భావింపరాదు. అది సద్భావన కాదు. దీనులకు సేవజేయు నవకాశము లభించుట భాగ్యము లోకమున దీనులే లేనపుడు పరులకు సేవజేసి ధన్యతనందు నవకాశ మొకనికి లభింపనేరదు. ప్రాణిసేవ హృదయ పవిత్రతకు దోడ్పడును. అంతకంటె పవిత్ర హృదయముననే సేవాభావ ముద్భవించుననుట యుక్తమేమో సేవావృత హృదయము శీతలచ్ఛాయలనీను రాకా సుధాకరునివలె పరుల కాహ్లాదము నొసంగును ఆ పావన సేవాభావము నేటి ప్రపంచమున నంతగా కనబడకుండుట మన దుర్భాగ్యము.

భారత సేవాసమాజమున (29-11-57) నుపన్యసించుచు శ్రీ పం. జవాహర్‌లాల్‌జీ యేమనిరో చూడుడు

"సేవాపదమునకు మారుగ సహకార పదమును ప్రయోగింప వాంఛింతును కారణ మేమన సేవాపదము నిమ్నోన్నత భావములను ప్రేరేపించును సహకారమనగా సమప్రయోజనమునకై సమాన స్థాయిలో నెల్లరు పాల్గొనుట యగును."

మానవ సంఘమునందు నిమ్నోన్నత భావములకు తావు లేకుండుట వాంఛనీయమే

"అజ్యేష్ఠాసః అకనిష్ఠాసః ఏతేసంభ్రాతరో బభూవుః"

అను ఋగ్భావము నిదియే. హెచ్చుతగ్గులు లేని సమమైన భ్రాతృభావము మానవ సౌభాగ్యాభివృద్ధి కొఱకగును. కాని, సేవాపదము నీచోచ్చభావములను ప్రేరేపించుననుట తథ్యమునకు దూరము. మానవుల నుద్దేంచి ప్రయోగింపబడు సేవాపదము మానవులలోని దైన్యమును, బాధలను, ఆర్తినితొలగించుటను బోధించును. పరుల దైన్యమును, పరుల బాధలను బోనాడుటకై చేయు సేవ హృదయ పావిత్రనమునకుకారణమై, చిత్తప్రసాదమున కుపకరించి, యలౌకిక సుఖమును ప్రసాదించును,కావుననే మానవసేవ మాధవసేవ యనబడును. సేవాభావము తనలో నమ్రత నావహింపజేయును. నైచ్యమును గలిగింపదు. సేవకు సమకట్టిన వ్యక్తి నమ్రుడగును. తనను పరుల కర్పించు

కొనును. దీని నాత్మార్పణ యందురు. పరుల నుద్ధరింప తన తనువును, మనస్సును ధనమును సర్వస్వము నర్పించును. అందువలననే సేవాధర్మము గహనమని భర్తృహరి నుడివియున్నాడు సేవకసేవ్యులలో నీచోచ్చభావమున కిసుమంతయు తావులేదు నేటి ప్రసిద్ధ ప్రజానాయకు లెల్లరు ప్రజాసేవకులు గారా! ఇట్లు సేవాపదము ప్రజలకును ప్రజానాయకులకును మధ్య నిమ్నోన్నత భావములను ప్రేరేపింపదుగదా! పైపెచ్చు ప్రజలకు సేవకులకు మధ్య పరస్పరాను రాగమును పెంపుచేయును అందువలన సేవాపద మవాంఛనీయమనుట యా పదమునకుగల వాస్తవికార్థమును గుర్తింపకుండుట యనవలసి వచ్చును.

కాని, నేటి సేవక (Servant) సేవ్య (Manager) పదప్రయోగము,నిమ్నోన్నత భావమును నుద్బవింపజేయుటయు గలదు. కావుననే యొకరు 'సేవాశ్వవృత్తి రాఖ్యాతా' అనియున్నారు నేటి యీ యార్థిక యుగమున ప్రయోగింపబడు 'సేవకుడు, యజమానుడు' అను పదములను విననపుడు సేవకుడు నీచుడనియు, యజమాని యుచ్చశ్రేణికి చెందినవాడనియు బోధపడుట సామాన్యము. అట్టి భావముచే ప్రేరితుడై మనపండితుడు సేవాపద మవాంఛనీయమని యన్నచో నయ్యది బాధాకరము గాదు.

ఇక్లే ధనికులకు, శ్రామికులకు సంబంధించిన విషయములలో సహకార పదము ప్రయోగింపబడుచున్నది కొందరు కలసి యొకపని చేయుట నౌకరి కొకరు తోడ్పడుటయే సహకార మనబడును. ఒక సమూహములో నున్న 'ఒక వ్యక్తి తక్కిన యందరికొఱకు అందరు వారిలోని ప్రతివ్యక్తి కొఱకు, ననియే కదా సహకార పదమునకు గల యర్థము! శ్రామికులు కొందఱు కలసి కట్టుగట్టి తమ జీతములను బెంపు చేయుడని యజమానులను కోరుదురు ధనమును సంపాదించుటలోను, అప్పులిచ్చుటలోను, వస్తువుల క్రయవిక్రయము లందును ధనికులు కలసి యొక్కటిగా నుండ యత్నింతురు వస్తువులను వినియోగించు ఉపభోక్తలు కలసి యొక్కటిగా నుండి తమకు వ్యాపారులకు మధ్య దళారులను లేకుండ జేయయత్నింతురు. ఇట్టి తావులందు సహకార పదము ప్రయోగించుట నేటి యాచారము ఇట ధనమునకు, రాజనీతికి ప్రాముఖ్యత యుండును. ముఖ్యముగా నర్థమునకు విశేషప్రసక్తి యుండుననక తప్పదు కాని వాస్తవమున సహకారమనునది యొక యర్థప్రాప్తి యందే కాక యితర నైతిక విషయము లందును జూడనగును అనేక విషయములందు ఐచ్ఛికముగాను. దయాపూర్వకముగాను పరస్పరము సహకార మొనరించుకొనుట జూచుచున్నాము. సహకారము వలన స్వపరలాభములు రెండును సిద్ధించును సేవయందు స్వలాభము (భౌతికము) మృగ్యము. స్వార్థమును త్యజించి పరులకు భౌతికలాభమును చేకూర్చుటయే సేవాధర్మమని పూర్వమే నుడివియున్నానుగదా!

సహకారమున నొక యెడ - అర్థవిషయక సహకారమునందు-నీతికి, చిత్తవికాసమునకు స్థానము లేకపోవచ్చు. కాని సేవ కేవలము నైతికము 'చిత్త ప్రసాదజనితము కావున సేవ,సహకారము' నను నీ రెండు పదములు సమానార్థకములుగావు. అందువలననే సేవకు బదులుసహకారపద ప్రయోగము వాంఛనీయమనుటలో నౌచిత్యము కానరాదు,

సహకారములో తరతమ భేదములకు తావుగలదు అందువలన దానికి విలువలు గట్టనగును విలువలలోని భేదమును బట్టి సహకారమునందు నిమ్నోన్నత శ్రేణులేర్పడవచ్చును. కాని సేవలో తారతమ్య ముండదు. సేవ మూల్యము నపేక్షింపదు. అదియ మూల్యము. మూల్యములేని తావున నిమ్నోన్నత భేదముల కాశ్రయముండదు. సర్వత్ర సమమును గాంచు వాడే సేవ కుద్యుక్తుడగును అందువలననే యతడు పరులను జుగుప్సతో జూడనేరడు ఇంద్రియ గోచరములయిన విషయములకే మూల్యముండును. అతీంద్రియ విషయములకు మూల్య ముండజాలదు - సేవ యతీంద్రియము. అందువలన తారతమ్యమున కట స్థానమే యుండదు.

సేవాభావముతో ప్రేరితుడైన వ్యక్తి తన యౌన్నత్యమును మనసున నిడికొని నిరుపేదకు దాన మొసంగడు. తన కష్టార్జిత ధనములో నొకింత పరునకిచ్చు నవకాశము కల్పించిన, నిర్ధనుడు తనకెంతో యుపకృతి నొనర్చినట్లెంచి యతనియెడ కృతజ్ఞతను వెల్లడించును. గ్రహీతకు ఒకింత భౌతిక లాభము చేకూరును. దైహికముగానో యార్థికముగానో యతనికి గలిగిన కష్టము దూరమగును దాతకు చిత్తశాంతి చేకూరును హృదయము పవిత్రమగును. అందువలన నితరులకు జేయు సేవ తన కాధ్యాత్మిక లాభము చేకూర్చును. కావున దాతృభావము సదా నీలో నుండునట్లు చూచుకొనుము. కాని దానమునకు - సేవకు - ప్రతిఫలము నపేక్షింపకు ధనముతో, తనువుతో, వాణితో నీకుగల సర్వస్వముతో నితరులకు సేవ జేయుము. ప్రతిఫలాపేక్షను విడనాడుము. సర్వము నాత్మగా నెంచి సేవించు నీకు ప్రతిఫలాపేక్షయేల ? విశ్వమునగల ధన మెవరిది? 'కస్యస్విద్ధనమ్ ?' పరమాత్మునిది కాదా? పరమాత్ముడు నీకిచ్చినట్లు నీ వితరుల కిమ్ము. ఇందు గర్వమునకుగానీ ఉన్నత భావమునకుగానీ తావేది? సర్వము భగవంతునిదేయని పరార్థమున వినియోగించుటయే సేవ. ఇట్టిసేవా భావము సద్భావ ప్రేరితము. ఇత్యాది యాత్మోన్నతిని గలిగించి దివ్యతేజస్సును సమకూర్చును. నిజమైన సేవ ఆర్థికముగాను, నైతికముగాను, సాంఘికముగాను మానవు డభివృద్ధి నొందుటకు దోహదమగును. భగవద్భక్తి పూరితమగు సేవ కసాధ్య మెందును లేదు. కావున సేవాపదము పరమార్థ దృష్టితో నెన్నడు నవాంఛనీయముకాదు. దాని స్థానమును సహకార పదము పూరింపజాలదనియే నా యభిమతము.

మానవసంఘ పరిణామములను చూచినపుడు అందు స్పర్ధ, సహకారము, ఆత్మసమర్పణము నను మూడుభావములు గాంచనగును. అనాగరికులు తమ జీవితముల కొఱకు తమ యునికి కొఱకు స్పర్థాభావముచే ప్రేరితులై సమరములకు గురియైరి. చివరకు తమ యునికినిగూడ బోగొట్టుకొనిరి. 'బలశాలురే బ్రతుకనర్హులు' 'కావునజీవితము కొఱకై స్పర్థించు' అనునది పాశ్చాత్యుల యాదర్శము. అది భౌతికవాద జనితము మానవులలో నది పశుబలమును ప్రదర్శింపజేయును (ప్రోత్సహించును). అది సమరములను పెంపుజేయును సహకారమున కందు తావులేదు. నాగరికత వృద్ధియైన కొలది స్పర్థాభావ మణగిపోయిజనులలోసహకారభావ ముదయించును. ఇట్టి సహకార భావముతో నేటి జాతులు దేశములు నున్నతిని బొంద జూచుట ముదావహమే.

కాని మానవులు పూర్ణవికాసము నొంది జగత్ కల్యాణమును, విశ్వశాంతిని జేయగోరుదురేని సేవ యుత్తమ సాధన మగును బుద్ధిపూర్వకముగ. స్వార్థమును విడిచి ఫలాపేక్షయు లేక చేయుసేవ భగవదారాధన యని యెల్లరు నేకస్వరముతో నందురు. ఆర్థిక, రాజకీయ, సాంఘికరంగము లందును సహకారభావముకంటె సేవాభావమున్నత స్థానము నలంకరించుననుట తథ్యము.

స్పర్ధ స్థూల దృష్టిని, సహకారము సూక్ష్మ దృష్టిని, సేవ దివ్యదృష్టిని బ్రదర్శించును. స్పర్ధ పాశవికతను, సహకారము మానవతను సేవ దివ్యత్వమును బోషించును. స్పర్ధ సహకారము, సేవాభావము - మూడును క్రమముగా స్వార్థమును, స్నేహభావమును, త్యాగమును బ్రదర్శించును. స్పర్థ వ్యక్తిత్వమును బోషించును సహకారము సంఘీభావమును ప్రబలించును. సేవ యాత్మసమర్పణ మూలకముగా సర్వశ్రేయోదాయక మగుచున్నది స్పర్థదైహికము. సహకారము మనోగతము. సేవ హృద్గతమునని భేదములను గుర్తింపవలెను.

ప్రస్తుతము జీవిత సమస్యలన్నియు ప్రణాళికా బద్ధములుచేసి పరిష్కరింప ప్రభుత్వములు యత్నించుచున్నవి. వ్యక్తులను సంస్థల కంగములుగ జేసి జీవితావసరములను దీర్చుకొనుటకు శ్రమింపజేయు నుద్యమములను ప్రారంభించుచున్నవి. సాంఘికసేవ యనుటకుబదులు సాంఘిక శ్రమయని ప్రజలు నినాదములు చేయుచున్నారు. నేటి శ్రమ యంత్రాధీనము. సేవ చైతన్యముతో కూడినది. సేవాభావము

విశాలతను కలిగి యుండును. మానవులనేకాక సర్వప్రాణులను తన క్షేత్రమునం దిముడ్చు కొనును ఇహ పరములకది సాధనము. ఆడంబరశూన్యము నటన కందు తావులేదు అంతఃశుద్ధితో నాత్మవికాసము కొఱకు సర్వము నర్పింప జేయు పరమార్థభావమది పిపీలికాది బ్రహ్మ పర్యంతముగల ప్రాణికోటిని హృదయపూర్వకముగ ప్రేమించి యొనర్చు సేవకు మించిన దేమున్నది? సేవాధర్మ మనుష్ఠేయమని నుడువు ప్రమాణములు మతగ్రంథములం దెన్నియో లభించును

సేవ దివ్యభావానుబద్ధము. మానవసేవ వ్యక్తిలో దైవత్వము నాపాదించును. సేవాభావ ముమనలో నుద్భవించుట దైవానుగ్రహమన నొప్పును కేవల మానవసేవమే కాక సర్వభూతహిత బుద్ధి నొనర్చు ప్రాణిసేవ పరమ సేవయై పరమాత్మ సాక్షాత్కారమునకు తోడ్పడును. ప్రతిప్రాణియు భగవంతుని సంతానమే ఆసంతానసేవ భగవత్సేవయే యగును. సేవాతత్పరులం దాధ్యాత్మికత పెంపొందును. క్రమముగా ముక్తిని కరతలామలక మొనర్చును. ఇట్టి సేవాభావము విశ్వమున వ్యాప్తి నొందుట శుభంకరము.

మానవుని భౌతిక దృష్టితో సేవించువారిలో నాధ్యాత్మికత వికసింపదు లాంఛనములను చెల్లించుటకు విగ్రహములను పూలలతో నలంకరించి హారతుల నొసంగుటయు భగవత్సేవ యనరాదు. శ్రద్ధాభక్తులతో నొనర్చు దేవారాధనమే నిజమైన భగవత్సేవ మానవులలో దేవుడున్నాడు అతనిని లక్ష్యములో నుంచుకొని సేయు మానవసేవ యాధ్యాత్మిక వికాసమునకు తోడ్పడును సర్వాంతర్గత భగవత్ సాక్షాత్కారమును లక్ష్యములో నుంచుకొని సేయు మానవసేవ-ప్రాణిసేవ-లక్ష్యసిద్ధి నొనర్చును. ఇట్టి సేవాతత్పరతకు భక్తులు సాక్షాత్తుగ జేయు భగవత్సేవకు ఫలభేద ముండదు. ఆ ఫలము భగవద్దర్శనమే. అటులయినా మానవసేవా తత్పరులు దేవాలయ నిర్మాతలు కారాదని కాని, అర్చనాదుల నొనర్పరాదనికాని యనుట తగదు అట్లే భక్తులు మానవసేవ జేయదగరని యనుటయు నుచితము కాదు. మానవసేవ, దైవారాధన రెండును పరస్పరము విరుద్ధకర్మలు కావు. ఇవి యొండొంటికి సహకార మొనర్చుచు పరమార్థ సాధకములు కాగలవు.

భక్తిపూరిత కర్మల నాచరించుచో, వికాసపూరితయారాధనాభి వృద్ధి యనుభవనీయమగును. భక్తి జ్ఞాన, కర్మ,రాజయోగములన్నిటి పవిత్రాధ్యాత్మిక శిక్షణ ప్రయోజనము చిత్తశుద్ధిని జేగూర్చుటయేనని శ్రీ శంకరాచార్యుల నిర్వచనము. ఈ చిత్తశుద్ధినే భగవద్గీత సరళముగ ప్రబోధించుచున్నది చిత్తశుద్ధి చేకూరినదే తడవుగ హృదయ పావిత్ర్యము వికసించి పూర్ణ ప్రజ్ఞాప్రకాశము నందించి, భగవత్సాక్షాత్కారమును-ముక్తిని కరతలామలక మొనర్చును ఆధ్యాత్మిక సర్వసాధనముల గమ్యస్థానము నిదియే.

కావున సేవాపదమును త్యజించిదానిస్థానము సహకార పదమున కీయవలయుననుట యేవిధముగను వాంఛనీయము కానేరదు సహకార పదమునకుగల యర్థము సంకుచితము అది సేవాపదమునకుగల విశాలార్థము నెన్నడు నీయజాలదు సహకారమునికృష్టము-సేవ యుత్కృష్టము-పరమపదము నందగోరువారు సహకార భావమునుండి సేవాభావము నందుకొనుట యెంతయు శ్రేయస్కరము.

★

అల్లసాని వాని అల్లిక జిగిబిగి

కవి సమ్రాట్, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౧

ఒక గ్రంథము చదువునప్పుడు తద్గత కథోచితముగ పాఠకుఁ డూహించవలయును. అప్పుడా కథలోని సౌందర్యము భాసించును. ఏ కథయైనను లోకమునందలి సన్నివేశమును గుఱించియే యుండును. లోకాతీతములైన విషయము లెప్పుడో యుండును, కాని మహాకవుల కథలలో లోకగతమై, లోకోత్తరములైన విషయము లుండును. పూర్వదృష్టికి, నాధునిక దృష్టికి నిదియే భేదము. లోకగతములై సామాన్యములైన విషయములే యాధునికులకు రుచించును. వారు వానిని గురించి వ్రాయుదురు. పూర్వులు లోకగతములయ్యు, విశిష్ట లక్షణములు గలిగిన వ్యక్తులకు సంబంధించిన కథలనే నిరూపింతురు. ఏ జాతియందైనను మహాకావ్యములు తాదృశులైన వ్యక్తులను గుఱించియే యుండును. షేక్స్పియర్ వ్రాసిన 'హామ్లెట్' తీసికొందము. హామ్లెట్ వంటి వాఁడుండును. పదివేల మందిలో నట్టివాఁ డొకఁడు. పూర్వమహాకవులట్టి విషయములను దీసికొనెడివారు. అట్టివారి కథ చిత్రించుటవలన లోకమునకొక లక్ష్యము నిరూపింపఁబడు చున్నది. రెండవది యీ సృష్టిలోని తెగఁద్రెంచరాని యొక విలక్షణమైనదియు, మనుష్యబుద్ధి కతీతముగా నున్నట్లు కన్పించునదియు నైన సృష్టియొక్క రహస్యము చెప్పఁబడుచున్నది.

ఇట్టి పూర్వ మహాకవులలో సైతము భేదము కలదు. ఒకఁడు బహు విషయములను వాచ్యములు చేయును. ఆ వాచ్యము చేసి రచించిన కవియొక్క శిల్పము వేఱుచోట యుండును. మఱియొకఁడు వాచ్యము చేయక కథాగత విషయములు కూడ, పాత్ర పోషణాది విషయములుగూడ వ్యంగ్యములుగాఁ జెప్పును. ఈ రెండవ కవియొక్క కార్యము చదువుట కష్టమైన పని.

సంస్కృత నాటక సారస్వతములో వసంతసేన యున్నది ఈ మనుచరిత్రలో వరూథిని యున్నది వసంతసేన చారుదత్తగతైక మనస్క. నాటకమంతయు నా విషయమే యున్నది ఆమెయొక్క పరమ సద్గుణము లన్నియు వాచ్యములుగా నాటకముమీఁద పఱచఁబడినవి. అచట నట్లు చేసి తీరవలయును. ఎందుకనఁగా నాటకము రసప్రధానమైనది. రసోదయమునకుఁ బూర్వము నాయికానాయకుల పరస్పర నివిష్ట సంపూర్ణభావములు సువ్యక్తములైననే, రసమారంభించును. అందుచేత వసంతసేన సంపూర్ణముగా చారుదత్తుని గుణముల కమ్ముడువోయిన దని వాచ్యముచేసి తీఱవలయును.

వరూథిని విషయములో నట్లుకాదు. ఇది ప్రబంధము. ప్రబంధము వర్ణనాప్రధానమైనది. రసప్రధానమైనదికాదు. ఇచట కథాగత శిల్పము మిక్కిలి ప్రధానమైనది. వరూథినియందు వసంతసేనా గత లక్షణము లున్నచో నది యిచ్చట వ్యజ్యా

మానములుగాఁ జేయుట కవియొక్క శిల్పము.

పెక్కుమంది, వసంతసేన వారకాంత యగుటచేత నామె బహు పరపురుష సంగమ పరిజ్ఞానము కలదనియు, చెడిపె యనియు మొదలైన సామాన్య నాయికల లెక్కలో కట్టిచెప్పుటయు, వ్రాయుటయుఁగూడ జరిగినది.

ఒకానొక కవియొక్క రచన ఒకానొక విధముగాఁ జదువవలయును. పెద్దన్నగారి రచన యొక విధముగాఁ జదువవలయును. ఆవిధ మీవఱకే యైదు వ్యాసములయందుఁ జూపింపఁబడినది. ఈ వరూథినిని గూడ ఆ దృష్టితోఁ జూడవలయును. అనఁగా ఆ వరూథిని యెట్టిదో, ఆమె శీల మెట్టిదో, ఆమె లక్షణ మెట్టిదో - పెద్దన్నగారు కొన్నిచోట్ల రహస్యముగా కొన్నిచోట్ల సన్నివేశ వ్యంజకముగా నిరూపించినాఁడు.

అన్నింటికంటె మొదల ఆమె వారకాంతయనుటనిస్సంశయమైనవిషయము. ఎంత ఏకపురుష నివిష్ట చిత్తయైనను జన్మలక్షణము కొంత యుండును. ఏకపురుష మనస్కయైన వరూథినియందు తజ్జన్మ సిద్ధమైన వారకాంత లక్షణము సువ్యక్తముగనే కన్పించుచున్నది. ఈ వ్యక్తముగా కనిపించిన దానినిబట్టి సర్వము నూహించుటయా? తక్కిన కథ యంతయు నచ్చట నున్న సన్నివేశము మీద నాధారపడి యుండవలయునుగాని పాఠకుని యథేచ్ఛా మనోవృత్తిపై నాధారపడి యుండగూడదు.

తొలుదొల్త నొక విషయము విచారింతము. ఈ వరూథిని హిమాలయ పర్వతముమీఁద నున్నది. అచ్చటి కూరకే రాలేదు. అచట నొక గారుడోత్కీర్ణమైన సౌధమును గట్టికొని యున్నది. ఆ కట్టుకొనినచోట ఒక గంగపాయ మలకలై కొండలలోనుండి దిగుచున్నచోటు అచ్చటికి పోవుటకు మణులతో కట్టిన మెట్లున్నవి. రెండు వైపుల మల్లెతీగ లున్నవి అవి పూచినవి ఇట్టిమేడ కట్టుకొని యామె హిమవత్పర్వతముమీఁద నివసించుచున్నది. అనఁగా స్వర్గమును వదలిపెట్టి వచ్చినది. అచ్చట తన వృత్తి చేయుట కిష్టము లేక యిచ్చటికి వచ్చియున్నదేమో!? అందుచేత నామె వారకాంత యయ్యును వారకాంత కాదు.

ఆమెను చాలామంది వలచిరి. ఆమె వారిని తిరిగి ప్రేమించలేదు. దీనికి ప్రధాన సాక్ష్యము.

ఏ గంధర్వుఁడు తద్విలాసములు ము
 న్వీక్షించి తా నెంతయున్
రాగాంధుండయి కోరి హత్తక కడున్
 రారాపులన్ కంతుఁ డు
ద్వేగంబందఁగ జేసినాఁ డో....
 వాఁడే సాక్ష్యము

తక్కినవారు నామెను కోరిరి. వీఁ డొక్కఁడే యామెను గాటముగా వలచెను. వానినిగూడ నామె యంగీకరించ లేదు.

ఈమె వారకాంతా వృత్తి కంగీకరించినది కాదు. ఆమె మనస్సు సామాన్యమైనదికాదు. ఆమె ఒక్క ప్రవరునే భావించెను. తత్పూర్వ మేపురుషుని నామె వాంఛించలేదు. వాంఛించినచో- నామె గంధర్వునితో సంసారము చేసెను గదా! గర్భవతి యయ్యెనుగదా! శిశువును కనెనుగదా! వాఁడు మహారాజయ్యెను. ఆమె శతవిధాల కొడుకుకడనే యుండి

యుండును. ఇట్టిది జరగదు ఉండక పోయినను సంసారము చేయుటయు బిడ్డను కనుటయు స్థూలదృష్టికైనను నొక యేడాది యేణ్ణర్ధము కాలము పట్టును. ఆమె నిజముగా వారకాంత వృత్తిగల స్త్రీయైనచో నామె యొక్క ప్రాత బోజుంగులు వదలిపెట్టను. తత్ప్రసక్తియే లేదే! అందుచేత నీ సంగతియే నిశ్చితమైనదిగా కనుపించుచున్నది.

పెద్దన్నగారేదియు వాచ్యముగాఁ జెప్పఁడు గదా? ఇదిగో యీ సంగతిని వ్యంగ్యముగాఁ జెప్పినాఁడు.

తరుణి ననన్యకాంత నతి
  దారుణ పుష్ప శిలీముఖవ్యథా
భర వివశాంగి సంగభవు
  బారికి నగ్గము సేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో
  నని రోష భీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి
  దాల్చెఁ గషాయదీధితిన్.

ఈమె అనన్యకాంత. ఈ 'అనన్యకాంత' యన్న మాటకు పదిమంది పది యర్థములు వ్రాయవచ్చును. తత్కాలము నందతనినే భావించుచున్న దనియైన, ఆమె వారకాంత యగుటచేత ఏ పురుషునకును భార్య కాదనియైన - ఇట్లు వ్రాయవచ్చును. కాని పెద్దన్నగారి భావము ఇంతకుముందు వ్రాసిన సర్వలక్షణము లామెయం దునికిని చెప్పుచున్నది. ఎట్లనఁగా ఈ పద్యములోని భావము చూడుఁడు అట్టి స్త్రీని అంగభవు బారి కగ్గము నేసి, అహంకృతితో మహీసురాధముఁ డరిగెనని సూర్యుఁడు రోషపడి ఎఱ్ఱపడినాఁడని చెప్పెను. అపరమోత్తముఁడైన ప్రవరాఖ్యుఁడు మహీసురాధముఁడు. ఇందులో సూర్యునకుఁ గోపము వచ్చును. ఇది ఉత్ప్రేక్షాలంకారము. అలంకారగతాన్య వస్తువునకు ప్రాధాన్యముండునా యన్నచో మహాకవులయందుండును. వారుత్ప్రేక్షచేత, ఉపమచేత, రూపకముచేత, తమ కావ్యవస్తువులను దీపింపఁజేయుదురు. వస్త్వాదులనుగూడ వ్యజ్యము చేయుదురు దీనికి కాళిదాసు యొక్క యనంతములైన యలంకారము లుదాహరణములు. ఉత్ప్రేక్ష ఉపమాకోటిలోనిది.

ఇప్పుడు కోపించినవాఁడు సూర్యుఁడు. ఇతఁడు మహీసురాధముఁడు ఈ స్వారోచిషమనుసంభవగత మహాకథా దృష్టితోఁ జూచినచో సూర్యునకుఁ గోపము వచ్చినదని యుత్ప్రేక్షించుటలోఁ దప్పు లేదు గదా? మనువు కలుగఁబోవుచున్నాఁడు. ఒక మనువు తననుండి కలిగినాఁడు. అతఁడు వైవస్వత మనువు. ఈ ప్రవర వరూథినీ సమాగమమునుండి సంభవింపఁగల స్వారోచిష మనువు సంబంధమైన వీరి కలయిక సూర్యునకు నభిమతమైనది కదా? ఇపుడు మహీసురాధముఁడన్న శబ్ద మెట్లు? ఈ సందర్భములో నతఁడు మహీసురాధముఁడే! ఎందుకనఁగా నతఁడు కర్మిష్ఠిగాని, జ్ఞాని కాఁడు. అతని 'కరణుల్ దర్భలు నగ్నులుం బ్రియములైన ట్లన్యముల్ గావు' అతనికి వరూథినీ గర్భమున స్వరోచి పుట్టుననిగాని, అతఁడు స్వారోచిష మనువునకుఁ దండ్రియగుననిగాని - ఈ మహాజ్ఞానము లేదు. తద్దృష్ట్యా, మహీసురాధముఁడు; ఇతఁడు మహీసురాధముఁ డనుకొన్నది యెవరు? భగవంతుఁడైన సూర్యుఁడు నీవును నేనును కాము.

ఈ పద్యములో వరూథిని యొక్క జన్మస్థితి రహస్యమంతయు పెద్దన్నగారు నిక్షేపించిరి. అనన్యకాంత యన్న మాటకు దురర్థము చెప్పరాదు ఆమె వారకాంత కాదు అన్య పురుషగత మనస్క కాదు. అందుకనియే హిమాలయమున వచ్చి యిల్లు కట్టినది

ఒక మనువు ఆమె గర్భ గర్భము కాఁబోవుచున్నాఁడు. ఆ మహా సృష్టి కామె పునాది యగుచున్నది. అందుచేత పరమేశ్వరుఁడు గూడ నామెను సామాన్యవారకాంతను జేయఁడు. ఆమె సృష్టి యట్టిదికాదు

కాని యామెకు భోగదృష్టి కలదు. ఆమె యొక విచిత్రమైన శీలముకలది. విచిత్రములైన మనోభావములు కలది. మిక్కిలి స్వతంత్రురాలు. ఆమెకుఁగొన్ని సిద్ధాంతములు కలవు. ఈ లక్షణములు కలది కనుకనే వచ్చి యిచ్చట చేరినది.

1. ఆమెకు తాను దేవతా స్త్రీనని యహంకారము కలదు. తనజాతి యొక్క విద్యావైభవముల యందు అభిమానము కలదు. ఆ విద్యలయందు పరమానురాగము కలదు

చిన్ని వెన్నెలకందు వెన్నుదన్ని సుధాబ్ధిఁ
బొడమిన చెలువ తోఁ బుట్టినాము,
రహిపుట్ట జంత్రగాత్రముల రాల్గరఁగించు
విమల గాంధర్వంబు విద్యమాకు,
ననవిల్తు శాస్త్రింపు మినుకు లావర్తించు
పని వెన్నతోడఁ బెట్టినది మాకు.
హయమేధ రాజసూయము లనఁ బేర్పడ్డ
సవన తంత్రంబు లుంకువలు మాకు;
గనక నగసీమఁ గల్పవృక్షముల నీడఁ
బచ్చరాచట్టు గమి రచ్చపట్టుమాకు,
పద్మసంభవ వైకుంఠభర్గ సభలు
సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర.

ఈ పద్య మామెకు తన పుట్టిన వర్ణమునందుఁ గల యభిమానమును సూచించుచున్నది. కాని తన జాతియొక్క సంగీతాది విద్యలయం దభిమానము కాని, వృత్తియందు కాదు. ముడి యిచ్చట నున్నది. పాఠకుఁడు దీనిని చూడవలయును.

2. ఆమె కింకొక మనోలక్షణము కలదు ఆమె దేవతా స్త్రీ దేవతలు భోగలక్షణము కలవారు. ఆ భోగలక్షణముయొక్క మూర్తియే జాతి. ఆమె యొక్క భోగలక్షణమైన మనోవృత్తి రసభావ సమన్వితమైనది. అందుకనియే ఎన్ని భవంబులం గలుగు

నిశితశరాసన సాయకవ్యథా
ఖిన్నత వాడి వత్తలయి
కేలఁ గపోలము లూది చూపులన్
విన్నఁదనంబుఁ దోఁపఁగను
వేదుఱునంబయి గాలిసోకినన్
వెన్నవలెం గరంగునవి
వేణులఁ గౌగిటఁజేర్పు భాగ్యముల్.

అని చెప్పినది. అనుభావ వ్యభిచారభావ సామగ్రీ నివిష్టమైన యామె యీలోతు గుండె యామె వైలక్షణ్యమును జెప్పుచున్నది. స్వర్గమునందలి భోగమాత్రమైన భోగమునం దామె కిష్టములేదు. అందుకనియే యిచ్చటికి లేచివచ్చినది.

3. మఱియు నామె పండితురాలు. ఉపనిషత్తులు గూడ రసబుద్ధితో వ్యాఖ్యానము చేసికొన్నది. ఇది యామె దేవతా స్త్రీ యగుటలోని లోపము. దేవతాబుద్ధి యంతకు మించిపోదు. బ్రహ్మ విషయిక జిజ్ఞాస మానవుల కున్నంత దేవతల కుండదు. వారు భోగపురుషులు. ఆ నియమితమైన భోగ మనుభవించుటకే వారి

జన్మ ఇట దేవతలకంటె మానవుల యాధిక్యము. అందుచే నామె యుపని షత్తులను స్త్రీ పురుష సంగమ జనితో త్కృష్ట తృప్తిపరముగా 'ఆనందో బ్రహ్మ' యన్న వాక్యమును వ్యాఖ్యానము చేసి నది ఇట్టి వ్యాఖ్యాన మాధునికులలో కొందఱు చేయుచున్నారు భోగపర్యా ప్తమైన లౌకిక సుఖసాధనములు కల వారు తప్పకుండ నిట్టి వ్యాఖ్యానములు చేయుదురు ఇట్టి లక్షణము దేవతలయం దెందుకు లేదు? అందులో నామె జన్మ చేత వారకాంత.

4. ప్రవరుఁడు దయావిహీనుఁడన్నది అతని నిర్దయ తన్ను ద్రోసివేయుట తాను కోరినది నిరాకరించుట ఇదియొక విచిత్ర వ్యాఖ్యానము ఎల్ల కాలము నందు నిట్టి వ్యాఖ్యానములు చేసెడివా రుండనే యుందురు అప్పుడని యిప్పుడని లేదు. అప్పటి భావములు వేఱని, యిప్ప టిభావములు క్రొత్తయని యుండదు. తత్తత్కాలములయందు సుఖసాధనముల యొక్క విలక్షణత్వము నూత్నత్వముం డునుగాని, సుఖవాంఛ యొక్కయు, మానవుని మనస్సు యొక్కయు లక్ష ణము లోకశ్చే రీతిగా నుండును కాల ములు మానవుని మనస్సును మార్చవు ఆ మనస్సున కవలంబములైన విషయ ములయందు మార్పువచ్చును అప్పుడు రెండెడ్ల బండిమీద పోవచ్చును ఇప్పుడు రైలుమీఁదనో విమానముమీఁదనో పోవ చ్చును పోవునది ప్రియాసంగమము కోఱ కైనచో వాంఛాస్వరూప మొకటియే, భావనా లక్షణ మొకటియే

ఆమె యిట్టియిట్టి లక్షణములు కలది, సంగీతము, సాహిత్యము, దయ, తృప్తి లక్షణము, ఏతద్వైశ విషయములను గుఱించి యాలోచించి, యొక నిశ్చ యము చేసికొని, ఆ లక్ష్యమును గూర్చి జీవితము పుచ్చుచున్న వ్యక్తి

ఆమె మనస్సు పాడినది. ఆమెకంటికి నచ్చిన పురుషుఁడు దొరకలేదు.

"సురగరు డోరగ నర ఖే
చర కిన్నర సిద్ధసాధ్యచారణ విద్యా
ధర గంధర్వకుమారుల "

చూచుచునే యున్నది వేసిమీఁదను ఆమె మనసు తగులలేదు సౌందర్యమని నంతనే ఆమెకొక విలక్షణమైన యభిప్రాయము కలదు అట్టి సౌందర్యమామె చూడనే లేదు. అట్టి పురుషుఁడు కనిపించిననే యామె తన జీవితమును సార్థకపరచు కొనును.

ఆమె ఏత ద్విగ్విశిష్ట మనోలక్షణ ములు కలదని చెప్పుటకు మఱియొక పెద్ద హేతువును పెద్దన్నగారు నిక్షేపించి నారు.

ఏ విహంగముఁ గన్న నెలిగించుచును సారె
కును సైకతంబులఁగూడఁ దాఁ
దారి కన్గొనియది తన జోడ గాకున్న
మెడయెత్తి కలయంగ మింట నరయు.
నరసి కన్నీటితో మరలి తామరయెక్కి
వదనమెండఁగ సరోవారి నద్దు
నద్ది త్రాపఁగ సైప కట్టిట్టు గన్గొని
ప్రతిబింబ మీక్షించి భ్రమసియురుకు,
నుఱికి యెలుకలు దడియ వేతొక్కతమ్మి
కరుగు నరిగి రవంబుతోఁదిరుగు తేంట్లఁ
బొడుచు ముక్కున మఱియునుబోవు వెదక
సంజఁబ్రియుఁ బాసి వగనొక్క చక్రవాకి.

ఇది చక్రవాకి, చక్రవాక పక్షులు మిశ్రసంయోగము చేయని జాతి ఈ వర్ణనముచేత పెద్దన్నగారు వరూథినీ లక్షణమును జెప్పుచున్నారు. మఱియు నామె వట్టి వారకాంతయే యైనచో

నీ కావ్యము నందలి చంద్ర దూషణము, మలయానిల దూషణములలోని యౌచిత్యమేమి? అనఁగా నవి యుద్దీపన విభావములు గనుక ఏ స్త్రీకిఁబడిన నా స్త్రీకి నుండునా? ఉత్తమ నాయికా గతమయియే యుండునా? ఇది విభావాది సామగ్రీ రహస్య పర్యాలోచనకు సంబంధించిన విషయము సామాన్య నాయిక, బహు పురుష సంగమము చేయునది, అదియొక పురుషుని గూర్చి యింత దుఃఖించదు ఒకవేళ దుఃఖించినచో దాని యందీ గాఢత్వముండదు, ఈ యౌచిత్యముండదు. రస సిద్ధాంత నిర్మాతలైన భరతాది మునులు దీనినట్లు భావించి యుండరు బహుపురుష సంగమము గల స్త్రీ అంతమందిలో నొకని కొఱకు విరాళి పొందుచున్న దనఁగా పాఠకుని యందుఁగాని, సామాజికుని యందుఁగాని రసోదయము కల్గునా? హాస్యముపుట్టునా? వరూథినియొక్కశీల రహస్యము పెద్దన్నగారి విరహము నందు నిగూఢముగా నుంచి నాఁడు ఈ సందర్భము లన్నియు మనస్సులో పెట్టుకొని వరూథినీప్రవరాఖ్య సమాగమము పర్యాలోచించ వలయును. అమె ప్రవరాఖ్యునితోఁ గలసిన సమయమెట్టిదో విచారించ వలయును ఆమె చిత్తవృత్తియొక్క సామాన్య లక్షణములే యింతవఱకుఁ జూచితిమి తత్సమాగమ కాలము నందలి యామె పరిస్థితికూడ చూచినచో విశదము కాఁగలదు

ఆమె తనకంటికి మిక్కిలి యింపైన పురుషునే భావించుచున్నది. అతఁడు కృచ్ఛలభ్యుఁడుగానున్నాఁడు ఈమెయో తనసౌందర్యము, తన పాండిత్యము మొదలైన వన్నియు వ్యర్థములై పోవుచున్న వన్న భావము కలది. తానొక లక్ష్యము పెట్టుకొని, దాని ప్రకారము భోగసాధనములను నిర్మించికొని, బ్రతుకుచున్నది వేఱు మేడ కట్టుకొన్నది ఒకరమణీయమైన ప్రదేశమున కట్టుకొన్నది దానికి చుట్టు పూఁతీగలు మెట్లు మణులతో చేసినవి తాను దుస్తులుధరించును తాను సౌందర్యవతినని తానెఱుఁగును తనసౌందర్యమున కనుకూలమైన దుస్తులు ధరించును. గొప్ప భోగలాలసురాలు సంగీతము తాను పాడఁగలదు వీణ వాయించును ఆ వీణాధ్వనిలో తాను లీనము కాఁగలదు.

ప్రవరుని నామె చూచినవేళ అట్టిది. ఆమె మనస్సు భోగముయొక్క యుత్కృష్టస్థితియందులగ్నమైయున్నది. తాను భావించిన పరమ సుందరుఁడు, వాఁడెవఁడో, వానితో మనస్సులో రమించుచున్నది.

ఆలాపగతిఁజొక్కి యరమోడ్పు కనుదోయి
రతి పారవశ్య విభ్రమము దెలుప,

ఆ కనుదోయి ఆవిభ్రమమును తెలుపుచున్నది. అట్లున్నదని యర్థమా? తత్కాలమునందామె మానసికముగానట్టి స్థితి ననుభవించి తద్గత పారవశ్యమునే ప్రదర్శించుచున్నదనియా? ఈకనుదోయి ఆలాపగతి చేత చొక్కుట చేతకలిగినదా? మానసికమైన రతి పారవశ్యమును తెలుపుచున్నదా? అన్నమాట

ఇక్కడ 'చొక్కి' అన్న క్త్వార్థము హేత్వర్థమందుఁ బ్రయోగింపఁబడినదని చెప్పక తప్పదు, 'అరమోడ్పు కనుదోయికి ఆలాపగతి చేత చొక్కుట హేతువు, ఇందులో 'తెలుపన్' అనుధాతువు సామ్యలక్షణ స్ఫోరకమా? యథార్థ విషయ

కథనమా? అప్పుడాలాపము చేయుచున్నది కనుక చొక్కుట దానియందే- అన్న ప్రాధాన్య మివవచ్చును, కాని తెలుపు ధాతువు ప్రయోగించుటలో నున్న వైలక్షణ్యము రతిపారవశ్యమునకును ప్రాధాన్యము కలిగించును.

ఇట్టి స్థితిలో ప్రవరుడు కనుపించినాడు, అతడు కనుపించినంతనే -

అబ్బురపాటు తోడ నయనాంబుజములె

వికసించినవి. అనగా నామెకాశ్చర్యము కలిగినది. ఈ ఆశ్చర్య మెందుకు కలిగినది? ఇన్నాళ్లుగా తానే సౌందర్యమును భావించుచున్నదో, ఏ సౌందర్యము తానెప్పుడును 'పురుషగతమై చూడలేసని నిశ్చయించుకొన్నదో, ఆ సౌందర్యము గల పురుషుడెదురుగా గనిపించెను. ఇందుకనియా అబ్బురపాటు? లేదా అట్టి సుందరుడైన పురుషునితో తాను మానసికమైన భోగమనుభవించుచు, రతి పారవశ్యమును పొందినది. తనమనస్సులో నున్నవాడే ఎదురుగా కనిపించుట చేతనా?

ఆమె అతనిని జూచినది. పోయి పోకచెట్టు వెనుక నిలుచున్నది. సందేహ పడినది. అతని సౌందర్యము నెంత త్రావినను ఆమెకు తనివితీరలేదు. ఆమె మనస్సే ఆడుచుండుటలేదు.

అరు పద్యములలో ఆమె అప్పటి స్థితినే పెద్దన్నగారు వర్ణించిరి అనగా దిగ్భ్రాంతురాలై పోయినది. అప్పుడామె మనస్సాడినది తరువాత మూడు పద్యములలో నామె మనస్సులోనికి వచ్చిన యూహాలు చెప్పబడినవి. తానుపోయి వాని కడ్డముగా నిలుచున్నది. ఇది తప్పా?

గుణ దోషములు విచారించుటకు ముందు తత్తత్పాత్రలయొక్క స్థితిలో పాఠకుడు తన్నుంచుకొన వలయును. ఒక స్త్రీ ప్రవృత్తి మఱొక స్త్రీకెక్కువ తెలియును లోకమునందు మానవులు తమకు సంబంధించినంత వఱకు తమ ప్రవర్తనను విచారించి చూచుకోరు ఇతరులయందు నీతి సూత్రములు పట్టింతురు. మానవుని భావనా లక్షణములో నీతియు ధర్మము దేవుడు మొదలైనవి తనప్రవృత్తికి తన నడకకు సంబంధించ నట్లుండును. అది వేఱే లోకము. ఒకొక్క కావ్యమునట్లు చదువరాదు.

ఎన్నేండ్లు గానో తాను భావించుచున్న యొకానొక సౌందర్యము తాను తనయొడలు తనకు దెలియని యొక తన్మయస్థితిలో నుండగా కంటికి కనిపించినప్పుడు, ఆమెకు విచారణ ఎక్కడిది? అప్పుడు మనస్సే లేదు. ఇన్నాళ్ళ నుండి గూడు కట్టుకొనియున్న తనవాంఛయే పరము బలిష్ఠమై యుండును మఱియు నామె తాను దేవతాస్త్రీనని, తానుమహా విద్యావతినని, పరమసౌందర్యవతినని, పలుమంది తన్ను వాంఛించిన హేతువుచే తానే పురుషుని భావించునో, వాడుగూడ నట్టి స్థితిలోనే యుండునని, ఇతడు బ్రాహ్మణుడు గనుక బ్రాహ్మణుల యజ్ఞకర్మలు రంభాద్యప్సరస్త్రీ సంభోగ ఫలములు గనుక తాను కోరుటయు యాలస్యముగా నతడు తన్ను జేపట్టునన్న యూహకలది ఆమె వైపునుండి యన్నియు సుసంగతములే ఆమె భావించని దొక్కటే విషయము ఆ విషయములో నామె భావించనట్లే కొంద ఱాధునికులు భావించుచున్నారు.

బ్రాహ్మణులు యజ్ఞయాగాది సీకతువులు చేయుట రంభాద్యప్సరస్సం యోగము కొఱకు ఇది కామము. ఇది తుచ్ఛము - అన్నది యొకటి. రంభాద్యప్సరస్త్రీలు గూడ వారకాంతలే కనుక ప్రచస్త్రీలు - ఇది యొకటి

రెండవదానిని జూతము. రంభాదులు దేవతాస్త్రీలు. వారున్నారని నీవొప్పుకొన్నచో, వారు నీకంటికి కనుపించరు వారు నిన్ను శపించ గల్గుదురు. వారకాంతకు శాపమీయఁగల శక్తియా ? రెండును పొసఁగవే! వారు నీవనుకొన్న వారకాంతలు కారేమో? ఇచ్చట యజ్ఞయాగాది క్రతువులు, తత్ఫలితములు, వానిని చిత్రవిచిత్ర లక్షణములు, ఊర్ధ్వలోకములు మొదలైన వాని మహాత్త్వ పర్యాలోచన చేయవలయును. నేడు మన మనుకొనుచున్న కొన్ని భావము లక్కడ పట్టించుట కాదు,

మఱి యుంక ఆ యప్సరస్త్రీ సంయోగము కొఱకు యజ్ఞము చేసినాఁడు. మఱి ప్రవరుఁడు-అది లభించినదికదా?- ఎందుకు వంగలేదు? ఇది ఇట్టివాదనకు పెద్దన్నగారి సమాధానము. ఆ యజ్వ ఏక భార్యుఁడు. ఆ శరీరమున్నంతవరకు తదితర భోగవాంఛ లేనివాడు, రంభాది గతవాంఛ తేజోలోకముల యందలి విషయము సామాన్యముగాఁ జూచినచో నెవనికైనను దానమిచ్చినచో అదిముందు జన్మలలో నుపయోగపడునని అట్టి ఊహామీద నడచినచో రంభాది భోగము కొంత యర్థము కావచ్చును.

'ఆనందో బ్రహ్మ' యన్నచోట ఈ వరూథిని మనోవాగ్లక్షణములు ప్రపంచించుచోట పెద్దన్నగారుతత్కాలముననున్న కొందఱు ఇట్టి యూహాలుసేయువారి నుద్దేశించి ఈ కావ్యమున వ్రాసెనేమో? అది సంపద్వంతమైన రాజ్యము. సంపద ఎన్ని వెఱ్ఱియూహాలకైనను దారితీయును.

ప్రవరుఁడు "అండజయాన." "భీత హరిణేక్షణ"అని యామెను సంబోధించుటచే నీమె కాశ కలిగినది. ఆసంబోధించుట పాప మాతఁడు తన ప్రకృతి సహజముగా చేసెను

అతఁడు తనయింటి దగ్గఱ తల్లిదండ్రులు వృద్ధులని మొదలైనది చెప్పెడు వఱకు నామె కతని తత్త్వమే తెలియలేదు. కాని ధైర్యముపోలేదు. అందుచేతనే అమె మొగమునందు విన్నబాటు మాత్రమే కనిపించినది.

పాప మప్పటి యామెస్థితి, ఆమె యొక్క సర్వభావన, సర్వమైన చిత్తవృత్తి తత్కాలము నందలి యామె పారవశ్యస్థితి-సర్వమును వృథా యైనవి.

ఈ రీతిగా వరూథినిని ఇట్టి లక్షణములు కల దానినిగా, ప్రవరుని అట్టి లక్షణములు కలవానినిగా నిర్మించి పెద్దన్న ఈ విచిత్రమైన శిల్ప సృష్టిని జేసెను

★



పారిజాతమ్

★

చిత్రశిల్పి
శ్రీ చగన్‌లాల్
ఆర్ జాదవ్

★

ఆసియా నాగరికత

డాక్టర్ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ

[తృతీయ ప్రపంచ యువజన మహాసభయందు శ్రీ రాధాకృష్ణ పండితుఁడిచ్చిన సందేశమిది]

నే నీ నాడిటనుండి మీరు కోరిన యంశముపైఁ గొన్ని మాటలాడుట కెంతో సంతోషముగా నున్నది. ఆసియా నాగరికత యనగా నిదమిత్థమని తెలిసికొనుట కష్టము. చీనా, భారతదేశము, జపాను, పెక్కు మహమ్మదీయ రాజ్యములు, ఇండోనేషియలు – ఇవి యన్నియు నాసియాలోనివి. వీనిలో ప్రతియొక్క దేశము నొక్కొక్క విశిష్ట స్వభావమును, వ్యక్తిత్వమును గలదియే. కనుక ఆసియా నాగరికతగుఱించి స్థూలముగా గాక చెప్పుటకు సాధ్యము కాదు.

ఆసియా కొక మనస్తత్వమును, యూరోపునకు మఱియొకటియు గలదని చెప్పువారు కొందరున్నారు. మతములన్నియు నాసియాలో వర్ధిల్లుటచే నాసియా ఆధ్యాత్మికమైనదనియు, ఇటీవల శాస్త్రీయ సాంకేతిక విషయక పరిశోధన లనేకములు పాశ్చాత్య దేశములందు ఫలించుటచే పాశ్చాత్య దేశములు భౌతిక శాస్త్రదృష్టి కలవనియు చెప్పుచున్నారు. ఆసియా ఆధ్యాత్మిక బుద్ధి కలదనియు యూరోపు భౌతికబుద్ధికల కలదనియు చెప్పు నిట్టి యనాలోచితమైన స్వభావీకరణము పూర్తిగా సరియైనది కాదు. అధ్యాత్మయోగులు పాశ్చాత్యమునను, శాస్త్రవేత్తలు ప్రాచ్యమునను గలరు గదా!

1895 లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ ప్రారంభోపన్యాసమున యాక్టన్ ప్రభువు "గడచిన మూడువేల యేండ్లను విడిచి, ఇటీవలి నాల్గువందలేండ్లలో జరిగిన సంఘటనలపై తన దృష్టిని కేంద్రీకరించిన వానికి సరియగు చారిత్రక దృక్పథము లేనట్లే. అట్టివాని జ్ఞానము తర్కబద్ధమును సమగ్రమును కాజాలదు." అని వక్కాణించెను.

ఈ ప్రపంచమున ప్రతి యొక్కనికిని శాస్త్రీయమైన, మత విషయికమైన భావనయున్నది. ప్రతివానికి నేదో మత విశ్వాసము స్వాభావికముగానేయున్నది; అట్లే ఆవిశ్వాసమును తర్కించుబుద్ధియు నున్నది. కనుక ఆసియా ఆధ్యాత్మికమైనదనియు, యూరోపు అనాధ్యాత్మికమైనదనియు స్వాభావికముగా వర్గీకరించుట సాధ్యముకాదు. ఒకచో నొక్కటి యధికమనవచ్చును. కాని యొకచో నొక్కటి లేదనరాదు.

చీనా జపాను ఇండోనేషియాలు సంస్కృతులను, మనము ముందు గమనింపనున్న తక్కిన యంశములను పేర్కొనకుండ, ఆసియా నాగరికతను గూర్చి ముచ్చటించుట యసంభవము. అతి సనాతనమయ్యు నిత్యనూతనమై ప్రాచ్యమున పలుప్రాంతముల యందును, పాశ్చాత్యమున కొన్నియెడలను పరివ్యాప్తమైన భారతీయ తత్త్వమిట్టిదని మాత్రము నేను సూచింపగలను. ఇండోచైనా, ఇండోనేషియాలకు చెందిన అంగ్కొర్వాట్, బోర్‌బోడర్‌లను పరికించినచో నట భారతీయప్రభావ మెంతగాగలదో బోధపడును. మన యభిజ్ఞకును, ప్రఖ్యాతి

కిని, మానవసేవకును వారే నిదర్శన ములు కాగలరు

ఈ దేశమునకొక విశిష్టతాత్త్విక దృష్టియు, ఒక ప్రత్యేక మానసికస్థితియు, ఒక విలక్షణ జీవనవిధానమును గలవు అది మతసంబంధి యన్నచో ఆమతము ప్రమాణభూతములైన శాశ్వత సత్యములపై నాధారపడినది కాదు ప్రపంచమును పరిశీలించి, జడమునుండి చేతనమునకు, చేతనమునుండి మనస్సునకు, మనస్సునుండి ప్రజ్ఞకు నిరంతరపరిణామమున్నదో లేదో కనుగొనవలసినదిగా ఆ మతము మనలను పురికొల్పును మన మిప్పుడీ పరిణామమున పరాకాష్ట నంది యున్నాము. ఇంకముందు రాగలదశ ప్రజ్ఞనుండి యాధ్యాత్మిక విమోచనమున కగు పరిణామము ప్రజ్ఞామూలక మగు చైతన్యమునుండి వికాసపూర్వక చైతన్యమునకు మనము పరిణమింప వలసియున్నది విశ్వపరిణామ మందిది ముందు రాఁగల దశ. మనలో ప్రతి యొక్కరు నీ పరిణామమునకు సమర్థులే ఎట్లనగా వికాస పూర్వక చైతన్యమని గాని ఆధ్యాత్మిక విమోచనమనిగాని మనము చెప్పునది ప్రతి వ్యక్తి యందును కానవగుటచే నెల్లవాడును సమర్థుడే యగుచున్నాడు దీనినే మనము "తత్త్వమసి" యను సూక్తియందు పొందుపఱచి యున్నాము

ప్రతి యొక్కని యందును నాధ్యాత్మికజ్యోతి మిణుకు మిణుకు మనుచునుండనే యున్నది. అనువగు పరిస్థితులున్నచో, నది తేజోరాశిగా వెంపొందగలదు ప్రతి వ్యక్తియందును సర్వత్ర ఈ ఆధ్యాత్మిక జ్యోతి వెలుగొందుచుండుటయే ప్రజాస్వామికమునకు ప్రాతిపదిక. మానవస్వామ్య ప్రకటన కదియే కారణము మానవులందఱు స్వభావము చేత నొకే తీఱున సంపన్నమైన యాధ్యాత్మిక శక్తి కల్గి యున్నారు. అందుచేతనే వారికి గౌరవ స్వాతంత్ర్యములు కలవు జడమునుండి చేతనమునకు, చేతనమునుండి మనస్సునకు మున్నుగాఁగల ఆదిమ పరిణామములు తమంత తాముగా జరిగినవేయైనను, మానవ పరిణతికి సంబంధించినంతవఱకు నది సచేతనమును స్వచ్ఛందమును నైనది నేటి అజ్ఞానమూలకమైన, అనుత్సాహ జనకమైన మన పరిస్థితులను వికాసవంతమైనవిగా ఆధ్యాత్మికతా సంపన్నములైనవిగా మార్చుకొనుటకు మనము కృషి యొనర్పవలసియున్నది. ఇక్కడనే మానవునియొక్క స్వాతంత్ర్యమునకు ప్రయోజనము

పరిణామముయొక్క ప్రాథమిక దశలందేది యంత్రప్రాయమైనదో పాశవిక దశయందేది స్వభావ చోదితమో, అది మానవ స్థాయియందు స్పష్టమగు ప్రయత్నముచేతను, సచైతన్యమగు శిక్షణచేత సాధింపబడవలసి యున్నది. తన గమ్యమును పొందుటకు గాని, పొందకుండుటకు గాని మానవునకు స్వాతంత్ర్యము కలదు స్వయం కర్తా అని

నీవు భగవానుని ప్రతిబింబమువు. ఆ ప్రతిబింబము స్వతంత్రమైనది కనుక నతడు పైకిపోవచ్చును. ఈ ఆధ్యాత్మిక జ్యోతి పెక్కు మాయావరణములచే కప్పబడియున్నది. మానవ ప్రకృతి

యందున్న అనాధ్యాత్మిక వస్తువులపై ఆధ్యాత్మికశక్తి యొక్క యాధిక్యమును నెలకొల్పుట వలననే మానవ వ్యక్తిత్వము సాధింపఁదగినది. కనుక మన ప్రకృతిపై మన కొకానొక సంయమన మవశ్యము కావలసియున్నది అతిక్రమ శిక్షణచేత, మనకై నియమితములైన పెక్కు సాధనలచేత కాఁదగినది అప్పుడే మనము అనాధ్యాత్మికశక్తుల కతీతుల మగుచున్నాము. అట్లు చేయకున్నచో, మనము పూర్తిగా స్వతంత్రులమయి నట్లు కాదు

ప్రత్యక్షములగు ఈ పలుసంఘటనములందు తానుగూడ నొక్కఁడని, తనలోనున్న దైవాంశనుగమనింపక, తాననగా రక్తము మాంసము ఎముకలుకండరములు కూడిన యొకగూడని, తలచువాడు తనయందేయున్న యాధ్యాత్మిక జ్యోతి నారయజాలడు అట్టివారుకర్తను పదార్థముగాఁ జూతురు,మనస్సు మరచి ఆలోచనలేక, దృష్టిహీనులగుదురు తమ యంతరాత్మ పరిశీలనమొనర్చి, పదార్థమున కంటె, నాయూసంఘటనముల కంటె కర్త యధికమని గుర్తించినవారే స్వతంత్రులుగా గణింపబడుదురు

ఇట్టి యంతస్సంయమము గలవారెందు బుట్టినను, ఏజాతికి చెందినను, ఏ మతము వారైనను, వారందరు నొకే కుటుంబమునకుఁ జెందినవారు మొదలనేనే విభేదము లుండినను తుదల నందఱు నొక్కటియే తొలినాళ్ళ నుండియు ఈ విశ్వైక దృక్పథమే భారతీయాధ్యాత్మిక తత్త్వము యొక్క విశిష్టత "యత్ర... విశ్వమ్..." అను ఋగ్వేద వచనము మన కెఱుఁగుదుము ఆ అద్భుత సత్యమునందు విశ్వమెల్ల నేకాశ్రయమగును ఈ సత్యము దృష్టిలో తెల్లవారు - నల్లవారు, క్రైస్తవులు-యూదులు, ఎల్లరు నేకాశ్రయులే కావలెను అందువలననే, ఈ దేశమున జన్మించిన యెల్లవాడును, ఏ జాతివాడైనను, ఏ మతము వాడైనను,భారతీయుడే యగునని పెద్దలు పేర్కొనినారు

ప్రస్తుతమున అసంపూర్ణస్థితి నుండి సంపూర్ణస్థితికి మనలఁ జేర్చు సాధనమే మతమని మనకిప్పుడు తెలియును అట్టి సాధన కెల్లరును సమర్థులే అట్టి పరిపూర్ణస్థితి నొందుటకు ప్రతివానికిని స్వాతంత్ర్యమున్నది. తనయందలి జ్యోతిని కనుగొనుటకై మానవుఁడు దారుణ తపశ్చర్యలకు లోను గావలసియున్నది అట్టి ఆత్మద్రష్టలగు నెల్లరు నేకకుటుంబమునకుఁ జెందినవారే. వారియెడల భేదము సేయుటొప్పదు. మూలములందు పరస్పరము పెనచుకొని యున్న మతములు వేదాంతములం దొడగూడి యున్నవి

విదేశీయు లిటకు వచ్చినపుడు వారిపైనొక ప్రత్యేక సిద్ధాంతమును రుద్దుటకెట్టి ప్రయత్నమును మనము చేయలేము "మనమెల్లవారికి వారి వారి సంప్రదాయములను, వారివారి నీతి శాస్త్రములను మాత్రమేబోధించుచున్నాము ఆత్మజ్ఞానమొందు దనుక వారి వారి మార్గములందు వారు పెంపొందుటకే మనము దోహదమొనర్తుము" అని యొక పురాతనకవి చెప్పియున్నాడు. కాబట్టిఆధ్యాత్మికవిద్యయొకరిసొమ్మన్న

ప్రత్యేక బుద్ధి యేమియును లేదన్న మాట.

మన మతాతీతరాజ్యమున కర్థమిదియే. మన దేశము మతాతీతమనుటలో మన మెల్లను తమ మతముల సమాదరింతుమనియు, అన్ని మతములవారును తమ తమ యధికారముల ననుసరించి పరాకాష్ట నొందుపట్ల మనము తోడ్పడుదుమనియు- నర్థము. మనమెల్లప్పుడు నీ సిద్ధాంతమునకు బద్ధులమై యుంటిమని నే ననను. అప్పుడప్పుడు మన మీసిద్ధాంతమునకు దూరగులమై, తత్ఫలమనుభవించియే యుంటిమి కాని, ఇప్పుడు నేను సూచించిన యంశములుమాత్రము విస్తృతమగు మత సౌభ్రాత్రమునకు పునాదులు కావచ్చును.

"యువకులు-ప్రగతి, నూత్నశక్తులు నూత్నభావములు" ఇది మీరు స్వీకరించిన వస్తువు.

యువకులు- ప్రగతి. ప్రగతి తప్పనిసరిగా కలుగునది కాదు ప్రగతి తనంతనది జరుగవలసిన యొక సంఘటనము కాదు. మానవజాతికి సంబంధించినంత వరకు- ముందటి తరముకంటె తరువాతి తరము వారు తెలివితేటలలోను గుణగణములలోను పెంపొందుచు వచ్చిరని మనము చెప్పజాలము. మీరు చేయగల్గినది మీపైనే యాధారపడి యుండును.

ఒక మానవుని జీవితముగానీ, ఒక నాగరికతయొక్క బ్రతుకుగానీ ఒక చెట్టు జీవితముతోనైనను ఒకపూవు బ్రతుకుతోనైనను పోల్చవచ్చునని యును, అది దానియంతనే కొనసాగునని యును, ప్రతి యొక్కటియు జరుగవలసియే జరుగుచున్నదనియును, సర్గాంతమున సర్గాది స్థితియే యుండుననియు నొక సిద్ధాంతము కలదు దానిని నిశ్చయవాదమందురు ఇంతదనుక నేను మీకు చెప్పుచుండిన సూత్రముల కియ్యది యనుగుణమైనది కాదు.

మానవుడు కర్త. అతడు స్వతంత్రుడు. తన ఆశయములనుబట్టి యాతడు తన గమ్యమును తీర్చి దిద్దికోగలడు. అతడు తన జీవితము నున్నతముగానైనను, నీచముగానైనను చేసికోగలడు. తన కిష్టమైన తెన్నున నడుచుట కాతని కవకాశమున్నది. కాబట్టి ప్రగతియే మనకు కావలసినచో, మనము దానిని పొందుటకు సిద్ధము కావలెను. మానవుడు ప్రజ్ఞావిషయమునను నైతిక విషయమునను ఎలవఱచుకొను సంయమనము మీదనే యాతనిగమ్యమాధారపడి యుండును ప్రగతి యొకసాధన. అది మనంతమనము సాధించుకోవలసినది. ప్రగతి యనగా నట్టిది.

మనము నూత్న శక్తుల గురించి మాటాడుచున్నాము మన మనస్సునకెక్కిన శక్తులు, మన అంతరాత్మలను ప్రభావితము లొనర్చిన శక్తులు, ప్రస్తుతము సంక్షోభకారకములైన శక్తులు, శాస్త్రీయములైన సాంకేతికములైన శక్తులు-అనగా - పరమాణు తేజము నుండి వెలువడిన శక్తులు ఈనాడు మన అదుపులోనికి వచ్చినవి. అవి గణనీయములు. మనమిప్పుడు పరమాణుయుగమున నున్నాము. మన మదుపులోనికి దెచ్చుకోవలసిన శక్తి పరమాణుశక్తి.

కడచిన యుద్ధమున మనము పరమాణువు బాంబు నుపయోగించితిమి. ఇప్పుడు ఉదజని బాంబులు నిర్మించితిమి. వానిని రాఁగల యుద్ధమున వాడవచ్చును

బుద్ధిశాలురు నింగితజ్ఞులు నగు జనులెల్లగు నొకవంక మనబుద్ధి వైభవమున కచ్చెరువందుచునే, మరొకవంక మన నైచ్యమునకు క్రుంగిపోవుచున్నారు. ఈ వ్యత్యాసమును జూచి నిరాశాహతులగుచున్నారు. ఈ పరమాణు తత్త్వమింత పెంపొందకమునుపే, హెచ్. జి. వెల్సు ఇట్లు వ్రాసియున్నాడు: "ఇక ముందు రాఁగలశక్తుల నతిక్రమించుటకు గాని, వానిని లోబఱచుకొనుటకు గాని, వానినుండి తొలగుటకుగాని మార్గము లేదు."

జూరిచ్ మనస్తత్త్వ శాస్త్రజ్ఞుడొకడిట్లు వ్రాసినాడు: "నేడు ప్రపంచమున నున్న విషమపరిస్థితిని జూచినప్పుడు, మన సృష్టికర్త ఈపరి జలప్రళయమును గాక అగ్నిప్రళయమును గల్పింపజూచుచున్నాడేమో యని యనుమానించక తప్పుటలేదు" ఈ పరిణామములపై నాతని భావమది.

టాయిన్బీచే సంపాదితమగు నొక గ్రంథమునకు పీఠిక వ్రాయుచు కాంటర్బరీమతాధిపతి ఇట్లు వ్రాసెను: "మానవజాతి పరమాణ్వాయుధములచే నశింపవలెనని భగవంతుని యాశయమై యుండును. మానవజాతి సర్వకాలము జీవించునని క్రైస్తవమత గ్రంథములు చెప్పియుండలేదు. ఎప్పుడో యొకప్పుడు మానవజాతి నశించవచ్చునని క్రైస్తవ గ్రంథములు చెప్పియున్నవి. బహుశః మనమా సర్గాంతమునకే పయనించుచుండవచ్చును."

ఈనాడు ప్రపంచమందలి మహామేధావులకుకల్గిన నైరాశ్యనిస్పృహాయత లెట్టివో ఇపుడు మీదృష్టికి దెచ్చుచున్నాను. వెల్సు, డాక్టర్ ఫిషర్, కాంటర్బరీ మతాధిపతి- అట్టివారు చెప్పుచున్నది యిది.

ఈ నాటి తాత్త్విక స్థాయికి మానవ నైజము పెనుపొందగలదా, ఈ క్రొత్తగా తల యెత్తిన నూత్న శక్తుల కనుగుణముగా మానవులు తమ తమ సాంఘిక మర్యాదలను పరిష్కరించుకొనగలరా, కేవలము మన పరిసరములనే కాక, మన స్వభావమునే సంస్కరించుకోగల శక్తి మనకున్నదా - యను విషయమున వారాందోళితులగు చున్నారు. మనలను మనము సంస్కరించుకొనుట సాధ్యము కాదని, వివిధ దేశములు పరమాణు మారణాయుధములతో సన్నద్ధములై యున్నవని, మనము కరుణామూర్తియగు బుద్ధునిగాని, శోకమూర్తియగు క్రీస్తును గాని యనుసరింపక రక్తదాహముగోరు రాక్షస దైవతము నారాధించుచున్నామని యెఱింగినప్పుడెవనిమనస్సు సంక్షోభింపదు? నిజమునకు మనము ద్వేషపూరితులై కరుణవీడి కత్తి పట్టుమని ప్రబోధించు రాక్షస దైవతము నారాధించుచున్నామా? అట్లుగాక బుద్ధభగవానునియొక్క, ఏసుక్రీస్తుయొక్క, ఇటీవలి గాంధీమహాత్మునియొక్క సందేశమును వినుటకు సంసిద్ధులమై యున్నామా? ప్రపంచమంతయు నేక కుటుంబమైనదని గుర్తించుట నేటి మానవ

నైజమునకు సాధ్యమగునా? ప్రపంచమును కాపాడనిదే, నిన్ను నీవు కాపాడుకోఁజాలవు

మనము పరస్పర సౌదర్యము నెరపుకొనవలసి యున్నదనియు, మనము పరస్పరము ప్రేమించుకోవలసి యున్నదనియు, మనలోని విభేదము లెట్టివైనను మనము పరస్పర మెదుర్కొని వినాశము చేసికోరాదనియు తెలిసికొన్నచో మనము పరస్పరము సహన భావము కల్గియుండు నవకాశముగలదు.

మనము మూర్తీభవించిన సద్గుణముల సంపుటియనియు, మనశత్రువులు దుర్గుణ రూపులనియు మనము చెప్పలేము. ఒక మానవునిపై తీర్పు చెప్పు పని మనదికాదు. "ప్రతిక్రియ నాపని" యని భగవానుడు చెప్పియేయున్నాడు. అది మనిపని కాదు. మనకు కావలసినది వినయము, పశ్చాత్తాపము ఈ రాజకీయ సమావేశములన్నియు ప్రతిష్టంభనలతో, అవష్టంభములతో, అంత్య సందేశములతో నంతమగుట యేల? మనము వినయముచేత, మానవత్వము చేత పెనుపొందకుండుట కేమికారణము?

మనము నూత్న శక్తుల గూర్చి మాటాడుచున్నాము. అవి మన బ్రతుకునే అపహాసించుచున్నవి మనకు కావలసినవి క్రొత్త ఆశయములు, నూత్న సహజీవన మార్గములు, ప్రపంచ సమస్యల పరిష్కరించు నూత్నపద్ధతులు !

మన స్వభావమును మనము మార్చుకోజాలనిచో, భూస్వామికాదితిరోగామి శక్తులను ప్రోత్సహించక అన్నిజాతులు తమంతదాము పెంపొందుటకు గల

హక్కును మనము సహజీవనము చేత స్థిరీకరించనిచో, సుసంస్కృతమగు నొక నూతన సామాజికపద్ధతిని మనము నెలకొల్పజాలనిచో, ఇక మానవజాతి బ్రతుకుట యన్నది సాధ్యముకాదు. మనమట్లు నశించినచో, ఆ వినాశము మన తలతిక్కచేత, గర్వముచేత, బుద్ధిపూర్వకముగా, గ్రీకులన్నట్లు 'అనియతాధికారవాంఛ' చేత తెచ్చిపెట్టుకున్నదే కాగలదు హిట్లరువంటి వారెందరో యట్టి దుర్గుణములచే నాత్మవినాశము తెచ్చిపెట్టుకొనినారు.

"ఎవడు భాధితుడైనను, ఎవ్వడు క్షుతుడైనను, ఎవ్వడు తల వ్రాల్చినను, ఆ బాధ నాది" అను భారతసూక్తి కలదు ఇతరుల కోర్కెలయందునూహలయందు సహానుభూతితో నీ యంతరంగముతరంగితము కానిచో; నీవుమంచి పని చేయుచున్నట్లుగాని, నీవు సద్భావముకలిగియున్నట్లుగాని అనుకొనరాదు.

ప్రగతి విషయము మీరు పేర్కొనినప్పుడు అది మంచిదే యువకులు ప్రగతిని కొనిరాగలరు.

నూత్నశక్తుల మాట వచ్చినచో, నవి శాస్త్రవిజ్ఞానమునుండి సాంకేతికనైపుణ్యమునుండియుప్పతిల్లిన శక్తులు. అవి పరమాణు శక్తులు వీనిని మనము మంచి పనులకు వినియోగించుకోవచ్చును. ప్రపంచమున తొలినుండియు ప్రతిశాస్త్రీయపరిశోధనమంచికో చెడ్డకో తప్పక సాధనమగుచునే యున్నది. అట్లే పరమాణుశక్తి సైతము ఉభయ ప్రయోజకమై యున్నది. ప్రపంచమును వినాశమొనర్చుటలో మన శక్తి సర్వసమగ్ర

మైనది. కాని మానవ స్వభావమును మార్చవలయు ననునదియే నూతన సందేశము. జాతి క్షేమమున కంటె తన క్షేమమును ముందు చూచుకొనువానిని దేశద్రోహి యన్నట్లుగనే, మానవ క్షేమము కంటె తనక్షేమమును ముందు చూచుకొను జాతి అమానుష జాతి యని గుర్తించవలసియున్నది.

మన ప్రవక్త మహాత్ముడిట్లు చెప్పియున్నాడు. "మానవ సంక్షేమమునకై యొకనాడు మరణించుటకొఱకు భారతదేశము స్వతంత్రము కావలెనని నా కోరిక!"

ఆయన విశ్వసౌభ్రాత్రవాది అస్వతంత్రమైన అసహాయ భారతమెవ్వరికి గాని సహాయకము కాజాలదు. గాన నాతఁడు భారత స్వాతంత్ర్యమును సాధింపఁ గోరెను. ఆయన జాతీయతత్త్వముగూడవిశిష్టమైనది. "నాదేశము స్వతంత్రము కావలెనని నాయాశయము అవకాశము కలిగినచో మానవ సంక్షేమమునకై భారతభూమి తన జీవితమునైన సమర్పింపవచ్చును." అని మహాత్ముడు చెప్పెను. అట్టి నూత్న భావమునే మనముపొందవలసియున్నది.

నిస్పృహకు కారణములేదు. మీ మీ దేశములకు ఈనూత్నదృక్పథమును మీరు కొనిపొండు. ఇది నూత్నసామాజిక దృక్పథము అన్నిజాతులు, దేశములు ఆత్మయందు స్వతంత్రములై, ప్రవర్తనయందు నాగరికములై నడచుకొను నొక విశ్వమానవ సామాజిక దృక్పథము

మనవి

★

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను. ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు, వారి రచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు, నవభారతి

"ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే"

శ్రీ వెల్దంత ప్రభాకరరావు

౧

భవభూతి వశ్యవాక్కు-యగుట వల్లనేమి, వాచ్యప్రధానుడగుటవల్లనేమి, కవికుల గురువగు కాళిదాస మహాకవికన్న ప్రశస్తమగు వాగ్వి లక్షణత కలిగియుండుట వల్లనేమి, యుత్తరరామ చరిత్ర మందాతడు సుస్పష్టముగా తనప్రతిభావ్యుత్పన్నతలనుగ్గడించినాడు. ఉత్తమనాటకములో నొకటిగా పరిగణింపబడిన యీ నాటకరాజ ప్రాశస్త్యముగ్గడించుటే యీ వ్యాస ముఖ్యోద్దేశము. కాళిదాసుని మనస్తత్త్వమునకు భవభూతి మనస్తత్త్వమునకు వ్యత్యాసము కలదు. కాళిదాసు శాకుంతలమందు నిష్కృష్టముగ సాహిత్యమును వడపోత గావించితినని యొజ్జలపజ్జ శిక్షింపబడినను కోవిదుల కింపుగూర్చువఱకు తన ప్రయోగ నిపుణతను నమ్మజాలనని వాకొనినాడు. భవభూతి మనస్తత్త్వము వేఱు అతడు తనగ్రంథములను ప్రస్తావించుచు మాలతీమాధవోపోద్ఘాతమున

యే నామకేచిదిహనః ప్రథయంత్యవజ్ఞాం
జానంతుతేకి మపితాం ప్రతినైషయత్నః
ఉత్పత్స్యతే మమతు కోఽపి సమానజన్మా
కాలోహ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ.

యని నిర్వచించినాడు. తన నాటకము నవజ్ఞతో లాఘవము చూపువారల కుద్దేశించిన ప్రయత్నముకాదు. త్రింశత్కోటి విస్తీర్ణమయిన యే తత్క్షోణీచక్రమున నిరవధియగు నిక్కాలమున యతని యభిరుచికి తగిన సహృదయుడొక్క-డేని యుండకపోడని, యతనివల్లనే తనజన్మ సార్థకమౌనని భావించినాడు. కాని యీనాడు భవభూతిపై పక్షపాతము, మమకారము గల సాహిత్యపిపాసువు లసంఖ్యాకము. ఉత్తమ నాటకము లైదు. అభిజ్ఞానశాకుంతలము ఉత్తర రామచరిత్ర, ముద్రారాక్షసము, మృచ్ఛకటికము అనర్ఘరాఘవము. ఈ నాటకము లందొక్కొక్క-దానిలో ప్రత్యేకవిశిష్టతలున్నందుననే యివే ప్రఖ్యాతముగా నిల్చినవి. ఇతర నాటకములున్నను వీటికి దీటైనవి కాకపోవుటవలన వాటి ప్రస్తావన యిట యనవసరము.

భవభూతివశ్యవాక్కు-. కాళిదాసు వ్యంగ్యప్రధానుడు. అనగా వాడబడిన శబ్దార్థములలో వ్యంగ్యము స్ఫురించును. భవభూతి వాచ్యప్రధానుడు. పదప్రయోగమందే వాచ్యము ధ్వనింపజేయగలదిట్టి భవభూతి ప్రస్తావన శ్లోకము భరత వాక్యము భావగర్భితములైనవి. అందులకే 'శబ్దబ్రహ్మ విదః కవేః పరిణతాంప్రాజ్ఞస్యవాణీ మిమామ్ బుధాః పరిభావయంతు' యనినాడు.

భవభూతి రచించిన నాటకములు మూడు. అందు రెండు రామాయణ గాథకు సంబంధించినవి. మహావీర చరిత్రము, ఉత్తరరామ చరిత్ర రామాయణగాథ నభివర్ణించినవి. మాలతీ మాధవము మఱొక నాటకము, ఒకప్పుడు రామాయణేతి వృత్తముతో నాటకములు రచించుట పరిపాటియైనది. భారతగాథకు సంబంధించిన నాటకములు కూడా కలవు. రామాయణ గాథకు సంబంధించిన నాటకములు పెక్కు-వెలువడినవి. మహావీర చరిత్ర, ఉత్తరరామ చరిత్ర, కుందమాల, జానకీహరణము, ప్రసన్న రాఘవము, ఉన్మత్త రాఘవము, బాలరామాయణము, ఉదాత్తరాఘవము, విచిత్రరాఘవము, అభిషేక నాటకము, ప్రతిమా నాటకము, రామాభ్యుదయము, చలితరామము, మైథిలీయము, అనర్ఘ రాఘవములీపరంపరలోనివే. అంతేగాక భాగవత గాథకు సంబంధించిన నాటకములు కూడ పెక్కు- వెలసినవి. మిగిలినవి చరిత్రాత్మకములు, సాంఘికములు. భవభూతి యుత్తరరామ చరిత్రమున నుత్తరకాండను, మహావీర చరిత్రమున మొదటి షట్కాండల గాథ నభివర్ణించెను. ఉత్తరరామ చరిత్ర ప్రాచేతసుని మూలమును యథాతథముగ వాడుకొనలేదు. పెక్కు-మార్పులు చేసి తన నాటక

మును గూలాగ్చెను. భవభూతి "సంగమే విప్రయోగాంతశ్చ" యను నానుడిని సార్థకపరచుటకు సీతారాముల సమాగమము కల్పించెను శ్రీరామచంద్రుడు సార్వభౌముడై "ముదితాయేటికి గ్రుంకితీవు మనలో మోహంబు చింతింపవే"యని వాపోవుట భవభూతికి నచ్చలేదు అందులకే యధామాతృకగా నాటకము రచింపక సీతారాముల సమాగమముతో పూరించి సభాసదులను రంజింపజేసినాడు వాల్మీకి తను చేసిన శాఖాచంక్రమణమునకు. గినియకుండ యాతనినే సూత్రధారునిచేసి మొదటిసారిగా నావామలూరు తనయుని నాటకరంగమున కెక్కించి ప్రాయశ్చిత్తము గావించికొన్నాడు. భవభూతి రసాలంబనయందు కేంద్రీకృతమై యున్నందున వాల్మీకములో లేని కొన్ని మార్పులు చేర్చి కొన్ని స్వకపోలకల్పనలను జొప్పించి తన నాటకమును విద్వన్మణులౌదల ధరింపజేసినాడు అంతేకాక ప్రాచేతనుడుకూడ యీమార్పులెట్లు ర క్తి కట్టినవో నచ్చెరువొందినాడు. రామాయణ మార్గప్రోక్తము. కాని భవభూతి మూలముకన్న మిన్న యగునటుల గావించి ప్రకృతి సిద్ధముగా దుర్ఘటమైన సీతారాముల సమాగమమును కల్పించి పుటపాక ప్రతీకాశమయిన రాముని కరుణ రసౌన్నత్యము నుగ్గడించినాడు.

పట్టాభిషేకము పిదప శ్రీరామునకు భద్రుని వల్ల లోకాపవాదము తెలిసినది. అంతకు మున్నే సీత గర్భవతిగా యుండుటవలన నామె దౌహృదములను గ్రహించి యామెను వనములకు పంపు కు నిశ్చయించెను లోకాపవాదము తెలిసిన తర్వాత యామెను వనములకుపంపుట కాకతాళీయముగా సిద్ధించినది ఉత్తర రామచరిత్రలో చిత్రప్రదర్శనము క్రొత్తగా జొప్పింపబడినది. అష్టావక్రుని రాకకూడ భవభూతికల్పనయే. అంతమున సీతారాముల సమాగమమునకు మూలకారణముగా వాల్మీకిని భవభూతి నిరూపించినాడు వాల్మీకి శ్రీరాముని సమకాలికుడు. అంతేకాక శ్రీరాముని కుమారులే తామాచార్యునివద్ద గురుశుశ్రూష ఫలితముగా సాంగోపాంగముగ స్వాధ్యాయముజేసిన రామాయణము నామూలాగ్రముగ తత్కథానాయకుని యెదుట గానముచేసినారు. రసషష్టికై శూద్రమౌనివధకుగాను శ్రీరామచంద్రుని దండకారణ్యమునకు గొంపోయినాడు అచ్చటి తమసా సమేతయగు సీతను రప్పించి యిరువురి విప్రలంభవేదన నత్యున్నతి చెందుటకు పోషించినాడు ఆ దండకారణ్య సందర్శనమాత్రముననే భస్మసంపుత మహాగ్నికణంబు మాడ్కి శ్రీరాముని హృదయగహ్వరములందు నిక్షిప్తమైన సీతా వియోగదుఃఖము పెల్లుబికినది తృతీయాంకములో యాతడు సాధించిన విజయము సమంజసమని పాఠకులుకూడ నేకీభవింతురు. అంతేగాక బ్రహ్మవిద్యావిదుడగు జనకుడు ధరణిజాతకై ప్రకృతి సహజమగు వత్సలతాప్రయుక్తమైన శోకమున మున్గుటకుగాను కొన్నిమార్పులు గావించినాడు భవభూతి యెంతటివారికైనను ప్రకృతి సహజమగు సుఖదుఃఖము లొకటేయని నిరూపించినాడు ప్రేమావధిని చక్కగా నిరూపించుటకు శ్రీరాముని ముమ్మార్లు మూర్ఛిల్లినట్లు జేసి, తిరస్కరిణీ విద్యవల్ల శ్రీరామునికి గోచరింపకయున్న సీతాపాణి పద్మ సంస్పర్శనమున పునరుజ్జీవితుని జేసి యాతని కాశావాదముపై విశ్వాసము కల్గించినాడు 'అంగేనాంగంపుతను తనునాగాఢతప్తేనతప్తం' పరిస్థితులలో నున్న సీతారాములకు తృతీయాంకమున మళ్ళీ సమాగమము కలుగుసూచన ధ్వనించుచున్నది కొందఱార్షప్రోక్తమగు రామాయణగాధకు మార్పులు చేయుట యపచారమని తలంచుభక్తులుకలరు. కాని భవభూతి సాహసించి యధార్ధముగాని సీతారాముల సమాగమము చేకూర్చవలెనని తలంచి వాల్మీకికి ప్రతిసృష్టిచేసి నా వామలూరు తనయునిచే తన నాటకమును పూరింపచేసి దిగ్విజయము పొందినాడు వాల్మీకి సీతకు ప్రాణరక్షగా యుండెననునది నిర్వివాదాంశము. అంతేగాక నుత్తర కాండమున సీతారాముల క్షణ సమాగమమునకు కారణభూతు డయ్యెను. ఆ సదవకాశమును వినియోగించుకొని సీత సాధుచరిత్రయని చాటుటకాతని నుపయోగించుకొనెను.ఇదికొందఱికసంగతముగా గన్పట్టినను

రస సిద్ధాంత సమంజసముగా నున్నది వాల్మీకి కన్న కరుణరస పోషణలో మిన్న యనిపించుటకుగాను యీమార్పులను గావించి 'ఏకోరసః కరుణఏవ. యని యెల్గెత్తి శంఖారావము గావించినాడు. ఈ రసవాదమును చర్చింపవలె నన్న ప్రత్యేకమగు వ్యాసము వ్రాయవలసి యుండును ఉత్తరరామాయణమందు భవభూతి ప్రతిపాదించి మెప్పించినది కరుణరస సిద్ధాంతమే దీనివల్లనే 'ఉత్తరేరామచరితే భవభూతిర్విశిష్యతే' యను నా భాణకము ప్రచారము లోనికి వచ్చినది.

కాళిదాసుయొక్క భవభూతియొక్క మనస్తత్వములను' సర్ ఆర్థర్ బెరిడెల్‌కీత్ చక్కగా పరిశీలించినాడు భవభూతి కాళిదాసుకన్న మిన్నయని సప్తమాంకమున తేలినది. కాళిదాసు భోగలాలసుడు. భవభూతికి స్వార్థత్యాగము స్వతస్సిద్ధము. ఆధ్యాత్మక తత్త్వచింతన మెందు శకుంతలా దుష్యంతుల సమాగమము కన్న సీతారాముల సమాగమము చక్కగా రక్తి కట్టినది సీతారాములు లోకపాలకులు శకుంతలా దుష్యంతులకన్న వీరి కనుభవ మెక్కువ అంతేగాక వీరు జగత్సృష్టి కారకులు రాముడు సీతను లోకాపవాదమునకు వెఱచి వదలిపెట్టినప్పుడు సీత యతని పరిస్థితిని గ్రహించి జాలిపడును, ఏలనన ప్రభువులకు ప్రజారంజనము ధర్మము. రాముడు నిరపరాధియని యెరుగును కాళిదాసునకు భావగాంభీర్యము లేదు. భవభూతి కాళిదాసుల తారతమ్య పరిశీలన చేయునపుడు గ్రీకు నాటకకర్తలగు ఈస్కైలస్ మరియు యురిపిడీస్ జ్ఞప్తికి వత్తురు వారిరువుర కున్న తారతమ్యమే వీరిరువురిది కాళిదాసు రాజసమ్మానము పొందిన కవి భవభూతి ప్రతిభ కల్గియుండియు రాజ సన్మానము లేక కేవలాధ్యాత్మ చింతతో శ్రీ రామ హృదయమును చక్కగా వ్యక్తీకరించినాడు. భవభూతి జీవిత దృక్పథమున 'సమాగమమున కేదో విచిత్రమగు యాంతరంగిక బంధము.అది బాహ్యపరిస్థితులపై నాధారపడిన వాత్సల్యముకాదు. చంద్రునిచూచి చంద్రకాంత శిలద్రవించుట, సూర్యుని జూచి పంకజము వికసించుట స్వతస్సిద్ధమే' గదా.

కాళిదాసుని శైలికన్న భవభూతి శైలి విలక్షణము. 'ప్రౌఢత్వం ఉదారతాచవచసాం' యని చెప్పుకొన్నాడు దీనిని తన నాటకములందు సార్థక పరచుకొనినాడు. అంతేగాక యీతడు గొప్ప మీమాంసవేత్త.

ఉత్తరరామ చరిత్రగాధ సంక్షిప్తముగా నిందు పొందుపరచుచున్నాను జనకుడు మగుడ మిథిలా నగరమునకు వెళ్ళిపోయెను సీత తన గురుజనులు వీడిపోవుటచే చింతావ్యాకుల మానసయై యుండెను. రాముడామె నూరడించుచుండెను. వసిష్ఠుడు రామునకు సందేశము పంపెను. సీత గర్భదౌహృదములను తీర్చవలసినదని ప్రజారంజకముగ రాజ్యమేలమని వాంఛించెను. లక్ష్మణుడు అర్జునుడను చిత్రకారుడు తెచ్చిన చిత్రపటమును తిలకించమని సీతారాముల కోరెను అట్లే యా ముగ్గురు చిత్రపటమును సూక్ష్మముగా పరిశీలించుచుండిరి. వారు దండకాటవిలో యనుభవించినదంతయు ప్రత్యక్షముగా కన్నులకు కట్టినట్లు దర్శనీయ మగుచుండుట వల్ల 'ప్రత్యావృత్తస పునరివమే జానకీవిప్రయోగః' యని 'హంత వర్తమాన ఇవమే జనస్థానవృత్తాంతః' యని రాముడు వ్యాఖ్యానించెను జానకి యలసి నిద్రించెను. ఇంతలో దుర్ముఖుడను వేగులవాడు ప్రజలు సీతాదేవి పాతివ్రత్యమును శంకించుచున్నారని తెలియజేయును. అందుకు రాముడెంతో బాని పడి సీతను వనమందు వదలిరమ్మని శాసించెను

రెండవ యంకములో నాత్రేయిని యను యోగిని, వాసంతియను వనదేవతతో సంభాషించుచుండెను. రాముడశ్వమేధ యాగము చేయుచున్నాడనియు,వాల్మీకి కిశోరద్వయమును పెంచుచున్నాడనియు తెలియజేసెను రాముడు కోదండపాణియై శంబూకుడను వృషలమునిని చంపుటకు దండకారణ్యమునకు వచ్చెను. ఆ దండకారణ్య పావనభూములను స్మరించుచు గత స్మృతులతో నుక్కిరిబిక్కిరి యయ్యెను. ఈ రెండవ యంకమందే రామాయావతరణ

గాథకూడ నాత్రేయీ వాసంతీ సంభాషణవల్ల పాఠకులకు తెలియజేయబడును

మూడవ యంకమున తమసా మురళాయను నదులు సంభాషింతురు శ్రీరామునికి దూరమైన సీత ప్రాణత్యాగము చేయునదే కాని యామెను రక్షించి, లవకుశులను విద్యాబుద్ధులు గరుప వాల్మీకి కొసంగెను. సీత దేవతారూపమున తమసా సహాయమున తిరిగి దండకారణ్యమునకు వచ్చెను. రాముడుకూడ యచ్చటికే తెంచెను సీతాదేవికి రాముడగుపించునే కాని రామునికి సీత కనపడదు. సీత రాముని చూచి మూర్ఛిల్లెను మళ్లీ సేదదీరి మూర్ఛనొందిన రాముని తన హస్తస్పర్శచే పునరుజ్జీవితుని చేసెను ఇట్లే ముమ్మారు రాముడు మూర్ఛపోవుట సేదదీరుట జరిగెను అంతమున సీత వెడలిపోయెను. ఆ యంకమున రాముడు వాసంతితో సంభాషించు చుండగా, సీతపై యాతనికున్న యనురాగము, స్నేహభావము చక్కగా, నిరూపింపబడగా, సీతకూరట కల్గి రామభద్రుడు ప్రజారంజనకుగా నట్లుజేసె కాని వేఱుకాదని నిశ్చితాభిప్రాయమునకు వచ్చెను. సీత వెళ్ళిపోవును.

నాల్గవ యంకమున కౌసల్య, జనకుడు కలియుదురు. వారుభయులు పరస్పర కుశలప్రశ్నము జరుపునపుడు తమనే మరతురు. జనకుడు 'ఈ ప్రజాపరిపాలకుల తల్లిగారి కారోగ్యమా' యని కౌసల్యను తూలనాడెను. లవుడువచ్చి జనకాదులకు ప్రణమిల్లెను.

పంచమాంకమున లవునకు చంద్రకేతువుకు జరిగిన యుద్ధమభివర్ణింప బడినది షష్ఠాంకమున చంద్రకేతువు లవుడుపయోగించు దివ్యాస్త్రముల పద్ధతి వర్ణింపబడినది. ఇంతలో రాముడు వచ్చి యా పోరాటమును నిలిపివేయును రాముడు లవుని ధైర్యసాహసములను ప్రశంసించును అతడు రామునికి దివ్యాస్త్ర శస్త్రములు తమంతటనే సంక్రమించినవని తెల్పెను. ఇంటిలో కుశుడు భరతాశ్రమము నుండి మరలివచ్చును

సప్తమాంకమున వాల్మీకి రచించిన కరుణరస ప్రధానమగు నాటక మప్సరసలతో నటింపబడును. అందు సీత గంగతో లీనమగును. మరల భూదేవి సహాయముతో పైకివచ్చును. భూదేవి శ్రీరాముని దూషించును, గంగ క్షమించును. రాము డీ నాటకమును చూచి నిజమని మూర్ఛిల్లును. హఠాత్తుగా సీతా సహితయై యరుంధతి వచ్చి,సీతాపాణి పద్మ సంస్పర్శతో శ్రీరాముని మూర్ఛనుండి తెప్పరిల్ల జేయును. వాల్మీకి కుశలవులను సీతారాములను సమర్పించును. భరతుడు లవణేశ్వరుని చంపి తిరిగి వచ్చును. ఇంతటితో వాల్మీకి నాటకమేగాక భవభూతి యంతర్నాటకము శుభాంతముగా సుఖాంతముగా ముగిసెను.

చందాదారులకు వినతి

"నవభారతి" ప్రారంభించబడి ఈ నెలతో అర్ధసంవత్సరము పూర్తి అయింది. ఇంతవరకు మాకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియ జేస్తున్నాము.

ఇంతవరకూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందా సొమ్మును పంపి, యధాతధంగా తమసహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మేనేజరు, నవభారతి

కఠోపనిషత్తు

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

ద్వితీయాధ్యాయము: ప్రథమవల్లి

ఈశ్వరుండు శబ్దాదుల కింద్రియముల
నభి ముఖమ్ములుగాఁ జేయ నవియు నాత్మఁ
గాంచలేవ ముముక్షు వౌజ్ఞాని వాని
మరలిచిన పైనిగాంచు బ్రహ్మంబు నెపుడు.

అజ్ఞులీ బాహ్యకామంబు లభిలషించి
వితత సంసార పాశ సంహతులఁ దగులు
కొందు; రది కారణముగఁ బ్రాజ్ఞుండు ముక్తి
నిత్యమని నమ్మి లోఁగాడ నిత్యములకు.

శబ్ద రస రూప గంధముల్ స్పర్శభోగ
ముల సకల జీవు లాత్మచేఁ దెలియఁగందు,
రనుట నిజ మాత్మచేఁ దెలియంగ రాని
దొకటి లే;దది పరమాత్మయొక్క రూపు.

స్వప్న జాగరితాంత విషయములెల్ల
జ్ఞానరూప మౌనే యాత్మచే నెఱుంగు
నది ఘనమ్ముగ సర్వదిగ్వ్యాపకముగ
కృతమతి యెఱింగి శోకోపహతుఁడుగాడు.

కర్మఫలమొందు జీవాత్మఁ గాలములకు
నీశుగా సమీపస్థుగా నెఱుఁగునతఁడు
తన కభయమేమి కోరు? నంతయును దాను
గనె యెఱుంగునాతఁడెయాత్మయని తెలియుము.

ఎవఁడు బ్రహ్మమునుండి తానెల్లభూత
ములకు ముందుగఁబుట్టి జీవుల హృదంత
రాళములఁజొచ్చి వానియందే లయించు
నట్టులుగఁదోచు నతఁడె వోయాత్మయనఁగ.

అదియ దేవతారూపిణి, యదియ యదితి,
భూతములతోడ నజుతోడఁబుట్టిన దది,
సకలభూత హృదంత రస్థమయియుండు
నదియ నీవు నన్నడిగిన యట్టియాత్మ.

గర్భిణీ స్త్రీలయందుండు గర్భమట్లు,
అరణులందుండి ప్రతిదినమందు హవ్య
ముల నొసంగు జనంబుచే బొగడఁబడెడు
నగ్నియే నీవడిగిన బ్రహ్మమ్ము సుమ్ము.

ఎవనినుండి సూర్యుండుదయించు నస్త
మించు నెవని నెవ్వరతిక్రమింప లేరొ
అఖిలదేవత లెవ్వనియందు నుందు,
రా హిరణ్యగర్భుండె బ్రహ్మము సుమ్ము.

ఇచట గలిగినయట్టిద యచట గలుగు
నచటఁగలిగినయట్టిద యిచట గలుగు.
తన్ను బ్రహ్మము వేఱుగా దలచువాడె
జననమరణాది సంసారమున నశించు.

బ్రహ్మము మనంబుచేతనే పడయదగును
బ్రహ్మమందు భేదము కానరాదొకింత
ఎవడు బ్రహ్మమందును భేదమెపుడు సూచు
నతడు సంసారపంక మగ్నత నశించు.

పురుష డంగుష్ఠమాత్రుడై వరలు హృదిని
నతడె మూడుకాలముల నియామకుండు
దీనినెఱుగ భయపడడు దేనినుండి
అతడె నీవు నన్నడిగిన యట్టియాత్మ.

పురుష డంగుష్ఠమాత్రుండు, పొగయలేని
పావకుండు, కాలత్రయ ప్రభుడు ప్రకృత
మున్నవారి యందికపు నందు నుండువారి
యందు నుండెడినాడు బ్రహ్మమగువాడు.

పర్వతాగ్రాన వర్షించు వర్షజలము
పర్వతాధః ప్రదేశాన బరచు రీతి
నాత్మకును భిన్నధర్మంబు లఖిలతనువు
లందు గనువాడె జన్మంబులందు వాడు.

నిర్మల జలంబులను గూడి నిర్మల జల
మధిక నిర్మల మగునట్టు లరసిచూడ
అధిక మనన శీలుం డగునట్టి జ్ఞాని
యాత్మ కడు నిర్మలంబయి యలరుఁ జూవె.

ద్వితీయవల్లి

పదునొకండు ద్వారంబుల పట్టణమున
నధి వసించు నజంబేక మాత్మఁ గొలిచి
పండితుడు శోకమొందడు, పడయుముక్తి
అదియ నీ వెఱుంగ దలంచి నట్టియాత్మ.

అర్కుడకలంకు డంతరిక్షా నిలుండు
అవధి గృహమునందున వేదియందు నగ్ని
అద్రి గో ఋతాబ్జుండు బృహద్వమందు
వ్యోమ సుర నర ఋతములందుండు నాత్మ.

హృదయ కమలమ్ము నందున నున్నవాని
ప్రాణమును నూర్ధ్వమునకు నపాన మరుగు
భాగమునకుఁ బొందించు నప్పరము నాత్మ
సకల దేవతలను నుపాసన మొనర్తు.

దేహ మందుండు నాత్మ యీ దేహ మందు
నుండియు వెడలి పోవుచునుండు నప్పు
డింక నీ దేహమునయందు నేమి మిగులు
అదియ నీ వెఱుంగగఁ గోరినట్టి యాత్మ.

ప్రాణమున నపానంబునఁ బ్రాణికోటి
బ్రతికియుండుట లే దాత్మవలన బ్రతుకు
ప్రాణమును నపానం బనారతము గాగ
నాత్మ నాశ్రయించును దేహమున నుండు.

గౌతమా, బ్రహ్మమును నెఱుంగని కతమున
జనన మరణంబు లొందెడు జనము నిందు
అట్టి ప్రాచీనమును గుహ్యమైన యట్టి
బ్రహ్మమును గూర్చి నీకు చెప్పంగ వలతు.

పూర్వ జన్మంబులను జేయు పుణ్యపాప
కర్మముల బట్టి జ్ఞాన మార్గమున బట్టి
యొక్క కొందఱు పరజన్మ మొందుచుంద్రు,
అన్యులకు నగు తిర్యగ్జడాది జన్మ

ఇంద్రియములు నిద్రింపగా నెల్లకోర్కె
లను సృజించుచు నెవడు మేల్కనియయుండు
నతడె శుద్ధుండు బ్రహ్మము నమృతుడగుట
నఖిల జగములు నాతని నాశ్రయించు.

అగ్నిలోకంబునం జొచ్చి యఖిల కాష్ఠ
ములఁ బ్రవేశించి పెక్కురూపులగు నట్లు
ఆత్మ లోపలవెలుపల నంతనిండి
రూప రూపంబులకుఁ బ్రతిరూపమొందు.

అనిలమది జీవకోటుల యందడంగి
తనువులకుఁ బ్రతిరూపము దాల్చునట్లు
ఆత్మ లోపలవెలుపల నంతనిండి
రూప రూపంబులకుఁ బ్రతిరూపమగును.

విశ్వచక్షువు రవి యపవిత్రములను
గాంచినను గాని దోషమ్ముగాంచనట్లు
అఖిల భూతాంతరస్థమైనట్టి యాత్మ
దుఃఖమొంద, దనాత్మ తాదుఃఖమొందు.

అద్వయు న్వశి సర్వభూతాంతరాత్మ
నొక్కడై పెక్కురూపుల నొప్పువాని
హృదయ సంస్థితుడగు నాత్మనెవడు సూచు
అతనికగు నిత్యసుఖము, లే దన్యులకును.

ఒక్కడును, నిత్యులందు నిత్యుండు, చేత
నులను జేతనుడున్, కర్మఫలమొసంగు
వాని హృదయస్థు నెవ్వండు కానగలడొ
యతనికగు నిత్యశాంతి, లేదన్యుల కది.

పలుకుల వచింపగారాని పరమసుఖము
ఎయ్యదియొ అది ఇది యనియె తలంత్రు
అదియు వెల్లెడినో లేదొ, అను నుదంత
మే ప్రకారమ్ముగా మన కెఱుగ నగును?

దాన విద్యుత్తపన చంద్రతారకములు
వెలుగ జాల వగ్నియునింక వెలుగు నెట్లు
అఖిలము వెలుంగు దానినే యనుసరించి
వెల్గులెల్ల నా వెల్గున వెల్గుచుండు.

తృతీయవల్లి

ఆత్మ మూలము, స్వర్గాదు లఖిలశాఖ,
లది సనాతన మశ్వత్థ, మధికశుద్ధ,
మమృత మనతిక్రమంబు బ్రహ్మంబు నాగ
నెల్ల లోకంబు లందావహించి యుండు.

అల్పమగు నీ జగంబు బ్రహ్మంబునుండి
వచ్చు. బ్రహ్మముగని భయంపడును. బ్రహ్మ
మెత్తఁబడు వజ్రముంబోలె నెంతొ భయద
మాత్మ నెఱ్గు వారలె మోక్షమందు వారు.

పావకుడు దహించును దాని భయమువలన
భాస్కరుడు వెలుంగును, దాని భయమువలన
అనిలుఁడింద్రుండు మృత్యువీ యైదుగురును
దీనిభయమువనే ప్రవర్తిల్లుచుంద్రు.

దేహపాతంబునకు ముందు దీని దెలియ
శక్తుడునుగాని మనుజుండు సర్వగతుల
క్ష్మాతలంబాదిగాగ లోకములయందు
బుట్టుచుం గిట్టుచున్ మఱి బుట్టుచుండు.

అద్దమందున వలె బుద్ధియందు, స్వప్న
మందువలె పితృలోకంబునందు జలము
లందువలె స్వర్గమందు, ఛాయాతపములు
గా గనంబడు బ్రహ్మలోకమున నాత్మ.

వేఱుగాబుట్టి వేఱు వెలయు నింద్రి
యములకే యుదయాస్తమయములు గాని
ఆత్మకును లేవటంచు దానాత్మ నెంచు
పండితుండింక శోకంబుఁ బడయడెందు.

ఇంద్రియములకంటెను మనంబే ఘనంబు,
మనముకంటె బుద్ధిఘనంబు. ఘనము బుద్ధి
కంటె మహదాత్మ, మహదాత్మకంటె ఘనము
అల్ల నవ్యక్తమనుచు నీయాత్మ నెంచు.

ఎవ్వని నెఱింగి మానవుండెల్ల బంధ
ముల దొలఁగి మోక్షంబును బొందగలడొ
అతడె యవ్యక్తమునకంటె నధికు డగును
పరుడు భవరహితు డఖిలవ్యాపకుండు.

ప్రత్యగాత్మ రూపము గోచరంబు కాదు,
కనులచే జూతమన్నను గానరాదు,
మనన రూపమౌ బుద్ధిచే గాననగును
దాని నెఱిగి మోక్షమునొందు మానవుండు.

ఎప్పుడు మనంబుతోడ జ్ఞానేంద్రియములు
నిశ్చలంబుగ నాత్మయందే వసించు
బుద్ధి యెపుడొందు వ్యాపారములఁ దొలంగు
నదియె పరమగతి యటందు రఖిలమునులు.

ఇంద్రియములు నైశ్చల్యమ్ము నొందుటయునె
యోగమని పండితులు నెంచుచుందు రెపుడు
దేమానవుండప్పు యప్రమత్తుడగును
యోగమున మంచియగు, చెట్టయును నశించు

మనసుచే వాక్కుచేతను కనులచేత
నాత్మఁ బొందుటకేమి శక్యంబుకాదు,
కలదనెడు వానికయ్యది కాననగును.
లేదనెడు నాస్తికుఁడెట్లు చూడగలడు?

ఉండెనా లేద యనియెడు నుభయములను
తత్త్వభావమ్ముచే నున్కి తానిజమ్ము
ఉండెనని నిశ్చయము నొందియున్న యట్టి
పురుషునకె తత్త్వభావంబు బోధపడును.

ఎపుడు బ్రహ్మజ్ఞు హృదినాశ్రయించి యున్న
యెల్లకామంబులును నశియించి పోవు
నచటనే బ్రహ్మభావంబు నతడుపొందు
నప్పుడే యమృతత్త్వంబు నాతడందు.

తాను జీవించియుండిన తరుణమందు
హృదయ గ్రంథులెపుడు నశియించిపోవు
నపుడె మర్త్యుఁ డమర్త్యుండునై తనర్చు
దీనినే సర్వతత్త్వోప దేశమంద్రు.

పురుషు నంగుష్ఠమాత్రుని భూతహృదయ
వాసు గడ్డినుండి పరక తీసినట్లు
తనువునుండియు వేఱుగ గొనగవలయు
వానినే శుద్ధబ్రహ్మముగా నెఱుంగు.

హృదిని నూటొక్కనాడులు వొదలుచుండు
నందుల సుషుమ్న మూర్ధమునంటబోవు
దాన నూర్ధ్వగతుఁ డమృతత్త్వంబుఁ బడయు
నితరనాడుల బో వేఱు గతులుగలుగు.

అంత కోక్తమౌ బ్రహ్మవిద్యను సమధిక
యోగమున నచికేతుండు తాగ్రహించి
అనఘుడై మృత్యురహితుడై యాత్మఁజెందె
అన్యుడు నెఱుంగనట్లె బ్రహ్మత్వ మొందు.

మృత్యుముఖంలో తుదిరోజు

విక్టర్ హ్యూగో

అనువాదం : శ్రీ రెంటాల గోపాలకృష్ణ

౨

7

నిజంగా ఇవాళ, ఇక్కడ నేను వ్రాస్తున్న విషయం ఏనాడో-ఒకనాడు ఇతరులకు ఉపయోగపడుతుందా? నావంటి విరథులు, విపథులు, విచలితులు, నేరస్థులు అయినవారి విషయంలో తీర్పు ఇచ్చేటప్పుడు న్యాయమూర్తులను ఆలోచించేటట్లు చేస్తుందా? ఆఁ, పిచ్చి! ఎందులకూ? దేనికోసం? ముందు నాతల నరుకుతున్నారుకదా? నేను పోయిన తరువాత ఎవరు ఏమైపోతే నాకేమీ? ఆ తరువాత ఎవరిని ఉరితీస్తేమాత్రం నాకేమిటి సంబంధం? ఏమిటి! నేను ఈఅల్పమైన విషయాలను గురించి ఆలోచించడమేమిటి? ముందు నేను ఉరికంబం ఎక్కి తరువాత దానిని కూలద్రోయనా! ఎంత అవివేకం! దానివల్ల నాకు ఒరిగేదేమిటని?

ఏమిటీ? లోకాన్ని తన వెలుగుతో దీప్తివంతం కావించే సూర్యభగవాన్లు, ప్రాణికోటిని చైతన్యంలో ముంచెత్తే ఋతురాజు వసంతుడు, పచ్చని పొలాలు పరిమళ భరితమైన పూలవనాలు, ప్రభాత గీతికలు ఆలాపించే శకుంత సంతానం, అఖిల జగత్తునూ, జాగృతంనేసే అరుణోదయం, అంబరం చుంబించే గిరిశిఖరాలు తల్లడిల్లే ప్రాణిని తల్లివలె సేదతీర్చే తరునికరాలు, స్వేచ్ఛ, సుఖం, తీయని బ్రతుకు ఇవన్నీ ఇహ నాకు లేనట్లేనా! వీటికీ - నాకూ రుణం తీరినట్లేనా!

అయ్యో పరమేశ్వరా! నన్ను నేను కాపాడుకోవాలి, నా ప్రాణాలను నేనే కాపాడుకోవాలి! కాని అది సాధ్యం కానట్లేనా? రేపు ఉదయం-లేక ఇవాళనే నేను ఊపిరి విడువవలసిందేనా? అయ్యో, భగవంతుడా! ఎంతపని చేశావురా తండ్రీ! ఆ మాట అనుకుంటే గుండెలు గుభిల్లుమంటున్నాయే! నా తల ఈ జైలు గోడలకు వేసి పగుల గొట్టుకోవాలనిపిస్తున్నదే!

8

ఉండండి! ఒక్కక్షణం ఊపిరిపీల్చుకోనివ్వండి! ఒక్కతడవ ఆలోచించుకోనివ్వండి-ఈ భూమిమీద నాకింకా ఎంత కాలం బత్తెపుగింజలున్నాయో లెక్క వేసుకోనివ్వండి!

శిక్ష చెప్పిన తరువాత, పై కోర్టులో 'అప్పీలు' దాఖలు చేసుకోడానికి మూణ్ణాళ్ళు, 'అసైజు'కోర్టులో వారంరోజులు గడువిచ్చారు గడువుతీరిన తరువాత. నాకేసుకు సంబంధించిన రికార్డంతా పైనఉన్న మంత్రిగారికిపంపించారు.

ఆ మంత్రిగారి కార్యాలయం అంతా అధ్వానం - చతుర్మధ్యంగా ఉంటుంది. ఏ కాగితం ఎక్కడున్నదో, ఏ కేసు ఎన్నాళ్ళుపడుతుందో నర - మానవుడికి తెలియదు మంత్రులతో వ్యవహారం అంతేమరి. సరే అధమం ఒకపక్షంరోజులయినా నా రికార్డు అక్కడ పడేసి

పెడతారు. ఆ పైన, కేసు యావత్తూ శల్యపరీక్ష చేసి పై కోర్టుకు పంపిస్తారు. ఇహ అక్కడ కావలసినంత తతంగం ఉండనే ఉంది—కేసు ఏ తరగతిక్రిందికి వస్తుందో విభజించడం, తమ రికార్డులో కేసును నమోదుచేసుకోడం, రిజస్టరీచేయడం ఈ వ్యవహారమంతా మామూలు ప్రకారంజరుగుతుంది కనుక అధమ పక్షం ఒక పక్షం రోజులు అక్కడా పడుతుంది.

చిట్టచివరకు కోర్టువారు తమ రివాజు ప్రకారం ఏదో ఒక గురువారం నాడు సమావేశమవుతారు నా కేసు తాలూకు వాదనలు, ప్రతి వాదనలు - అన్నీ పరిశీలించి అన్నింటినీ, ఒక్కమాటే త్రోసిపుచ్చుతూ తిరిగీ, ఉరితీయమనే ఆ ఉత్తర్వును మంత్రిగారికి పంపుతారు ఆయనగారు దాన్ని 'అటర్నీ జనరల్'కు అందజేస్తాడు. అటర్నీ జనరల్ 'తిరిగీ ఆ ఉత్తర్వును తలారివాడికి పంపిస్తాడు.

ఇదంతా మూడురోజుల్లో ముగుస్తుంది. నాలుగవ నాడు ఉదయం డిప్యూటీ అటర్నీ జనరల్ మెడలో పటకా సవరించుకుంటూ వస్తాడు

"ఇహ ఈ కార్యాన్ని ముగించి వెయ్యాలి" అంటాడు 'ఇహ దాంతో కోర్టు గుమాస్తాపచ్చిగంగ అయినా పుచ్చుకోకుండా, పల్లెత్తుమాట అయినా మాట్లాడకుండాకూచుని, బరబర 'ఉరికి ఉత్తర్వు' వ్రాస్తాడు. దాన్ని మళ్ళీ తుడుపులు కొట్టివేతలు లేకుండా సాపు వ్రాస్తాడు అంతా ముగించి ఇహదాన్ని, తలారివాడికి పంపిస్తాడు ఇంకేముంది? ఆ మరునటిరోజు కరకర ప్రొద్దుపొడిచే టప్పటికి 'డ్రగేవ్'లో (ఉరితీసే ప్రదేశం) కమ్మరివాడి సమ్మెట దెబ్బలు చెవులు గింగురులెత్తేటట్లు వినవస్తాయి. నా కంఠం తెగవేసే గండ్రగొడ్డలి బయటికి తీస్తాడు తలారివాడు. ఎర్రగుడ్డచుట్టి ఎదురుగా పెడతాడు మాదిగవాళ్ళు తప్పెట్లు వాయిస్తూ, నగరపు నడి వీధులలో తిరిగి కరోరకంఠంతో అరుస్తూ చాటింపుచేస్తారు. ఈవార్త అందరికీ తెలుస్తుంది ఈతతంగం అంతానూ ఆరు వారాల్లో ముగుస్తుంది! ఆ అమ్మాయి ఎవరో కాని-లెక్క వేసినట్లు సరిగ్గా చెప్పింది 'ఆరువారాల్లో అతని తలతీస్తా'రని సరే - కాకపోతే అయిదువారాలే పట్టవచ్చు అయిదు అయితేనేం, ఆరు అయితేనేం? నాచావు ఖాయం!

9

నేను ఇప్పుడే నా మరణ శాసనం వ్రాసుకున్నాను

కాని ఏమిటి ప్రయోజనం? అరి, భగవంతుడా! నాకు ఏమున్నది కనుక వీలునామా వ్రాయడానికి? నా సర్వస్వం అపరాధం క్రింద చెల్లించవలసిందిగా కోర్టువారు తీర్పు ఇచ్చారే!

కన్నతల్లి, కట్టుకున్న భార్య, కన్న కూతురు-ఈ ముగ్గురినీ భూమిమీద విడిచి పెట్టి వెడుతున్నాను నేను.

నా కుమార్తెకు, నా చిట్టితల్లికి మూడోఏడు ముద్దులు మూటకడుతూ ఉంటుంది నా చిట్టితల్లి ఎర్రగా, గులాల కుంకుమ చల్లినట్లు ఉంటుంది నా బంగారు తల్లి. ముట్టుకుంటే కందిపోతుంది చెంపకు చారడేసి కళ్ళు. నల్లగా, ఎంత కళగా ఉంటాయని! వంకులొంకులు తిరిగిన గోధుమరంగు జుట్టు. బారెడు పొడు

గున, పట్టుకుంటే చెయ్యి అరపకుండా ఉంటుంది!

అప్పటికి, నా చిట్టితల్లికి రెండేండ్లూ వెళ్ళి మూడోఏడు జొరబడి మాసంరోజు లయింది అదే నేను చివరసారి చూడడం.

అంచాత నేను చనిపోయిన తరువాత ముగ్గురు ఆడవాళ్ళు అనాథ లయిపోతారు కొడుకును కోలుపోయిన స్త్రీ, భర్తకు నోచుకోని స్త్రీ, తండ్రిలేని స్త్రీ- మొత్తం ముగ్గురు స్త్రీలు. ధర్మశాస్త్ర ప్రకారం నిర్వచించవలసి వస్తే నిజానికి ముగ్గురూ విధవలే. ముగ్గురికీ మూడు రకాల విధవరికం వస్తుంది!

నేను చేసిన తప్పుకు నన్ను శిక్షించారు. ఇది న్యాయమే నేను అంగీకరిస్తాను కాని, మరి ఈ అమాయకుల మాట ఏమిటి? అశుభమూ-శుభమూ ఎరుగరే-ఈ ముగ్గురూ ఏం నేరం చేశారని వాళ్ళకి శిక్ష? ఏమైనప్పటికీ ఈ ముగ్గురు ఆడవాళ్ళ బ్రతుకూ ముక్కచెక్క లయిపోయింది నిండు జీవితాలు మూడూ ధ్వంసమై పోయాయి ఇదీ న్యాయం!

మూడుకాళ్ళ ముసలి నాతల్లి ఆమెగారిని గురించి నాకు ఏచింతాలేదు. అరవయి నాలుగేండ్ల వృద్ధురాలు ఆమెగారు కన్నకొడుకును ఉరితీశారని విన్న మరుక్షణంలో ఆతల్లి గుండెపగిలి కన్ను మూస్తుంది, నాకు తెలుసు పోనీ ఒకవేళ జీవించిఉన్నా, ఆ దిగులుతో మంచం పట్టి. కృశించిపోయి కొద్దికాలానికే అసువులు వీడుతుంది ఆ బ్రతికిన నాలుగునాళ్ళయినా ఆమెగారు చెప్పేదీ లేదు, చేసేదీ లేదు

పోతే నాభార్య విషయం కూడా నాకు అంతగా పట్టలేదు. ఆవిడ అసలే అర్భకురాలు. వంటి ఊపిరిమనిషి ఎప్పుడూ ఏవో రోగాలతో-పుల్లలా అయిపోయింది అంచాత ఈవార్తవిన్న ఉత్తరక్షణంలోనే ఆవిడా ఊపిరి విడుస్తుంది. లేదా పిచ్చిదైనా అయిపోతుంది. నాకు బాగా తెలుసు అందరూ ఇదే అంటున్నారు కూడా ఆవిడ బ్రతికిఉన్నా చచ్చినదానికింద జమే. నోట్లో నాలుకలేని వెర్రిబాగులది

ఇహ నాకు పట్టుకున్న దిగులల్లా నా చిట్టితల్లి-మేరీని గురించే. పలకరిస్తే చాలు కిలకిల నవ్వుతుంది, ఆడుకుంటుంది ఈ పాటికి వచ్చీ-రాని మాటలతో పాడుతుంటుంది లోకం అంటే ఏమిటో ఎరుగని నా చిన్నారిపాప-మా అమ్మడు-మేరీ మేరీ నా పంచప్రాణాలు ఆపిల్లగతి ఏమవుతుందో అన్నదిగులే-ఈ తుదిక్షణాలలో నన్ను మరింత క్రుంగదీస్తున్నది.

10

ఇది నేనున్న జైలుగది ఎనిమిది చదరపు అడుగుల వైశాల్యం నాలుగు ప్రక్కలా నాలుగు రాతిగోడలు

గదిలో కాలు పెట్టగానే కుడిచేతివైపున ఐమూలగా ఉన్న ప్రదేశం ఒకటి అగుపిస్తుంది అక్కడ గడ్డిమోపు ఒకటి పడేసి ఉంటుంది. ఖైదీ అయినవాడు ఆ గడ్డిమోపుమీదనే కూచోవాలి విశ్రాంతి తీసుకోవాలి పడుకోవాలి. దానిమీదనే, నిద్రకూడా పోవాలి! ఖైదీ ఒక ముతక లాగు ఒక కాకీచొక్కా తొడుక్కోవాలి శీతాకాలంకానీ వేసవికాలంకానీ, అన్నివేళలా అతనికవే దుస్తులు. ఇహ గదిలోకూచుని తల ఎత్తిచూస్తే, పైన ఆకాశమయినా అగుపించదు పైకప్పు అంతా ఆర్చీలుతీర్చి ఉంటుంది. ఆర్చీల

మూలమూలల్లో సాలెగూళ్లు అల్లిబిల్లిగా అల్లుకుని ఉంటాయి.

ఇహ గదికి వేరేకిటికీ అన్నమాటలేదు కనీసం గవాక్షికూడా లేదు గదికి ఒక తలుపు, దానికేమో ఇనుప రేకులు కొట్టారు.

అహా! ఉండండి, పొరపాటుచెప్పాను. ఆ తలుపుమధ్యన, కొంచెం పైభాగంలో తొమ్మిది అంగళాల చతురంకల ఒక రంధ్రం ఉన్నది. దానికి ఇనుపకమ్మీలు, ఒకచిన్న రేకుతలుపు ఉన్నాయి. రాత్రి పూట కాపలావాడు దానిని కూడా మూసివేసి వెలుపలతాళం వేస్తాడు

గది అవతల ఒక పొడుగాటి నడవ ఉన్నది నడవకు అతట్టూ ఈ తట్టూ ఎత్తయిన గోడలున్నాయి గోడల పై భాగం లో ఉన్న చిన్న చిన్న రంధ్రాలద్వారా నడవలోకి బాగా గాలీ వెలుతురూ వస్తాయి. ఈ నడవకు మళ్ళీ మధ్య మధ్య రాతిగోడలు కట్టి గదులు గదులుగా విభజించారు గదులన్నీ ఒకదానినొకటి అనుకుని ఆర్చీలు తీర్చి ఉన్నాయి. నడుస్తుంటే ఈ ఆర్చీలకు తల తగులుతూ ఉంటుంది ఈ గదులన్నింటికీ ఒక్కొకదానిని అనుకుని ఒక్కొక్క జైలుగది - నేను ఉన్నటువంటిదే ఉన్నది. ఈ గదులలో ఒక దానియందు జైలు గవర్నరుగారి అఫీసు ఉన్నది. ఖైదీలు క్రమశిక్షణ మీరి ప్రవర్తించకుండా ఉండగలందులకు ఈయనగారు తన సిబ్బందితో ఎప్పటికప్పుడు కని పెట్టి ఉంటాడు మొదటి మూడు జైళ్ళలోనూ ఉరిశిక్ష విధించినవాళ్ళను ఉంచారు ఎంచేతనంటే ఆ జైలు గదులు 'వార్డర్' గదికి చేరువగా ఉన్నాయి. వాళ్లు తప్పించుక పోకుండా అతనువేయి కళ్ళతో కనిపెట్టి ఉంటాడు

అత్యంత పురాతనమైన ఈ 'బిస్ట్రెటీ' భవనంలోని జైలు గదులన్నీ పదిహేనవ శతాబ్దంలో నిర్మించబడినాయి వీటిని నిర్మించినవాడు 'జోన్ ఆఫ్ ఆర్క్'ను కాల్చి చంపిన వించెస్టర్ మతగురువు.

జైలులో ఉన్న నన్ను చూడడానికి నిన్నగాక మొన్న, చాలామంది - జనం వచ్చారు అంతా వింత మనుష్యులు. అల్లంత దూరాన నిలుచుని నన్ను నఖశిఖ పర్యంతం పరిశీలించి చూచారు ఏదో ఒక విచిత్రవస్తువును చూచినట్లు, జంతుప్రదర్శనశాలలో ఒక వింతమృగాన్ని చూచినట్లు చూచారు. అలా నన్ను వాళ్ళకు చూపించి జైలు కాపలావాడు వంద *'సౌ'లు సంపాదించాడట! ఎవరో చెపితే విన్నాను.

మరొక్క విషయం చెప్పటం మరిచాను. పగలూ, రాత్రీకూడా నాజైలు గదిముందు ఒక కాపలావాడు పహరా ఇస్తుంటాడు. తలుపు రంధ్రంలోనుంచి చూడడమన్నా నాకు చచ్చే భయం. కాపలావాడి కళ్ళన్నీ నామీదనే ఉంటాయి!

ఏమైనప్పటికీ రాతిపెట్టెలా ఉన్న ఈ చెరసాలలో నేనింకా బ్రతికే ఉన్నాను.

11

పగలన్నది ఎలాంటిదో ఎరుగను నేను ఇహ రాత్రిళ్ళు- అపరాత్రిళ్ళు నేను చేసేదేమిటి? నాకు ఒక ఆలోచన తట్టింది. కూచున్నవాణ్ణల్లా లేచాను. లాంతరు చేత

* ఫ్రాన్సుదేశపు ఒక రకమైన రాగినాణెమునకు పేరు. నూరు 'సౌ'లు అనగా 5 ఫ్రాంకులు.

ప్రాణం తల్లడిల్లింది. గుండె నిలువునా నీరయిపోయింది భయంతో ఆపాదమస్త కం కంపించిపోయాను. చేతిలోనిలాంతరు దభేలుమని క్రిందపడిపోయింది

12

అప్పుడే నేను గడ్డికుప్పమీద నడుం వాల్చాను రెండు చేతులతో తలపట్టు కున్నాను నాకు కలిగినభయం అప్పుడు అంతరించింది. గోడలమీది వ్రాతలు మళ్ళీ చదవాలనే ఒక విచిత్రమైన కుతూహలం ఆవరించింది. తిరిగీ పరిశీలించడం మొదలు పెట్టాను 'పాపావయిన్' అనే పేరు ప్రక్కన ఒకమూల పెద్దసాలీడు ఒకటి దట్టంగా కూడుకట్టింది. సాలెగూటిని చేత్తో చెరిపివేసి చూచాను. ఈ గూటి క్రింద నాలుగైదు పేర్లు స్పష్టంగా నాకు కనుపించాయి: "డాటన్ 1815, పాలైన్ 1818, జీన్‌మార్టిన్ 1821, కాస్టెయింగ్ 1823."

ఆ పేర్లు ఒక్కొక్కటే చదువుతోంటే దుఃఖం ముంచుకొచ్చే ఆలోచనలు అనే కం నా మనస్సులో ముసురుకున్నాయి డాటన్ అనేవాడు తన తమ్ముణ్ణి ముక్కలుముక్కలుగా నరికి ఆ రాత్రివేళనే శవం మోసుకుని పోయి పారిస్‌నగరం చేరుకున్నాడు. అక్కడ ఒక చెరువులో తల పారేశాడు మొండేన్ని ఒక తూము లో పడేసి కనపడకుండా చేశాడు పాలైన్ తన భార్యను చంపాడు కన్న తండ్రి కిటికీ తలుపు తీస్తుండగా పిస్టల్‌తో కాల్చి చంపాడు జీన్‌మార్టిన్. కాస్టెయింగ్ ఒక డాక్టరు. తన స్నేహితుడికి విషంపెట్టి చంపాడు - స్నేహితుడు జబ్బుతో ఉండగా నయంచేయడానికని వెళ్లి మందు ఇవ్వడానికి మారుగా విషం ఇచ్చాడు. ఇహ పాపావయిన్ విషయం- వాడొక వెర్రివాడు. సామాన్యమైన వెర్రికాదు. అతనొక్కడూ వేయిమంది వెర్రివాళ్ళ పెట్టు-కన్నబిడ్డలను కత్తితో నరికి చంపాడు!

"మేమంతా ఇలాంటివాళ్ళమే!" అనుకున్నాను నాలో నేను. నావెన్నున జలదరించింది. చలిజ్వరం వచ్చినట్లు వణికిపోయాను. "ఇంతకుముందు ఉరితీయబడిన వాళ్ళపేర్లు అవి. అవును-వాళ్ళంతా ఈ గదిలోనే, ఇక్కడే, ఈ రాళ్ళమధ్యనే ఇప్పుడు నేను నిలవబడిఉన్న చోటనే నిలవబడి- తమ ఆఖరుక్షణాలు గడిపారు. తుది ఆలోచనలు చేశారు. తుదిఆశలు త్రెంచుకున్నారు! వాళ్ళంతాకూడా ఈ నాలుగు రాతిగోడల మధ్యనే వెర్రెత్తిన వాళ్ళలా అటూఇటూ నడిచారు. తుది అడుగులు వేశారు. బోనులో చిక్కుకున్న అడవిమృగాల్లా గిలగిల తన్నుకున్నారు. ఒకరి వెనకాల ఒకరు - కొంచెం వ్యవధానంగా ఒకరివెంట ఒకరు వెళ్ళారు. ఈ జైలుగది అసలు ఎన్నడూ ఖాళీగాఉన్నట్లు తోచదు! చివరకు ఈ జాగా నా కోసం వదిలివెళ్ళారు నా వంతూ రానేవచ్చింది నేనూ వెళ్ళి నిలువెత్తున గరికపోచలు పెరిగిన 'క్లామర్టు' శ్మశానంలో, వాళ్ళను కలవాలి!"

అసలు నా తత్వంవేరు నేను స్వాప్నికుణ్ణికాదు మూఢవిశ్వాసాలు కల మనిషినీకాదు. కాని ఎంచేతనో, ఈ తరుణంలో నా మనస్సు వికల - శకలాలయింది అనేక ఆలోచనలు కలలవలె వస్తున్నాయి. అలలవలె ఉవ్వెత్తుగా లేచి మనస్సును అల్లకల్లోలం చేస్తున్నాయి. నిజంగా నాకు సన్నిపాత జ్వరం వచ్చి

పట్టుకుని గది నలుమూలలా పరికించ సాగాను. ఆ దీపపు వెలుతురులో గోడల మీద ఏదేదో వ్రాసి ఉండడం కనుపించింది. రకరకాల వ్రాతలు- పిచ్చిపిచ్చి వ్రాతలు, బ్రహ్మరాతలు! చిత్రవిచిత్రమైనబొమ్మలు గీసిఉన్నాయి. జిలుగుజిలుగ్గా ఎన్నో పేర్లు వ్రాసిఉన్నాయి. ప్రతిఒక్క నేరస్థుడూ ఏదోవిధంగా అక్కడొక గుర్తు- కొండ గుర్తుపెట్టి, మరీ వెళ్లాడు! కొన్ని పెన్సులుతో వ్రాసిఉన్నాయి. కొన్ని సీమ సున్నంతోనూ, మరికొన్ని రంగురంగుల సుదముక్కలతోనూ బొగ్గుతోనూ వ్రాసి ఉన్నాయి. తెల్లటి అక్షరాలు, నల్లటి అక్షరాలు, ఎర్రటి అక్షరాలు! కొన్ని పేర్లు ఉలితో చెక్కినట్లు చెక్కి ఉన్నాయి అయ్యో, భగవంతుడా! మరికొన్ని అక్షరాలు రక్తంతో వ్రాసినట్లు మరకలుకట్టి కనుపిస్తున్నాయి. నామనస్సు అల్లకల్లోలమైంది.

నా జైల్లుగది ఒక విచిత్ర గ్రంథంలా తోచింది రాతిగోడలు పేజీలవలె కనుపించాయి. విచలిత మనస్కుడనై, ఈ విచిత్ర గ్రంథంలోని పుటలు చదవడం మొదలుపెట్టాను ఒకదానికొకటి సంబంధం లేని మాటలు, చెదురు చెదురుగా ఉన్న అక్షరాలు, తలలు లేని మొండెములు, మొండెములు లేని తలలు వికారంగాఉన్న బొమ్మలు పరిశీలించసాగాను.

నేను పడుకునే పక్కకు తలాపిదిక్కున రెండు బొమ్మలు గీసి ఉన్నాయి.ఇరువురు మనుష్యుల హృదయాలలో నుంచి అగ్నిజ్వాలలు పైకెగసి వస్తున్నాయి. మండుతున్న ఆ గుండెలలో ఒకబాణం గుచ్చబడి ఉంది. బొమ్మపైన "నన్ను మనసారా ప్రేమించండి!" అని వ్రాసి ఉంది. పాపం, ఎవడో అసువులు కోల్పోయిన అభాగ్యుడు!

ప్రక్కన మరొక చిన్నబొమ్మ గీసి ఉంది అందవికారంగా అసహ్యంగా ఉంది. తలకు త్రికోణాకారంగా ఉన్న టోపీ ఒకటి పెట్టారు. దిగువన "చక్రవర్తి చిరకాలం వర్ధిల్లుగాక! 1824" అని వ్రాసి ఉంది.

ఎదురుగా ఉన్న గోడపై "పాపావయిన్" అనే పేరు కనుపించింది. 'పా' అనే మొదటి అక్షరం పెద్దక్షరం, చిత్ర విచిత్రంగా చెక్కి, పూజలు పెట్టిఉంది! ఇంకొకచోట రెండుచరణాల బూతు పద్యం ఒకటి వ్రాసిఉంది. ఒకతట్టు స్వతంత్రచిహ్నమైనటోపీబొమ్మగీసిదానిక్రింద "బోరీస్- ప్రజాప్రభుత్వం" అని వ్రాసి ఉంది రోషెలీకి చెందిన నలుగురు సైనికోద్యోగులలోనూ అతనొకడు. ఆ నలుగురు యువకులూ రహస్యంగా రాజకీయ పక్షాలలో పనిచేశారు. కలలు కన్నారు పాపం! కేవలం ఒకఅభిప్రాయం కలిగిఉన్నందుకు, ఏదో కావాలని కలలు కన్నందుకు వాళ్ళను నిలువునా ఉరితీశారు! మరినేనూ? నాది కలకాదు. నేను నిజంగా దుర్మార్గుణ్ణి చెయ్యరాని నేరం చేశాను- నిలువునా ఒక ప్రాణాన్ని తీశాను. అలాంటప్పుడు నన్ను ఉరితీయడంలో తప్పేముంది? ఉరి తీస్తున్నారని నేరారోపణ చెయ్యడానికి నేనెలా తగుదును'

ఇహ నేనీ విచిత్రగ్రంథాన్ని పరిశీలించలేకపోయాను గోడమూలన తెల్లటిసీమ సున్నంతో గీసిన భయంకరమైన ఉరికంబం బొమ్మ నాకంటపడింది అది నా కోసమే ఎదురుగానిలుచున్నట్లు తోచింది.

నట్లు, ఆ జ్వరంలో సంధిగుణం పుట్టినట్లు ఉంది అకస్మాత్తుగా నాకొకటి తోచింది నేను చదివిన పేర్లన్నీ నిప్పురవ్వలతో వ్రాసినట్లనిపించింది. ఎవరో నన్ను తల్ల క్రిందులుగా పడేసినట్లుగా ఉంది. ఘంటా నాదం ఒకటి తెంపు లేకుండా - నా చెవులకు వినిపించ సాగింది నాకనుల ముందు ఎర్రదీపం ఒకటి కనుపించింది. నా జైలుగది యావత్తూ జనంతో క్రిక్కిరిసిపోయింది. ఎవరకీ శిరస్సులు లేవు. ప్రతి ఒక్కరూ తమ తలను ఎడమచేత్తో పట్టుకుని హాహాకారాలతో కాళీనృత్యం చేస్తున్నారు నాచే హత్య చేయబడిన వ్యక్తి ఒక్కడు తప్ప, తక్కిన అందరూ పిడికిళ్లు బిగించి నన్ను బెదరిస్తున్నారు. నోళ్లు తెరచి నన్ను మ్రింగవస్తున్నారు. మృత్యువు పలురూపాలు తాల్చి నన్ను ముట్టడించింది!

భయంతో కంపించిపోయాను.కనులు గట్టిగా మూసుకున్నాను. అప్పుడు ఈ దృశ్యాలన్నీ నాకు మరింత స్పష్టంగా అగుపించాయి.

ఇది స్వప్నమా? లేక మాయా? కాక వాస్తవమా? హఠాత్తుగా ఆసమయానికి ఒకానొక భావనవచ్చి నన్ను మైకం నుంచి తెప్పరిల్లేటట్లు చేసింది కాని, లేక పోతే నాకు పిచ్చెక్కి ఉండేది. వెనక్కి విరుచుక పడబోయాను. అంతలో నా పాదంమీద ఏదో పాకినట్లనిపించింది. చల్లగా తాకింది, చూదునుకదా, అది ఒక సాలెపురుగు. నాపాదంమీదిగా పాకి బరబర వెళ్లిపోతోంది.

దీంతో నాకు స్పృహ వచ్చింది. అమ్మయ్యో! దయ్యాలు, భూతాలు! కాదుకాదు. భయవిచలితమై, శూన్యమై ఉన్న నాబుద్ధికి కలిగిన భ్రమ, చాంచ ల్యం! చనిపోయినవాళ్ళంతా బొందలలో నుంచి లేచివస్తున్నారు. భూతాలై, ప్రేతాలై కనుపిస్తున్నారు! పరమేశ్వరా! నేనున్నది చెరసాలకాదు, శ్మశానం!

★

ద్రవ్యము-దాని ఉనికి

బెర్ట్రండ్ రసెల్

అనువాదం: జి. ఎస్. ఎన్.

౨

ఈయధ్యాయమున నేయుద్దేశ్యముననైనను అసలు ద్రవ్యమనునది యున్నదా యని మనకు మనమై ప్రశ్నించుకొన వలసియున్నది. ఒకానొక, సహజ సిద్ధమగు లక్షణము గలిగి, నేను చూడనపు డెట్టి విచ్ఛేదమును లేక యుండెడి బల్లయొకటి గలదా? లేక బల్ల కేవలము నా కల్పనా ఫలితమా? లేక అదియొక సుదీర్ఘమగు స్వప్నమునందలి వస్తువా? ఈ ప్రశ్నము చాల ముఖ్యమైనది. ఏలన మన కతిరిక్తముగా కొన్ని వస్తువులుగలవనువిషయమును మనము రూఢిగ చెప్పజాలనపుడు, మన కతిరిక్తముగా నితరుల శరీరములు కొన్ని గలవని గట్టిగా జెప్పజాలము. అట్టి స్థితిలో నితరులకు మనస్సులు కొన్ని యున్నవని యసలు నిరూపింపజాలము. ఏలన వారి శరీర గతములగు నింద్రియ వ్యాపారములను పరిశీలించుటను బట్టియే వారికి మనస్సులున్నవని విశ్వసింపవలయును. మఱొక విధముగ నవి యున్నవని నిరూపించుట యెట్లు సాధ్యపడును? కావున వస్తువుల స్వతంత్రాస్తిత్వము విషయమే మనకు సంశయము గల్గినపుడు మనకొక త్రోవ తెన్నునది లేకుండబోవును. బాహ్యప్రపంచమంతయు స్వప్నమే దప్ప మఱియేదియు గాదనియును, మన యునికి యొక్కటియే యథార్థమనియును, అను దానిలో నిజముండవచ్చును. కాని యిది యంత సులభముగ సరిబెట్టుకొనుటకు వీలైన యూహగాదు. దీని నయథార్థమని కచ్చితముగా నిరూపింపవలను పడకున్నను, అది సత్యమని యనుకొనుట కొకింతయైన హేతువు గన్పట్టదు. ఇది యెట్లో యీ యధ్యాయమున పరిశీలింప నగును సంశయాస్పదములగు విషయములలో ప్రవేశింపకమున్ను మన చర్చ ప్రారంభించు కనువగు నిర్ణీత స్థానము నొకటి యేర్పఱచుకొందము, బల్లకు సంబంధించిన భౌతికాస్తిత్వము విషయమై మనకు సంశయము గల్గుచున్నను, బల్లయొకటి గలదని మనను దలపింపజేయు నింద్రియార్థముల యునికిని మనము శంకించుటలేదు. మనము చూచునప్పుడొక రంగు, ఒకరూపు, మనకు గోచరమగు నవియును, మనము చేతితో వస్తువును ఒత్తునపుడు, గట్టితనమనెడి స్పర్శజ్ఞానము మనకు గలుగుచున్నదనియును, మనము శంకించుటలేదు. మానసికమగు నీ సర్వవిషయమును మనము శంకించుటలేదు. యథార్థముగా జెప్పవలెనన్న, మరియేది సంశయాస్పదమైనను, మనకువెన్వెంటనే గలుగు ననుభవములలో కొన్నియైనను నిక్కమని తేలును.

(1596-1650) ఆధునిక తత్త్వశాస్త్ర వ్యవస్థాపకుడగు దెకార్టె ఇంకను సఫలముగ వినియోగించుటకు వీలైన యొక విధానమును- శాస్త్రీయముగ వికల్పములను బయలుదేరదీయు విధానము, నొక దానిని గనుగొనెను. అతడు, తనకు స్పష్టముగా దెలియని దానిని, తాను సత్యమని యనుకొనని దాని నెన్నడును విశ్వసింపడయ్యెను. ఈవిధానము నవలంబించి యాతడు-తనకు గట్టిగా దెలిసినది తన యునికి యొక్కటి మాత్రమేయని నిశ్చయము చేసికొనెను. తన యింద్రియముల కొక శాశ్వతమగు నింద్రజాలమున నయథార్థములగు వస్తువులను గోచరింపజేయు మోసకారి యగు రాక్షసు డొకడు గలడని యాత డూహించుకొనెను. అట్టి రాక్షసు డొకడుండుట సంభావ్యము కాకపోవచ్చు. కాని యొక్కొక్కప్పు డట్టివా డుండుట కవకాశమును పూర్తిగా లేకపోలేదు. కాన నింద్రియ గ్రాహ్యములగు వస్తువుల విషయమై సంశయము గలుగుటకు తావుగలదు.

కాని తనయునికి విషయమై సందేహమునకసలెట్టి యాస్కారమును లేదు ఏలన 'తానే' లేనిచో, తన్నెట్టిరాక్షసుడును మోసగింపజాలడు. 'తాను సందేహించినచో, సందేహించిన తాను' ఉండితీరవలయును తాననునదియే లేనిచో, తనకెట్టి యనుభవములు కలుగుటకును వలనుపడదు కాన తన యునికియొక్క దానివిషయమై యాతనికెట్టి సంశయమును గల్గియుండదు. "నేనాలోచింతును కాన నేనున్నాను" ఈ నిశ్చితజ్ఞానమనెడి పునాదిపై నాతడు- తన సంశయము వ్రయ్యలు చేసిన విజ్ఞానమయమగు ప్రపంచమును పునర్నిర్మాణము సేయబూనుకొనెను వికల్పములను బయలుదేరదీయు విధానము నొకదానిని గనుగొని, వైయక్తికవిషయములు మిగుల నిక్కములని నిరూపించి యాతడు తత్త్వశాస్త్రమునకేనలేని యుపకారమొనరించెను. ఆ విధముగ నాతడు తత్త్వశాస్త్ర జిజ్ఞాసువులకు విశేషముగ దోహదమొనరించెను.

కాని డెకార్టెవాదమును వినియోగించుటలో కొంత జాగ్రత్త యవసరము. నేనాలోచింతును గాన నే నున్నానని చెప్పుట కచ్చితముగా జెప్పవలసిన దానికంటె కొంత యెక్కువగా జెప్పినట్లే నిన్నటివ్యక్తియు నేటివ్యక్తియు నొక్కడేయని మనఃకల్పింపవచ్చును ఒక యుద్దేశ్యములోనిది యధార్థము గావచ్చును కాని సిసలైన బల్లమొకటి తేల్చుట యెంత కష్టమో, సిసలైన యాత్మయొకటి గలదని నిర్ణయించుట యంతకష్టము నేను బల్లవైపు జూచునపుడు- తత్ఫలితముగ గోదుమరంగొకటి నాకు గోచరమగునపుడు - నేను గోదుమరంగును జూచుచున్నానను విషయమై కాక గోదుమరంగొకటి గన్పించుచున్నదను విషయమై నాకు నిశ్చితమగు జ్ఞానముగలదు దీనిని బట్టి గోదుమరంగును జూచు వస్తువొకటి గలదని యనుకొనవలసి వచ్చును కాని యది మనమందరమును కొలదిగనో గొప్పగనో నిత్యపదార్థముగా వ్యవహరించెడి 'నేను' కానవసరములేదు. కాని మనకు వెంటనే తేలిన యంశమిది. గోదుమరంగును జూచునట్టిది క్షణికము పూర్వ మనుభవము గడించుకొనునదియును, ఉత్తర క్షణమున వేరొక యనుభవమును గడించుకొనునదియును ఒక్కటిగాక పరస్పరమును విభేదించి యున్నవి.

కావున ప్రధానముగ నిశ్చితత్వమును గడించుకొనునవి మన ప్రత్యేకాలోచనములును, హృదయానుభవములును ఇది సామాన్య ప్రత్యక్షముల కెట్లన్వయించునో, స్వప్నములకును, భ్రాంతులకును నట్లే యన్వయించును మన మొకదయ్యమును జూచునపుడు లేక దాని విషయమై, మనకు గల్గుచున్నట్లనిపించు నింద్రియ గ్రహణములన్నియు నిక్కముగనే గల్గుచుండును. కాన మన యనుభవసంబంధియగు జ్ఞానముయొక్క నిశ్చితత్త్వము - కొన్ని యపవాదములకు దావొసగుటకు పరిమితము కానవసరములేదు కాన మన విజ్ఞాన వ్యాసంగము నారంభించుట కనువగు స్థానమిదియే.

మనము విచారింపవలసిన సమస్య యిది. ఇంద్రియార్థముల విషయమై మనకెట్టి సంశయమునుగలుగుటలేదనియే మన మంగీకరింతము. ఈ యింద్రియార్థములు - మనము భౌతికవస్తువని వ్యవహరించెడి యొకానొక వస్తువునకు చిహ్నములని భావించుటకు హేతువేమైన గలదా? బల్లతో సంబంధించియున్నట్లు మనము సహజముగ భావించెడి యింద్రియార్థముల నన్నిటిని పూర్తిగ జెప్పివైచినపుడు, బల్లను గురించి మనము చెప్పవలసిన దంతయు నైపోయినట్లా? లేక మనము గది వెలుపలకు వెడలునపుడు ఇంద్రియార్థముల కతిరిక్తమై యెప్పు వస్తువొకటి గలదా? లోకజ్ఞాన మట్టి వస్తువొకటి గలదని ఘంటాపథముగ జెప్పుచున్నది కొనుటకును, అమ్ముటకును, గుడ్డ పఱచుటకనువగు వస్తువును కేవలమొక యింద్రియార్థముల సమాహారముగ కొట్టివేయ వలనుపడదు. గుడ్డ పూర్తిగా బల్లను మరుగు పఱచుచో, బల్లనుగూర్చి ఎట్టి యింద్రియార్థమును మన కనుమాత మయ్యెడిదిగాదు. బల్ల కేవల మింద్రియార్థములే యైనచో దాని యునికికే విచ్ఛేద మేర్పడెడిది. ఒకానొక మహిమాతిశయముచే పూర్వము బల్లయుండిన ప్రదేశమున

వస్త్రము గాలిలో వ్రేలాడుచు నుండియుండెడిది. కాని స్పష్టముగా నిది యసంబద్ధమని యెవ్వని కైన ననిపించును. అయినను తత్త్వవేత్త కాదలచిన వాడట్టి యసంబద్ధతలవిన జంకకుండుట నేర్వవలయును.

ఇంద్రియార్థముల కదనముగా భౌతిక వస్తువునుగూడ నంగీకరింపవలసి వచ్చుట కొకపెద్ద కారణము-ఆ వస్తువు వేర్వేరువుర కభిలషణీయ మౌటయే. పదుగురు బల్లచుట్టును కూర్చొనియున్నపుడు-వారందరు నొకే బల్లపైని వస్త్రమును, అవే చంచాలను, చాకులను చూచుచుండుట లేదని వాదించుట మూర్ఖత్వము. కాని ఇంద్రియార్థములు ప్రతివ్యక్తికి ప్రత్యేకమైయొప్పును. ఒకని దృష్టికి వెంటనే గోచరించునది, మరి యొకని దృష్టికి వెంటనే గోచరముగాదు. వారందరును వస్తువులను కొలదిగ విభిన్నమై యొప్పు దృక్పథములతో జూతురు. కావున నవి వేఱుగా వారికి గన్పించును కాన అనేక వేర్వేరు వ్యక్తులకు జ్ఞేయములైన సార్వజనీనములగు తటస్థ వస్తువులు కొన్ని యుండుట సంభవమైనచో, వేర్వేరువురకు ప్రత్యేకముగ గోచరించువాని కతిరిక్తముగ నొక వస్తువుండి తీరవలయును. అట్టి తటస్థవస్తువు లున్నవని యనుకొనుట కెట్టి యుపపత్తి గలదు?

వేర్వేరువురు బల్లను వేర్వేరుగ జూచినను వారందరును బల్లవైపు జూచునపుడు కొలదిగనో గొప్పగనో నజాతీయ వస్తువులను గాంతురు. వారు చూచుదానిలో గల్గు భేదములు ప్రకార (Perspective) సూత్రములనుబట్టియు, తేజః పరావర్తన సూత్రములను బట్టియు నేర్పడును. కావున వేర్వేరువుర యింద్రియార్థముల కధిష్ఠానముగ నొక శాశ్వతమైన వస్తువొకటి గలదని తేల్చుకొనుట సులభమే. నా గదిని పూర్వమాక్రమించువాని యొద్దనుండి బల్లను గొంటిని. కాని యతని యింద్రియార్థములను మాత్ర మతని నుండి గొనలేదు. అవి యతడు వెడలునపు డతనితోనే బోయెను. కాని యితరులకు ననుభూతములగు నింద్రియార్థముల వంటివేమనకును ననుభూతములగు నను నాశనుమాత్ర మాతని నుండియే కొంటిని. కావున వేర్వేరువురకు సజాతీయములగు (Similar) నింద్రియార్థము లనుభూతమగుననుట నిజము. అంతియగాక వేర్వేరు కాలములలో, ఒక నిర్దిష్ట ప్రదేశమున, ఒక వ్యక్తికి సజాతీయములగు నింద్రియార్థము లనుభూతములగును. దీనిని బట్టి, వేర్వేరు కాలములలో, వేర్వేరు వురయింద్రియార్థములకు కారణమై, తదధిష్ఠానమై యొప్పు నిత్య వస్తువొకటి గలదని యనుకొనవలసి వచ్చుచున్నది.

పై విషయము లన్నియు మనకంటె వేఱుగా నితరులున్నారని యనుకొనుటపై నాధారపడి యున్నంతవరకును నవి సిద్ధసాధ్యతోషమునకు గురికావలసివచ్చును. ఇతరు లున్నట్లు వారిని జూచుటను బట్టియు వారి కంఠస్వరములను వినుటనుబట్టియు మనకు దెలియుచున్నది. నా యింద్రియార్థముల కంటె వేరుగా భౌతిక వస్తువులున్నవని విశ్వసించుట కుపపత్తి యేమియును లేనిచో, ఇతరులు నా కలలో భాగములుగ దప్ప మరియొక విధముగ నున్నారని విశ్వసించుటకు నాకెట్టి యుపపత్తియునుండదు. కావున మన యింద్రియార్థముల కతిరిక్తముగా వస్తువులుండి యుండవలెనని మనము నిరూపింప బూనుకొన్నపుడు మన మితరులు చెప్పినదానిని ప్రమాణముగ గొని యావిషయమును నిరూపింపజాలము. ఏలన ఆశబ్ద ప్రమాణముగూడ నింద్రియార్థములతో గూడుకొనినదే గదా. కావున మన యింద్రియార్థములు మనకు నతిరిక్తముగా నుండెడి వస్తువుల చిహ్నములై ననేగాని, యా శబ్దప్రమాణ మితరుల యనుభవమును వ్యక్తపఱుపదు. కావున మన వ్యక్తిగతానుభవములలో, మనకంటెను, మన వ్యక్తిగతానుభవములకంటెను వేరై యొప్పు వస్తువులున్నవని నిరూపించునవియో లేక యట్టి నిరూపణమునకు ద్రోవ జూపునవియో కొన్ని లక్షణములను మనము పరిశీలింపవలయును.

ఒక యుద్దేశ్యములో, మనకును, మనయనుభవములకును నతిరిక్తముగా కొన్ని వస్తువులు గలవని యెన్నటికినిరూపింపజాలము. ప్రపంచ మనగా నేను, నాఆలోచనములు, హృదయానుభవములు, ఇంద్రియ గ్రహణములును దప్ప

మరేవియు గాదను నూహవలన తార్కికమగు నసంబద్ధత యేదియు మనకు గలుగదు స్వప్నములలో సంకీర్ణమగు ప్రపంచమొకటి యున్నట్లు మనకు గోచరింపవచ్చును కాని మేల్కాంచినపిమ్మట నిదియంతయు భ్రాంతియని మనకు దెలియుచున్నది అనగా కలలోని యింద్రియార్థములకు ననుగుణముగ భౌతికవస్తువులేవియు నున్నట్లు గన్పింపదు భౌతిక ప్రపంచమొకటి గలదని మన మంగీకరించి నపుడు, కలలోని యింద్రియార్థములకు భౌతిక కారణములనారయటకు వీలు కలుగునన్న మాట నిజమే. ఉదాహరణమునకు ఒక తలుపుచప్పు డొక నౌకాయుద్ధమును గూర్చి కలకనుటకు కారణము గావచ్చును.ఇచ్చట నింద్రియార్థముల కనుగుణ మగు భౌతికకారణ మొకటి యున్నను నౌకాయుద్ధమువంటి - యింద్రియార్థమున కనుగుణ మగు భౌతికవస్తువు మాత్రము గన్పించుట లేదు. ఈ జగత్తంతయును స్వప్నమే యనియును, ఇందు మనకు మనమై మన యెట్టయెదుట వస్తుకల్పన చేయుచుంటి మనియు ననుకొనుటలో తార్కికమగు నసంభావ్యత యేమియును లేదు కాని తార్కికముగ నది యసాధ్యము గాకున్నను, అది సత్యమని యనుకొనుట కొకింతయైనను కారణములేదు. మన స్వకీయజీవితము నందలి విషయములకు హేతుకల్పనజేయు విధానముగ జూచినచో, మన కతిరిక్తముగ వస్తువు లున్నవనియు, మనపై నవి పనిజేయుటచే మన కింద్రియ గ్రహణము గల్గుచున్నవని లోకసామాన్యముగ మనమనుకొను నూహకంటె - నీ ప్రపంచ మంతయు మిధ్యయను నూహ యేమంత సుకరమైనదిగాదు

భౌతిక వస్తువులున్నవని యంగీకరించుటలో సౌలభ్యమెట్లేర్పడు చున్న దో తెలిసికొను మార్గము స్పష్టముగ గోచరమగును. పిల్లి ఒకప్పుడు గదిలో నొకభాగమున గన్పించి, యుత్తరక్షణమున నింకొకభాగమున గన్పించుచో, నది నడుమ ననేక స్థానములను దాటుకొనిపోవుచు నొకచోటనుండి వేఱొకచోటుకు గదలిపోయినదని యనుకొనుట సహజము కాని యది కేవలమింద్రియార్థములే యగుచో నేను చూడని ప్రదేశమున నదియుండుట యసంభవము కావున నేను చూడనపుడు అది యసలు లేనేలేదనియును, కాని యాకస్మికముగ నాకసమునుండి యూడిపడినదనియును మన మనుకొనవలసి వచ్చును కాని నేను చూచినను చూడకున్నను పిల్లియుండుట సంభవమేయైనచో, మొదటిసారి భోజనమునకును, రెండవసారి భోజనమునకును నడుమదాని కాకలి యెట్లు వేయుచున్నదో- అనుభవమును బట్టి మన మవగతము చేసికొనగలము. కాని నేను దానిని చూడనపుడది యుండుట పొసగనిచో నది యున్నప్పుడెంత వడిగా దాని కాకలి వేసినదో లేనప్పుడు గూడ నంతవడిగా దానికాకలి వేయుచున్నదని చెప్పవలసివచ్చును ఇది యసంబద్ధమౌట సర్వవిదితముగదా. పిల్లి కేవల మింద్రియార్థములే యైనచో దానికాకలి వేయుట యసంభవము ఏలన నాయాకలిదప్పు యొరుల యాకలి నాకింద్రియార్థము గాజాలదు. కావున పిల్లియున్నదను జ్ఞానమును గలుగజేయు నింద్రియార్థములలో కలుగుమార్పు- ఆకలిని వ్యక్తీకరించు సాధనముగ బరిగణించి నపుడవి సహజమై కన్పట్టును. కాని వానినాకలి కెట్టి యాస్కారమును లేని వర్ణప్రస్తారముల సంచలనములుగను, మార్పులుగను పరిగణించినచో నది వివరించిచెప్పుటకు గూడ నలవికానిదై పోవును.

సవరణ 10 వ పుటలో 7సంఖ్యవేసిన అధోజ్ఞాపికకు బదులు—'గ్రహీతృ పురుష విషయక సమాపత్తి అను సంప్రజ్ఞాత సమాధి భేదము లేక సాస్మిత సమాధ అని చదివికొనవలయును

విశ్వనాథ మధ్యాక్కఱలు

శేషగిరి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౧

శ్రీ పయోధర సమాశ్లేష రేఖా పరిమళామృత ధు
నీ పోషితాశ్రిత క్షేత్ర భూత మనీషార్ద్రివలయ!
ప్రాపిత స్వీయ భూధర శిఖాక సద్భక్తభావ కల
శీ పూర మలయజా! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

పది యేఁడులును రాకమున్నె నన్ను నీ పర్వతంబులకు
కదలించు కొని వచ్చినాఁడు మాతండ్రి, కన్నాను నాఁడె;
అదిమొదల్ నివు నాగుండె పూమొక్క కధికారి వౌచు
చిదుము చుంటివి పూలు వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

కున్నలై జనములు శక్తి మతిలోన గులక రాళ్లేరు
కొన్నట్లు, వ్యాధులు పాపికొను నీ కొండకు వత్తు,
రన్న లాజని మృతి యాధిపాపి కో నరుదేర, రెంత
చిన్నారి బుద్ధుఁబి! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

వేనికిఁ బుట్టిన బిడ్డరా వెక్కి వెక్కి యేడ్చెడిని
నా నొప్పి లోకమ్ము కోర్కులను ఆమ్ముసం గట్టికొని, ర
మా నాథ! యీదుచున్నావు, గాన సంబరము సాగు- నత
నీ సటత్సుషమాంగ! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నీ కన్న మాయా సనాథు వేఱొక్కనిం జూపు మయ్య!
లోకంబు లోని మానవుల కోర్కులు ఘటించుటకు నె
యాకృతి నూనిన యట్టులుంటివి, మోహపాశ రానీక
సే కొని పనిగాఁగ, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

శివునకు నీకును నేను భేదంబు చేసితి నేని
తపులు నా పాపాన నాదు నాయువు తగ్గును గాక!
శివుఁడు శివుఁడంటంచు, నీవు నీ వంచుఁ జిత్తాన నాకు
సివ మెత్తఁ బోదయ్య వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నా హృదంతర మందు మాయ కప్పియున్న యదియు దాని
బాహ రింపింపగా మిమ్ము నిద్దఱఁ బ్రార్థించు చుంటి,
శ్రీ హరీ పీ రెక్కు వంచు ననునంత చేవయే లేదు
సేహువకు న్నాకు, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

కొన్ని వాక్యంబుల నిన్ను, నాయనఁ గొన్ని వాక్యములఁ,
గొన్నింట నన్నును-విడిచి విడిచి యెక్కువ గాఁగఁ జెప్పి
యున్న వేదముల తాత్పర్య మో స్వామి, యొగి మీరు నన్నుఁ
జిన్న పుచ్చగ రామి వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఏది కవ్వడికని జెప్పినావో, మున్నెప్పుడో మనువు
నూది చెప్పితి నంటి గాదె, యప్పు డెట్లున్నావు? మూర్తి
వాదంబు లేదింధు, నీకు పరమాత్మ వాదంబు గాక
శ్రీ దీప్తి జలరాశి! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

పరమ వైష్ణవ మూర్తు లగుచు వైకుంఠ పదమున నున్న
నిరత జీవులను గాదనుట కాదిది, నేను నా త్రోవ
సరణి నీకును విన్నవించు కొంచుంటి, జాలి క్రొంజడుల
సిరి పరగింపవే! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మీరు జగంబుపైన నధికారులు మిమ్ముఁ గాదనుట
యేరీతి? నా కధికార మక్కఱయే లేదు, నేను
కోరిన నదిరాద, కోట్ల వత్సరాల్ కూర్చుండి తపము
చేరి చేయను లేద, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఫల దాతలను మిమ్ముఁ గాదనంగ వ్యాపారమ్ము వదల
వలఁతినో! దానికేగోల! మీరు కృపాదృష్టిఁ జూడ
వలయున! యిట్టి వ్యాపారభావ మావలఁ బెట్టి నాకు
సిలుగులు పాపవే, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఏ పేరు పెట్టిననేమి? యది యదియే కదా! నామ
రూపాలు తమ కనురూప మైనట్లు రూపించు కొంద్రు,
ఆ పేరు మొదలైనవి వ్యవహార సమా సన్నములవి,
శ్రీపతీ కరుణింపు! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మృతి కల్గు నన్నదానికి భయంపడ నే నింతయైన
మృతి వేళలో భయం పడుదునో యన్నదే భయం బయ్యె,
మృతియెన్ని పూర్వ జన్మముల యందు నయ్యెనో యలవాటు?
శ్రిత రక్ష! కాలేదో? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

బ్రతుకు టెట్లా యన్న యట్టిదే పెద్ద భయము లోకమున,
దది మృతి కల్గునోయన్న భీతికే యన్యమా పేరు,
ఇది భీతియొక్క తత్త్వంబు, లేదు నాకిది యన రాదె,
శ్రిత రక్ష! యేమందు? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఒక పెద్ద పులియు నోర్తెఱచి వచ్చిన, దొక పెద్ద సొమ్ము
ప్రకటితంబుగ నష్టమైన-దేమిటా భయము? జీవనము
నకు భంగమైన దన్నదియు, మృత్యు వన్నదియు; నాకిట్టి
సెకలు తూలించవే! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఏది యెట్లైన దానద్ది యట్లు కానిమ్మన్న ధైర్య
మూది యుంటిన, మృతిఁ గూర్చి యట్టులే యుంటిన, గాని
లో దిగుల్ కలద, యా వేళకున్ మది లోలమై చనునో
శ్రీ దార! యంచును వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఆ వేళకు నీదు కరుణ లేక. యిట్లైన నిశ్చయము
భావంబునన్ నిల్వఁ దొక్కొకొన లేక భ్రమసితి నేని,
తా వృథా యిదియెల్ల నట్టి సంస్కారతకుఁ గూడఁ గాదో?
శ్రీ వేంకటేశ్వరా! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

జీవుఁ డీ మేనిలో గర్భమునఁ బ్రవేశించెడు వేళ
నో విభూ! యంతటి దా సుఖము నందెనో, యిందు నుండి
పోవు వేళకు నంత యైన దుఃఖము పొందగా-నిన్ను
సేవించు టెఱుగక, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఈ భీతినిగుఱించి యింత బిట్టుగా నెందుకు భావ
నా భరంబుగ నూహ సేయుచుంటి వనన్, లోకమం ద
హో! భీతి చనిపోవువారి కన్నులనొప్పు నవధిగ
శ్రీ భోగ సంవాస! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

లక్ష చెప్పుము వేయి చెప్పు మొక్క వేళకు లోనఁ బరమ
భిక్షుకభావంబు నిముసమైనఁ గన్పించదు నాకు,
దక్షత నాల్కకుఁ గలదు, వేయి పద్యంబులు వ్రాతు,
శిక్షింపు నన్నును వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

పుట్టిన నాడెట్లో యివ్వి యిపు డట్లె మోహ భావములు
త్రుట్టెలు కట్టెను, పిచ్చి కుదిరెను రోకలి తలకుఁ
జుట్టు మన్నట్లున్న, దన్ని వదలితి, సుంత పాలింపు
చిట్టచివరి నాళ్ళ వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

తెరువాటు కాఁడుగా నింద్రియంబుల తెరువుల నన్నుఁ
దిరిగించి, కుత్తుక పైన గండకత్తెర తెచ్చి పెట్టి,
యిరుకునఁ బెట్టెదు, నేను కోరి నట్టిది జీవనంబు
సిరి జతగాఁజేసి వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఈ నట్టనడవిలో నిల్లుకట్టించి, హింస్ర మృగాళి
ప్రాణముల్ తీసినఁ దీయ నిమ్మన్న పాళమైనట్టి
జ్ఞాన ముండినను, గుండేటి నైనను జంపనేవలయుఁ
జేనెడు పొట్టకై- వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

పైకిని దీయగా బ్రహ్మహత్యయుఁ, బరగ గోహత్య
చేకొని క్రిందికిఁ దీయగా-నట్లు చేసితి బ్రతుకు,
మూక భావము తాల్ప నాత్మ హత్య, యిమ్మగ నద్ది నీవు
సే కొందు ముక్తిగా-వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఇది గుండె వింధ్యాద్రి వోలె గగనాని కెగసి గ్రహాళి
కదల నీయక సూర్యకాంతి చిఱతలా కాల్వల చినుకు
మెదల నీయద, కుంభ సంభవత దీని మిట్టి పాటీవు
చిదుమగానే వలె వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

పుట్టెను బుట్టిన బుద్ధి పోవును బుడకల నంద్రము,
కట్టె వేల్పా! జన్మ జన్మకుం బుడకలదాఁక నట్లే
తొట్టె తొట్టెగనె యుండెడిని, నీదయ తోచెడు దాఁక
చిట్టు ముట్టాడకు-వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

సంస్కృతబాలశిక్ష

శ్రీ గరికిపాటి సత్యనారాయణ, ఎం. ఎ.

౬

ఈ క్రింది సకారాన్తమగు అదస్ అనుశబ్దమును పరిశీలించునది అదశ్శబ్దమునకు పుంలింగమున వీడని యర్థము.

అసౌ — అమూ — అమీ
అముమ్ — అమూ — అమూన్
అమునా — అమూభ్యామ్ — అమీభిః
అముష్మై — అమూభ్యామ్ — అమీభ్యః
అముష్మాత్ — అమూభ్యామ్ — అమీభ్యః
అముష్య — అముయోః — అమీషామ్
అముష్మిన్ — అముయోః — అమీషు.

ఈ క్రింది సకారాన్తమగు అదస్ అనుశబ్దమును పరిశీలించునది అదశ్శబ్దమునకు స్త్రీలింగమున 'ఈమె' యని యర్థము

అసౌ — అమూ — అమూః
అమూమ్ — అమూ — అమూః
అముయా — అమూభ్యామ్ — అమూభిః
అముష్యై — అమూభ్యామ్ — అమూభ్యః
అముష్యాః — అమూభ్యామ్ — అమూభ్యః
అముష్యాః — అముయోః — అమూషామ్
అముష్యామ్ — అముయోః — అమూషు.

ఈ క్రింది సకారాన్తమగు అదస్ అనుశబ్దమును పరిశీలించునది. అదశ్శబ్దమునకు నపుంసకలింగమున ఇది యని యర్థము

అదః - అమూ - అమూని

ద్వితీయా విభక్తిగూడ నిట్లే యుండును. మిగిలినదంతయు పుంలింగశబ్దమును బట్టి యన్వయించుకొననగును. అదశ్శబ్దమును మూడు లింగములలోను జాగ్రత్తగ పరిశీలించి యందలి సామ్యవైషమ్యములను పాఠకులే గమనించునది.

ఇంతవరకును సర్వనామ శబ్దములుదాహరింపబడినవి ఇక అజన్త విశేష శబ్దములు మూడు లింగములలో నుదహరింపబడును.

ఈ క్రింది అకారాన్తమగు 'నిర్జర' యను పుంలింగశబ్దమును పరిశీలించునది నిర్జర శబ్దమునకు దేవతయని యర్థము.

నిర్జరః — నిర్జరౌ / నిర్జరసౌ — నిర్జరాః / నిర్జరసః
హేనిర్జర — హేనిర్జరౌ / హేనిర్జరసౌ — హేనిర్జరాః / హేనిర్జరసః
నిర్జరమ్ / నిర్జరసమ్ — నిర్జరౌ / నిర్జరసౌ — నిర్జరాన్ / నిర్జరసః
నిర్జరేణ / నిర్జరసా — నిర్జరాభ్యామ్ — నిర్జరైః
నిర్జరాయ / నిర్జరసే — నిర్జరాభ్యామ్ — నిర్జరేభ్యః
నిర్జరాత్ / నిర్జరసః — నిర్జరాభ్యామ్ — నిర్జరేభ్యః
నిర్జరస్య / నిర్జరసః — నిర్జరయోః / నిర్జరసోః — నిర్జరాణామ్ / నిర్జరసామ్
నిర్జరే / నిర్జరసి — నిర్జరయోః / నిర్జరసోః — నిర్జరేషు.

ఈ క్రింది అకారాన్తమగు 'పాద' అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది. పాదశబ్దమునకు పాదమే యర్థము.

పాదః — పాదౌ — పాదాః
హేపాద — హేపాదౌ — హేపాదాః
పాదమ్ — పాదౌ — పాదాన్ / పదః
పాదేన / పదా — పాదాభ్యామ్ / పద్భ్యామ్ — పాదైః / పద్భిః

పాదాయ / పదే — పాదాభ్యామ్ / పద్భ్యామ్ — పాదేభ్యః / పద్భ్యః
పాదాత్ / పదః — పాదాభ్యామ్ / పద్భ్యామ్ — పాదేభ్యః / పద్భ్యః
పాదస్య / పదః — పాదయోః / పదోః — పాదానామ్ / పదామ్
పాదే / పది — పాదయోః / పదోః — పాదేషు / పత్సు

ఈ క్రింది అకారాన్తమగు మాస అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది. మాసశబ్దమునకు నెలయని యర్థము.

మాసః — మాసౌ — మాసాః
మాసమ్ — మాసౌ — మాసాన్
మాసేన / మాసా — మాసాభ్యామ్ / మాభ్యామ్ — మాసైః / మాభిః
మాసాయ / మాసే — మాసాభ్యామ్ / మాభ్యామ్ — మాసేభ్యః / మాభ్యః
మాసాత్ / మాసః — మాసాభ్యామ్ / మాభ్యామ్ — మాసేభ్యః / మాభ్యః
మాసస్య / మాసః — మాసయోః / మాసోః — మాసానామ్ / మాసామ్
మాసే / మాసి — మాసయోః / మాసోః — మాసేషు / మాస్సు

ఈ పై మూడు శబ్దములలోను కుండలీకరణము చేయబడిన యా యా విభక్తి వచనములలో రెండేసి రూపములుండుట పాఠకులు గ్రహింపగలరు ఈ మూడు శబ్దములలోను మొదటి వచన రూపముల నన్ని విభక్తులలో చదువుకొని పోయినచో నివి రామశబ్దమును బోలి యుండును. కాని ఆయా విభక్తులలోని రెండవ రూపములు మాత్రము విశేష రూపములు

ఈ క్రింది ఆకారాన్తమగు 'విశ్వపా' అనెడు పుంలింగ శబ్దమును పరిశీలించునది. విశ్వపా శబ్దమునకు జగత్తును రక్షించువాడని యర్థము

విశ్వపాః - విశ్వపౌ - విశ్వపాః
హేవిశ్వపాః - హేవిశ్వపౌ - హేవిశ్వపాః
విశ్వపామ్ - విశ్వపౌ - విశ్వపాః
విశ్వపా - విశ్వపాభ్యామ్ - విశ్వపాభిః
విశ్వపే - విశ్వపాభ్యామ్ - విశ్వపాభ్యః
విశ్వపః - విశ్వపాభ్యామ్ - విశ్వపాభ్యః
విశ్వపః - విశ్వపోః - విశ్వపామ్
విశ్వపి - విశ్వపోః - విశ్వపాసు.

ఇట్లే శంఖధ్మా, గంధప్రఘా శబ్దములను అన్వయించు కొనునది

ఈ క్రింది ఇకారాన్తమగు సఖి అనెడి పుంలింగ శబ్దమును పరిశీలించునది సఖి శబ్దమునకు స్నేహితుడని యర్థము

సఖా - సఖాయౌ - సఖాయః
హేసఖే - హేసఖాయౌ - హేసఖాయః
సఖాయమ్ - సఖాయౌ - సఖీన్
సఖ్యా - సఖిభ్యామ్ — సఖిభిః
సఖ్యే - సఖిభ్యామ్ - సఖిభ్యః
సఖ్యుః - సఖిభ్యామ్ - సఖిభ్యః
సఖ్యుః - సఖ్యోః - సఖీనామ్
సఖ్యౌ - సఖ్యోః - సఖిషు.

ఈ క్రింది ఇకారాన్తమగు 'పతి' యనెడి పులింగ శబ్దమును పరిశీలించునది. 'పతి' యనగా భర్త ద్వితీయా విభక్తివరకును పతిశబ్దము హరిశబ్దమును బోలి యుండును కాని తృతీయా విభక్తి నుండియు నిది విభేదించును.

పత్యా — పతిభ్యామ్- పతిభిః
పత్యే— పతిభ్యామ్— పతిభ్యః
పత్యుః-పతిభ్యామ్— పతిభ్యః
పత్యుః— పత్యోః— పతీనామ్
పత్యౌ— పత్యోః— పతిషు

ఈ క్రింది ఈకారాన్తమగు ప్రధీ అను పులింగశబ్దమును పరిశీలించునది. ప్రధీశబ్దమునకు బాగుగా ధ్యానించువాడని యర్థము.

ప్రధీః— ప్రధ్యౌ— ప్రధ్యః
ప్రధ్యమ్— ప్రధ్యౌ— ప్రధీః
ప్రధ్యా— ప్రధీభ్యామ్- ప్రధీభిః
ప్రధ్యే— ప్రధీభ్యామ్- ప్రధీభ్యః
ప్రధ్యః- ప్రధీభ్యామ్- ప్రధీభ్యః
ప్రధ్యః ప్రధ్యోః - ప్రధ్యామ్
ప్రధ్యి- ప్రధ్యోః- ప్రధీషు.

సేనానీ శబ్దము ప్రధీశబ్దమును బోలి యుండును సప్తమ్యేక వచనమున మాత్రము రూపము మారును.

సేనాన్యామ్- సేనాన్యోః- సేనానీషు.

ఈక్రింది ఋకారాన్తముగు 'నృ' అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది. నృశబ్ద మునకు మనుష్యుడని యర్థము

నా - నరౌ - నరః
హేనః - హేనరౌ - హేనరః
నరమ్ - నరౌ - నౄన్
న్రా - నృభ్యామ్ - నృభిః
న్రే - నృభ్యామ్ - నృభ్యః
నుః - నృభ్యామ్ - నృభ్యః
నుః - న్రోః — నృణామ్ / నూణామ్
నరి-న్రోః-నృషు

ఈ క్రింది ఆకారాన్తముగు 'జరా' అను స్త్రీ లింగ శబ్దమును పరిశీలించునది. జరా శబ్దమునకు ముసలితనమని యర్థము.

జరా	జరే / జరసౌ	జరాః / జరసః
హేజరే	హేజరే / హేజరసౌ	హేజరాః / హేజరసః
జరామ్ / జరసమ్	జరే / జరసౌ	జరాః / జరసః
జరయా / జరసా	జరాభ్యామ్	జరాభిః
జరాయై / జరసే	జరాభ్యామ్	జరాభ్యః
జరాయాః / జరసః	జరాభ్యామ్	జరాభ్యః
జరాయాః / జరసః	జరయోః / జరసోః	జరాణామ్ / జరసామ్
జరాయామ్ / జరసి	జరయోః / జరసోః	జరాసు।

ఈ క్రింది ఆకారాన్తముగు 'నిశా' అనెడి స్త్రీలింగ శబ్దమును పరిశీలించునది. నిశా శబ్దమునకు రాత్రియని యర్థము.

నిశా	నిశే	నిశాః
నిశామ్	నిశే	నిశః / నిశాః
నిశా / నిశయా	నిడ్భ్యామ్ / నిశాభ్యామ్	నిడ్భిః / నిశాభిః
నిశే / నిశాయై	నిడ్భ్యామ్ / నిశాభ్యామ్	నిడ్భ్యః / నిశాభ్యః
నిశః / నిశాయాః	నిడ్భ్యామ్ / నిశాభ్యామ్	నిడ్భ్యః / నిశాభ్యః
నిశః / నిశాయాః	నిశోః / నిశయోః	నిశామ్ / నిశానామ్
నిశి / నిశాయామ్	నిశోః / నిశయోః	నిట్త్సు, నిట్సు / నిశాసు

ఈ పై రెండిటిశబ్దములలో రమా శబ్దచ్ఛాయలు ఏయే రూపములు పర్పడునో పాఠకులే ఎరుంగునది

ఈ క్రింది ఈకారాన్తముగు 'స్త్రీ' అను స్త్రీలింగ శబ్దమును పరిశీలించునది. స్త్రీ యనగా 'ఆడుది' యని యర్థము.

స్త్రీ - స్త్రియౌ - స్త్రియః
హేస్త్రి - హేస్త్రియౌ - హేస్త్రియః
స్త్రియమ్ / స్త్రీమ్ - స్త్రియౌ - స్త్రియః / స్త్రీః
స్త్రియా - స్త్రీభ్యామ్ - స్త్రీభిః
స్త్రియై - స్త్రీభ్యామ్ - స్త్రీభ్యః
స్త్రియాః - స్త్రీభ్యామ్ - స్త్రీభ్యః
స్త్రియాః - స్త్రియోః - స్త్రీణామ్
స్త్రియాం - స్త్రియోః - స్త్రీషు.

ఈ క్రింది అకారాన్తమగు 'హృదయ' మనెడి పుంలింగ శబ్దమును పరిశీలించునది. హృదయ శబ్దమునకు గుండె యని యర్థము.

హృదయమ్- హృదయే- హృదయాని
హేహృదయ- హేహృదయే- హేహృదయాని
హృదయమ్- హృదయే- హృన్ది / హృదయాని

హృదా / హృదయేన	- హృద్భ్యామ్ / హృదయాభ్యామ్	-హృద్భిః / హృదయైః
హృదే / హృదయాయ	-హృద్భ్యామ్ / హృదయాభ్యామ్	-హృద్భ్యః / హృదయేభ్యః
హృదః / హృదయస్య	-హృదోః / హృదయయోః	-హృదామ్ / హృదయానామ్
హృది / హృదయే	-హృదోః / హృదయయోః	హృత్సు / హృదయేషు

ఈ క్రింది అకారాన్తమగు 'ఉదక' అను నపుంసక లింగ శబ్దమును పరిశీలించునది.

ఉదకమ్- ఉదకే- ఉదకాని
హేఉదక- హేఉదకే- హేఉదకాని
ఉదకమ్- ఉదకే - హేఉదకాని

ఉద్నా / ఉదకేన	-ఉదభ్యామ్ / ఉదకాభ్యామ్	-ఉదభిః / ఉదకైః
ఉద్నే / ఉదకాయ	ఉదభ్యామ్ / ఉదకాభ్యామ్	-ఉదభ్యః / ఉదకేభ్యః
ఉద్నః / ఉదకాత్	- ఉదభ్యామ్ / ఉదకాభ్యామ్	- ఉదభ్యః / ఉదకేభ్యః
ఉదః / ఉదకస్య	- ఉద్నోః / ఉదకయోః	- ఉద్నామ్ / ఉదకానామ్
ఉద్ని, ఉదని / ఉదకే	- ఉద్నోః / ఉదకయోః	—ఉదసు / ఉదకేషు

ఈ క్రింది ఇకారాన్తమగు 'దధి' అను నపుంసకలింగ శబ్దమును పరిశీలించునది దధి శబ్దమునకు 'పెరుగు' అని యర్థము

దధి _ దధినీ _ దధీని
హేదధే / హేదధి - హేదధినీ _ హేదధీని
దధి _ దధినీ _ దధీని
దధ్నా - దధిభ్యామ్ _ దధిభిః
దధ్నే _ దధిభ్యామ్ _ దధిభ్యః
దధ్నః — దధిభ్యామ్ - దధిభ్యః
దధ్నః - దధ్నోః - దధ్నామ్
దధిని / దధని _ దధ్నోః - దధిషు

ఇట్లే అక్షి, సక్థి, అస్థి శబ్దములను సమన్వయించుకొన నగును.

పాఠకులు వెనుకటి పాఠములలో ఈ క్రింది మార్పులు చేసికొనవలయును.

వారి శబ్దమునకు చతుర్థ్యేక వచనమున వారిణీ అనుటకు బదులు వారిణే అనియును, శమ్భుశబ్దమునకు పంచమీ ద్వివచనమున శమ్భుభ్యాః అనుటకుబదులు శమ్భుభ్యాం అనియును, నపుంసకలింగ మహచ్ఛబ్దమునకు ప్రథమా బహువచనమున మహాన్తి అనుటకు బదులు మహాఁన్తి అనియును, దివిషచ్ఛబ్దమును బోలిన శబ్దమును శాస్త్రజిత్ అనుటకుబదులు శాస్త్రవిత్ అనియును, సర్వాశబ్దమునకు పంచమ్యేక వచనమున సర్వాస్వాః అనుటకు బదులు సర్వస్యాః, ఏతచ్ఛబ్దమునకు చతుర్థ్యైక వచనమున ఏతస్త్యై అనుటకుబదులు ఏతస్మై అనియును, అస్మచ్ఛబ్దమునకు పంచమీ బహువచనమున 'అస్మల్' అనుటకు బదులు అస్మత్ అనియును తుచ్ఛబ్దమునకు పంచమీ బహువచనమున తుధేః అనుటకు బదులు తుధః అనియును చదువుకొనవలెను.



ఆభరణాలు

★

చిత్రశిల్పి
శ్రీ చగన్‌లాల్
ఆర్ జాదవ్

★

మాసఫలములు

(నవంబరు 1958)

శ్రీ 'బుధ'

[ఏ సంవత్సరమున పుట్టినను, పుట్టిన తేదీగల రాశిని బట్టి, ఫలము తెలిసికొనునది]

మేషము

మార్చి 21 — ఏప్రిల్ 20

గ్రహములన్ని మిగుల ప్రతికూలము. మీ కృషి వ్యాపారాదులకు, కొన్ని ఆటంకాలు గలుగుతాయి. మీఆరోగ్యం చెడుతుంది. బంధు మిత్రాదులతో విరోధం. ఉద్యోగ వ్యవహారాలలో అధికారుల ఆగ్రహానికి గురి యగుదురు స్థిరధన నష్టం ఋణం చేయటం ఆఖరు వారములో ఆరోగ్యం చక్కబడుతుంది శత్రు జయం కలుగుతుంది యత్నకార్యములు అనుకూలించును.

వృషభము

ఏప్రిల్ 21 — మే 22

గ్రహస్థితి మిశ్రమ ఫలితాన్ని మాత్రమే యిచ్చును స్థితి గతులకు గౌరవప్రతిష్టలకు యెట్టి లోపమును జరుగదు మధ్య మధ్య కొన్ని ఆటంకముల తో యత్నకార్యములు నెరవేరును. కృషి వ్యాపారాదులు యధాప్రకారంగా సాగును. ఆర్థికపరిస్థితులు తృప్తికరంగా యుండవు. వ్యాపారస్తులు విరివిగా వ్యాపారము చేయగలుగుదురు - స్వల్పలాభం మాత్రమే లభిస్తుంది స్పెక్యులేషన్‌లో వారునష్టముకు గురి యగుదురు అష్టమరాశిలో బుధ, శనుల సంబంధము మంచిదికాదు మోసపోవుటయు సంభవమగును. రాజకీయ వాదులకిది ఎక్కువగా వర్తిస్తుంది. గృహవిషయాలలోఅశాంతి సంతతికి అనారోగ్యము. స్త్రీలతో వైరము.

మిధునము

మే 23 — జూన్ 21

ఈ నెలలోకూడా, అంగారకుడు వక్రించుచునే వుండెను. కావున మీకష్టములు పూర్తిగా గట్టెక్కవు. కాని ఎక్కువ గ్రహములు 20 వ తేదీ వరకు అనుకూలంగా వున్నవి ఆశాభంగములైన మీ ప్రయత్నాలు యీ నెలలో తప్పక నెరవేరగలవు ధైర్యోత్సాహములు కలుగగలవు గొప్పవారితోస్నేహం. ప్రభుత్వాదరణ వ్యవహారిక జయము కార్యసానుకూలం. మీ ఆర్థిక యిబ్బందులు కొంతవరకు తీర్చుకొనజాలుదురు వ్యాపారంలో లాభించుచుండును సౌఖ్యము తక్కువే గృహచ్ఛిద్రములు పూర్తిగా వదలవు మీపై దుష్ప్రచారముచేసే స్నేహితులూ వదలరు మీకు, లేదా, కళత్రముకు అనారోగ్యము తప్పదు-ఆఖరు వారము మంచిది కాదు

కర్కాటకము

జూన్ 22 — జులై 22

గత మాసముకన్న ఈ నెలలో గ్రహస్థితి అనుకూలము పంచమమందు గురు శుక్ర రవి యుతి మిగుల శుభము ఆరోగ్యము నిర్మలమైన మనస్సు, రాచకార్య నిర్వహణ, వ్యవహార జయము వృత్తిలో అభివృద్ధి గౌరవము, ఆర్థికలాభము మొదలగు శుభఫలితములు జరుగును బుద్ధిబలముతో కాగల పనులన్నియు నెరవేరును. విద్యార్థులు పరీక్షలలో జయము బొందుదురు, వ్యాపారస్తులు నూతన వ్యాపారములలో పాల్గొనెదరు. వారి స్పెక్యులేషన్ సత్ఫలితాన్నిస్తుంది గృహస్థ జీవితము సుఖప్రదంగా యుంటుంది. శుభకార్య నిర్వహణకై చేయు ప్రయత్నములు అనుకూలించును. పుత్ర - వాహన - భూషణప్రాప్తి.

సింహము

జులై 23 — ఆగస్టు 22

శుభాశుభ మిశ్రమఫలములు. చతుర్థ రవి మంచివాడు కాడు. మనోవ్యాకులత- హృదయ

దౌర్బల్యము. స్థానచలనము - ఇష్టులైనవారితో భేదాభిప్రాయము మొదలగు దుష్ఫలితములిచ్చు చుండును ఉద్యోగ వ్యాపారములకు ఎట్టి ప్రమాదము సంభవించదు తలవని తలంపుగా ఆర్థికలాభము కావ్యపఠనము పండితగోష్టి- దైవోపాసనలతో మనశ్శాంతి కలుగుతుంది. భూ గృహ, సౌఖ్యము - శుభకార్య నిర్వహ ణకై చేయు ప్రయత్నములు అనుకూలించును- వ్యాపారస్తులకు సెలాఖరులో స్పెక్యులేషన్ అనుకూలించును గ్రంథరచయితలకు. చిత్ర కళా పరిశ్రమ చేయువారికి మంచికాలము సంతతి వలన అసౌఖ్యము - కొంతమంది జూదము లాటరీ మొదలగు దుర్వసనము లకు లోనై కష్టనష్టములకు గురియగుదురు

కన్య

అగస్టు 23 — సెప్టెంబరు 22

గ్రహస్థితి మిశ్రమ ఫలితాన్ని మాత్రమే యిస్తూ వుంటుంది మనోవిశ్రాంతి లేకున్ననూ అప్రయత్నముగా కార్యసిద్ధి - ధనలాభము కలుగును. ఉద్యోగ - వ్యాపారధర్మములు 20 తేదీ వరకు సక్రమంగా నడచుచు ఆర్థిక లాభా న్ని చేకూర్చును తృతీయములో రవి, గురు శుక్రుల యుతివలన అధికారులతో, కాగల పనులు నెరవేరును - నూతన మైత్రి శాస్త్ర పరిశోధకులకు, యంత్రపరిశ్రమ చేయువారికి, మంచికాలము గృహస్థ జీవితం సుఖప్రదం గా గడచిపోతూ యుంటుంది - నూతన వస్త్రా భరణభూషణములకై ధన వ్యయము 20వ తేదీ తరువాత మంచిరోజులు కావు అనారో గ్యము-స్థానచలనం, ధన నష్టము కలుగు సూచ నలు గలవు- వ్యాపారస్థులు తమ వ్యాపారాన్ని ఈలోపుగనే ముగించుకొనుట మంచిది

తుల

సెప్టెంబరు 23 — అక్టోబరు 22

మీ గౌరవ ప్రతిష్టలకు, ఆరోగ్యమునకు భంగకరమగు ప్రమాదములు కలవు. కుజ వక్రము మిగుల చెడ్డది నష్టదాయకమైన ప్రయాణములు. స్థాన చలనము మొదలగు దుష్ఫలితములు సంప్రాప్తమగు చుండును. కాని లాభాధిపతికి ధనస్థితి కలిగియుండుటచే కృషివ్యాపారాదులు దైవికంగా కలసిరాగలవు. వృత్తి వుద్యమములలో ఆధిక్యత- అధికారు లకు ప్రమోషను, మొదలగు శుభఫలితములు. తలవనితలంపుగా ద్రవ్యలాభము- వ్యాపారస్థు లకు 20 వ తేదీ పిమ్మట మంచిలాభము దుష్ప్రవర్తనకు పాలుకాకుండుట ఆరోగ్యము కాపాడుకొనుట ముఖ్యము- సారస్వత చిత్ర కళాపరిశ్రమ చేయువారికి మంచికాలము- కళత్ర ఆరోగ్యము చక్కగాయుండదు సంతతి వలన సుఖసంతోషములు కలుగును

వృశ్చికము

అక్టోబరు 23 — నవంబరు 21

మీ రాశినాథుడు వక్రగతి విడువక వ్యతిరేక స్థానములో నున్నా మిగతా గ్రహములన్ని మిగుల అనుకూలంగా యున్నవి ఆరోగ్యము చక్కబడుతుంది. కృషి వ్యాపారాదులు నిరాటం కముగా సాగిపోవుచుండును వృత్తి వుద్యమ ములలో ఆధిక్యత - గొప్పవారి ప్రాపకము సాంఘిక గౌరవము చేకూరుతుంది. ఆర్థిక పరి స్థితులు కొంచెము స్థిమితపడును, మీ సాహిత్య మును విజ్ఞానాన్ని అభివృద్ధి జేసుకొనుదురు. వ్యాపారస్తులకు యీ మాసమంతా అనుకూలం గానే నడచును-భాగస్థులతో మాత్రము కొన్ని పేచీలు రాగలవు - కాని సప్తమ స్థానములో అంగారక స్థితివలన గృహచిక్కులు పూర్తిగా తొలగిపోవు - అంతరంగిక కలహములు యింకా ఎక్కువై ఇష్టులతో యెడబాటగు సూచనలున్నవి మీకు లేదా, కళత్రమునకు ఆరోగ్యము చెడే సూచనలున్నవి జాగ్రత్త అవుసరము

ధనుస్సు

నవంబరు 22 — డిసెంబరు 22

మొదటి 15 రోజులు గ్రహస్థితి మంచిది కాదు శరీర అనారోగ్యము- యత్నకార్య ములు ఫలించవు కృషివ్యాపారాదుల కనేక ఆటంకములు- ధననష్టము మనోవ్యధ. ఇష్టు

ఆరోపితబాటు మొదలగు దుష్ఫలితములతో గడచిపోవును ఆఖరు రెండు వారములలో గ్రహస్థితి అనుకూలించును పై కష్టముల ధైర్యముతో యెదుర్కొనజాలుదురు శుభ వార్తలు అందును- వృత్తి వుద్యములలో అధి క్యత- తలవని తలంపుగా వుద్యోగస్థులకు ప్రమోషన్ ప్రజాదరణ- గౌరవము మొదలగు శుభఫలితములు జరుగగలవు రాచకీయ వ్యవ హారములలో దిరుగువారికి మాత్రము ప్రతి కూలము. పార్టీకక్షలు బాగా యేర్పడి కష్టనష్ట ములకు గురి యగుదురు

మ క ర ము

డిసెంబరు 23 — జనవరి 20

గ్రహస్థితి మిగుల అనుకూలము. దైవిక ముగా మీ యత్నకార్యము లన్నియు కలసి వచ్చును. వృత్తి వుద్యమములలో ఆధిక్యత, చర స్థిరాస్తులను గూర్చిన వ్యవహారములు పరి ష్కారమై. ధనము చేతికి వచ్చును. వ్యవహార చిక్కులు కొంతవరకు తీరిపోవును గౌరవము మనశ్శాంతి కలిగి నూతన ప్రయత్నములు చేయుదురు వ్యాపారస్తులు మంచి లాభముల పొందగలుగుదురు శుభకార్య సంబంధమైన ఆలోచనలు ఫలించును గృహస్థ జీవితము సుఖప్రదంగా గడచిపోవుచుండును, సంతతికి అనారోగ్య కారణమువలన వారి విద్యాభివృద్ధు లకు కొంత ఆటంకము సంభవమగును ప్రయా ణముల వలన కార్యసిద్ధి. కొంతమందికి పర దేశ ప్రయాణము సంభవమగును.

కుం భ ము

జనవరి 21 — ఫిబ్రవరి 19

గ్రహస్థితి బాగుగా యున్నది. తలవని తలంపుగనే మీ యత్నకార్యములు నెరవేరు చుండును పురోగమనావకాశములు సంభవ మగును నూతన వృత్తి వుద్యమములో పాల్గొని ఆర్థికలాభమును పొందగలరు మీ స్వేచ్ఛలేషను కంట్రాక్టుపనులు లౌకిక వ్యవ హారములు ఫలించి మంచి ఆదాయము నివ్వ గలవు వృత్తివుద్యమములలో ఆధిక్యత, గౌర వము ఉద్యోగస్థులకు ప్రమోషను వ్యాపా రస్థులు వారి వ్యాపారములు జయప్రదమై లాభము పొందుదురు. విద్యార్థుల పరిశ్రమ ఫలించును. గొప్పవారి ప్రాపకము, వ్యవహారిక విజయము ఆఖరువారములోమాత్రము గృహస్థ జీవితమందు అశాంతి సంభవమగును

మీ న ము

ఫిబ్రవరి 20 — మార్చి 20

గ్రహస్థితి మిగుల అనుకూలము. నవమ కోణములో గురునితో రవి, సమాగమమగుట వలన తలవనితలంపుగా కొన్ని శుభఫలితములు కలుగగలవు. ముఖ్యముగా కొన్ని మార్పులు కలుగును. దుర్వ్యసనములు దురలవాట్లు తొలగి ఆరోగ్యము, నిర్మలమైన మనస్సు సదాచార ము అలవడును. ఉద్యోగ వ్యాపారములయ ద్భివృద్ధి గౌరవము, ఆర్థికలాభము, చేకూరును రావలసియున్న ధనము సమయమునకు చేతికి రాకపోవుట నూతన వ్యాపారాదికృషుల పెట్టు బడులకై వినియోగించుట కుటుంబ ఖర్చులు అధికమగుటవలన, ఆర్థిక పరిస్థితులలో అసం తృప్తి భూ గృహాభివృద్ధులను గూర్చిన మీ ఆలోచనలు సఫలమవును నూతన, వస్త్రాభరణ భూషణప్రాప్తి, కుటుంబ సౌఖ్యము; సంతాన ప్రాప్తి, మొదలగు సత్ఫలితములు జరుగ గలవు.

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Andhra Printers, Vijayawada-2.